సంక్షేమం అంటే కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు; ఒక కుటుంబానికి విద్యుత్ భారం తగ్గించడం, వంటగ్యాస్ ఖర్చును తగ్గించడం, నాణ్యమైన బియ్యం అందించడం, ఇల్లు నిర్మించుకునే అవకాశం కల్పించడం– ఇవన్నీ కుటుంబ జీవన ప్రమాణాలను మెరుగుపరిచే చర్యలే. ప్రభుత్వం గృహజ్యోతి ద్వారా 53 లక్షలకు పైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చింది. దాదాపు 43 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందుతోంది. 15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులను జారీ చేసి, మరింత మందిని ఆహార భద్రత పరిధిలోకి తీసుకువచ్చింది. రేషన్ కార్డుదారులకు నాణ్యమైన సన్నబియ్యం అందించే కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన పేదలకు సొంత ఇంటి కలను నిజం చేసే దిశగా అడుగులు వేస్తున్నది.

మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములుగా చేసేందుకు స్వయం సహాయక సంఘాలకు భారీగా బ్యాంకు లింకేజీ కల్పించడం; వడ్డీ రాయితీలు ఇవ్వడం; పాఠశాల యూనిఫాంలు, చీరల తయారీ, పెట్రోల్ బంకుల నిర్వహణ, ఆర్టీసీ బస్సుల యాజమాన్యం వంటి కొత్త ఆదాయ మార్గాలను ప్రభుత్వం కల్పించింది.

> **వెయ్యి రోజుల ప్రజాపాలన ఒక మైలురాయి మాత్రమే. తెలంగాణను మరింత బలమైన, సమానత్వంతో కూడిన, పెట్టుబడులకు అనుకూలమైన, ఉపాధి అవకాశాలు కలిగిన, పర్యావరణహితమైన, ప్రపంచస్థాయి రాష్ట్రంగా తీర్చిదిద్దే ప్రయాణంలో ఇది ఒక కీలక దశ.**

సామాజిక న్యాయం కోసం రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను పూర్తి చేసింది ప్రజాప్రభుత్వం. బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభ ఆమోదించి కేంద్రానికి పంపింది. ఎస్సీ ఉపకులాల వర్గీకరణను అమలు చేయడం ద్వారా సామాజిక న్యాయంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమానికి రాష్ట్ర మొత్తం వ్యయంలో గణనీయమైన వాటాను కేటాయిస్తున్నది.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించడం, కొత్త రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేయడం, ఉపాధ్యాయ నియామకాలను చేపట్టడం ద్వారా విద్యారంగంలో సమగ్ర మార్పులకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మెగా డీఎస్సీ ద్వారా 10,006 మంది ఉపాధ్యాయుల నియామకం జరిగింది.

యువత ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా 72 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టింది ప్రభుత్వం. ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న యువతకు నైపుణ్యాభివృద్ధి ద్వారా కొత్త అవకాశాలను కల్పిస్తున్నది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, టాస్క్, టీ–హబ్, టీ–వర్క్స్, వీ–హబ్ వంటి సంస్థల ద్వారా వేలాది మంది యువతకు ఆధునిక నైపుణ్య శిక్షణ అందుతోంది.

తెలంగాణను పెట్టుబడుల అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పారిశ్రామిక విధానాల్లో సంస్కరణలు చేపట్టింది. టీజీ–ఐపాస్ ద్వారా వేలాది పారిశ్రామిక యూనిట్లకు అనుమతులు ఇచ్చి భారీ పెట్టుబడులకు మార్గం సుగమం చేసింది. లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ వంటి భవిష్యత్ రంగాల్లో తెలంగాణను జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నది.

ప్రజా ప్రభుత్వం కేవలం ప్రస్తుత సమస్యలకు పరిష్కారాలు చూపడం మాత్రమే కాదు; వచ్చే తరాల తెలంగాణను నిర్మించేందుకు దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించింది. తెలంగాణ రైజింగ్–2047లో భాగంగా 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నది.

వెయ్యి రోజుల ప్రజాపాలన ఒక మైలురాయి మాత్రమే. తెలంగాణను మరింత బలమైన, సమానత్వంతో కూడిన, పెట్టుబడులకు అనుకూలమైన, ఉపాధి అవకాశాలు కలిగిన, పర్యావరణహితమైన, ప్రపంచస్థాయి రాష్ట్రంగా తీర్చిదిద్దే ప్రయాణంలో ఇది ఒక కీలక దశ. రైతు ముఖంలో చిరునవ్వు, మహిళ చేతిలో ఆర్థిక స్వావలంబన, యువతకు ఉద్యోగం, విద్యార్థికి నాణ్యమైన విద్య, పేదవాడికి సొంత ఇల్లు, ప్రతి కుటుంబానికి ఆరోగ్య భద్రత, ప్రతి ప్రాంతానికి అభివృద్ధి – ఇదే ప్రజా పాలన లక్ష్యం.

● పొన్నం ప్రభాకర్
రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి



జిల్లాకు చేరిన డీఏపీ

చింతకాని, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పందిళ్లపల్లి ర్యాక్ పాయింట్‌కు సోమవారం ఫాక్ట్ కంపెనీకి చెందిన కాంప్లెక్స్ ఎరువులు చేరాయని డీఏవో ధనసరి పుల్లయ్య తెలిపారు. అమ్మోనియా 574.650, డీఏపీ 765.600 మెట్రిక్ టన్నుల మేర వచ్చిందన్నారు. వానా కాలం సీజన్‌లో యాప్ ద్వారా ఎకరాకు ఒక కట్ట డీఏపీ జిల్లా రైతులకు అందజేస్తున్నామని తెలిపారు.

పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

వందేళ్ల ముందుచూపుతో
అభివృద్ధి

- భవిష్యత్‌ను దృష్టి పెట్టుకునే ఖమ్మంలో శాశ్వత పనులు
- ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నా రాజకీయం
- సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్నా
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఖమ్మం త్రీటౌన్‌లో పలు పనులకు శంకుస్థాపన
- తుమ్మలకు ఘనస్వాగతం.. కాంగ్రెస్ కార్యకర్తల భారీ ర్యాలీ

ఖమ్మం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : హైదరాబాద్ తర్వాత అన్ని వర్గాలను ఆకర్షించే నగరంగా ఖమ్మాన్ని రూపుదిద్దుతున్నామని, వందేళ్ల ముందుచూపుతో నగరంలో శాశ్వత అభివృద్ధి పనులు చేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన ఖమ్మం నగర పర్యటనలో భాగంగా ప్రకాష్‌నగర్‌లో పత్తి మార్కెట్ నుంచి ధంసలాపురం వరకు రూ.12కోట్లతో చేపట్టే రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగినసభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఆయన ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవసాయశాఖ మంత్రిగా రైతుల సంక్షేమం, సాగు రంగం బలోపేతం కోసం పనిచేస్తున్నానన్నారు. ఆయన సారథ్యంలోని ప్రజాప్రభుత్వ వెయ్యిరోజుల పాలనలో ఒక్కో సమస్యను పరిష్కరించుకుంటూ అభివృద్ధి, సంక్షేమం దిశగా సాగుతున్నామన్నారు. అభివృద్ధే తన రాజకీయమని, గత ఎన్నికల్లో పార్టీ అధిష్ఠానం తనను ఖమ్మం పంపితే ఇక్కడి ప్రజలు గుండెల్లోపెట్టుకుని ఆశీర్వదించారని, వారి ఆశీర్వాదానికి అనుగుణంగా నియోజకవర్గాన్ని, ఉమ్మడి జిల్లాను అన్నిరంగాల్లో ముందుకు తీసుకుపోతున్నానన్నారు. ప్రజల కోరికమేరకే రాజకీయాల్లోకి వచ్చానని, అందుకే వారు కోరుకున్న చోటే పోటీచేశానని, వారి ఆశీర్వాదంతోనే రాజకీయాల్లో కొనసాగుతున్నానని స్పష్టం చేశారు. ఖమ్మం ప్రజల దీర్ఘకాల సమస్యలను పరిష్కరిస్తున్నానని, రాజకీయాలకతంగా అభివృద్ధి చేస్తూ.. దౌర్జన్యాలు, అక్రమాలకు, కబ్జాలకు తావులేకుండా శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నారని, ఇందులో భాగంగా

(మిగతా 4వ పేజీలో)

దశాబ్దాల కాలంగా భూమి యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలకు రీ సర్వేతో పరిష్కారం లభించబోతోంది. రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం అమలు చేస్తున్న క్రమంలో భూ సర్వే ద్వారా మాత్రమే భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని గుర్తించింది. దీంతో రాష్ట్రంలో ప్రతీ జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను రీ సర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా.. ఖమ్మం జిల్లాలో మాత్రం పాలేరు నియోజకవర్గంలో 69గ్రామాలతో పాటు జిల్లాలోని ఇతర మండలాల్లో మరో 70 రెవెన్యూ గ్రామాలు మొత్తం 139 గ్రామాల్లో భూముల రీ సర్వేకు నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ప్రాంతంలో భూములను 1930లో సర్వే చేయగా ఇప్పటి వరకూ రీ సర్వే జరగకపోవడంతో.. అనేక భూ సమస్యలు ఎదురవుతున్నాయి.

బేతుపల్లి రెవెన్యూలో రైతులు, సర్వే సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర (ఫైల్)

139 గ్రామాల్లో రీసర్వే!

- దశాబ్దాల నాటి సమస్యలకు పరిష్కారమే లక్ష్యంగా నిర్ణయం
- జిల్లాలో పూర్తి కావొచ్చిన మొదటి విడత ప్రక్రియ
- రోవర్లను వినియోగిస్తున్న సిబ్బంది
- క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి సూచనలిస్తున్న కలెక్టర్

సత్తుపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మొదటగా ఎర్రుపాలెం మండలంలోని మొలుగుమాడు రెవెన్యూ గ్రామంలో రీ సర్వే పూర్తి చేసి ఆ గ్రామంలో రైతులకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా పట్టాదారు పాస్‌పుస్తకాలు అందజేసిన విషయం విదితమే. ప్రస్తుతం పాలేరు నియోజకవర్గంలోని భగవత్‌వీడు, తిరుమలాయపాలెం మండలం కాకరవాయి, సత్తుపల్లి మండలం బేతుపల్లి రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే చేపట్టారు. భగవత్‌వీడు రెవెన్యూలో 500ఎకరాలు, కాకరవాయి గ్రామంలో సుమారు 1,200 ఎకరాల రీ సర్వే ఇటీవల పూర్తి అయింది. సత్తుపల్లి మండలంలో బేతుపల్లి రెవెన్యూ పరిధిలో 12,047 ఎకరాల విస్తీర్ణం కలిగిన భూమి ఉంది. బేతుపల్లి రెవెన్యూ ఏడు గ్రామ పంచాయతీల పరిధిలో విస్తరించి ఉండటంతో ఇక్కడ కొంత సమయం పట్టే అవకాశం ఉంది. మరో 15 రోజుల్లో సర్వే పూర్తయ్యే అవకాశం ఉందని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్సు డీఐ నాగభూషణం తెలిపారు. గత నెల 21న బేతుపల్లిలో ప్రారంభమైన సర్వే 15రోజుల్లో పూర్తి కానుంది. ఇప్పటి వరకూ 3,290 మంది రైతులకు చెందిన 6,971 ఎకరాల రీ సర్వే పూర్తి చేశారు. సర్వే కోసం ఒక్కో బృందంలో ముగ్గురు సర్వేయర్ల చొప్పున మొత్తం పది బృందాలు సర్వేలో పాల్గొంటున్నాయి.

రీ సర్వే తీరు ఇలా..

పక్కాగా లెక్క తేలే విధంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూముల రీ సర్వే చేస్తున్నారు. దీని కోసం జిల్లాలో 32 రోవర్ మిషన్లను కొనుగోలు చేసి సర్వే సిబ్బందికి అందజేశారు. జియో పొజిషనింగ్ సిస్టం అమలు చేస్తున్నారు. ప్రతీ రైతు భూమి జీపీఎస్ చేస్తున్నారు. రీ సర్వేలో భాగంగా తొలుత రెవెన్యూ గ్రామం సరిహద్దులు గుర్తిస్తారు. బై జంక్షన్, ట్రైజంక్షన్ ద్వారా పాత కాలంలో వేసిన సరిహద్దు రాళ్లను గుర్తిస్తున్నారు. అనంతరం రెవెన్యూ గ్రామం పరిధిలో ప్రభుత్వ భూములు, దేవాదాయ, అటవీ, భూ సేకరణలో తీసుకున్న భూములు, చెరువులు, నాళాలు, ప్రభుత్వ భవనాల లెక్కలు తేలిన తరువాత రైతుల పట్టా భూములు సర్వే చేస్తున్నారు. ప్రతీ రైతుకు సంబంధించి సాగులో ఎంత విస్తీర్ణంలో ఉన్నారు. సదరు రైతుకు రికార్డు పరంగా హక్కులు పరిశీలించి నమోదు చేసుకుంటూ మ్యాపులు కూడా తయారు చేస్తున్నారు. ఈ క్రమంలో భూమి లేకుండా పాస్‌పుస్తకాలు పొంది రికార్డుల్లోకెక్కిన వారిని కూడా నమోదు చేస్తున్నారు.

కలెక్టర్ పరిశీలన.. సూచనలు

సర్వే జరుగుతున్న రెవెన్యూ గ్రామాల్లో కలెక్టర్ దివాకర పలుసార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి ఎప్పటికప్పుడు సిబ్బందికి పలు సూచనలు చేస్తున్నారు. ముందుగా ప్రీ రీ సర్వే డేటాను నమోదు చేసిన అనంతరం సర్వే జరుగుతున్న సమయంలో వారికి కేటాయించిన ఫీల్డ్ సర్వేకు సంబంధించి ప్రతీ రోజు డేటా ఎంట్రీ చేయాలని కలెక్టర్ సూచించారు. రెండు దశల (మిగతా 6వ పేజీలో)

భద్రాచలం వద్ద గోదావరి

హమ్మయ్య.. ఆగస్టు
గండం గడిచింది..

ఊపిరి పీల్చుకున్న గోదావరి తీర ప్రజలు

భద్రాచలం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): హమ్మయ్య.. ఆగస్టు గండం గడిచింది.. గోదావరి నదీ పరివాహక ప్రాంత వాసులకు వర్షా కాలంలోనూ ముచ్చెమటలు పట్టించే ఆగస్టు నెలలో ఈసారి వరద తీవ్రత అంతగా లేకపోవడంతో అధికారులు, నదీ పరివాహక ప్రాంతవాసులు ఊపిరి పీల్చుకున్నారు. వాస్తవానికి జూలై 30న గోదావరి వరద క్రమ క్రమంగా పెరిగి ఆగస్టు ఒకటిన 56.1 అడుగులకు చేరి తుది ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహించింది. అనంతరం క్రమేపీ గోదావరి తగ్గుముఖం పట్టింది.

అయితే ఆగస్టు నెలలో మిగిలిన రోజుల్లో గోదావరి ఆగస్టు 26న 35.1 అడుగులకు నమోదై అనంతరం తగ్గుముఖం పట్టింది. 2024లోనూ గోదావరి నీటిమట్టం భద్రాచలం వద్ద దశాబ్దన్నర కాలంలో కనిష్ఠంగా 28.6 నమోదైంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది స్వల్పంగా మాత్రమే గోదావరి నీటిమట్టం పెరిగింది.

ప్రజావాణికి తగ్గిన అర్జీదారులు

- ప్రజాసమస్యలను తక్షణమే పరిష్కరించాలి
- దరఖాస్తులను స్వీకరించిన అదనపు కలెక్టర్లు

ప్రజావాణికి తగ్గిన జనం

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి అర్జీదారులు తగ్గిపోయారు. ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమానికి ప్రజలు పెద్దసంఖ్యలో వచ్చేవారు. కానీ జిల్లాలో గత రెండు వారాలుగా మండల, రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి నిర్వహిస్తుండడంతో జిల్లాస్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి దరఖాస్తుదారులు తగ్గిపోయారు. దీంతో కలెక్టరేట్‌లో అధికారులు వచ్చిన గంట సేపట్లోనే ప్రజలు తమ దరఖాస్తులను అందించి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీజ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం అందించిన ప్రతి దరఖాస్తును త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో సీహెచ్ రామ్మూర్తి, కలెక్టరేట్ ఏవో కారుమంచి శ్రీనివాసరావు, డీఎస్వో చందన్‌కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ రామారావు, డీసీవో గంగాధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందిన ఫిర్యాదుల్లో కొన్ని ఇలా..

- జిల్లాలో ఉన్న విద్య, వైద్య, ఇతర అంశాలను సూచిస్తూ సమస్యలు పరిష్కరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఖమ్మం జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కోరారు.
- కామేపల్లి మండలం గోవింద్రాల గ్రామ పంచాయతీకి చెందిన సంతోష్ గ్రామంలో ప్రత్యేక అధికారి పాలన కాలంలో సుమారు రూ.9 లక్షల వరకు జరిగిన బిల్లుల చెల్లింపులపై సమగ్ర విచారణ, ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని కోరుతూ ఫిర్యాదు చేశాడు.
- కల్లూరు మండలం తాళ్లూరి వెంకటాపురం గ్రామానికి చెందిన పాశం నాగేశ్వరరావు తన కుమార్తె పాశం ప్రియమణిని లంకపల్లి బీసీ గురుకులం నుంచి రెబ్బవరం బీసీ గురుకులం పాఠశాలకు మార్చాల్సిందిగా కోరుతూ దరఖాస్తు చేసుకున్నాడు.
- తిరుమలాయపాలెం మండలం తాళ్లచెరువు గ్రామానికి చెందిన జోగుపర్తి బుచ్చమ్మ తన భర్త మరణించిన తర్వాత తనకు తెలియకుండా భర్త పేరు మీద ఉన్న ఆరు ఎకరాల 30 గుంటల భూమి తన కుమారుడు, కోడలు వారి పేరు మీద పాస్ పుస్తకం చేయించుకున్నారని, ఇప్పుడు తన సంరక్షణకు కూడా ఎటువంటి సహాయం చేయడం లేదని తన పోషణ పరంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది.

గిరిబిడ్డల భవిష్యత్‌కు 'వారధి'

- ఉమ్మడి జిల్లాలో 60 పాఠశాలల్లో 6,237 మంది చిన్నారులకు లబ్ధి
- 5న ఆవిష్కరించనున్న మంత్రి అడ్లూరి

4

DCCB Khammam
జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ లిమిటెడ్, ఖమ్మం.
ఖమ్మం రూరల్ బ్రాంచ్, ఖమ్మం.

బహిరంగ వేలము ప్రకటన

ఇ.పి.నెం.1772/2023-2024, తేది : 28-11-2025

శ్రీ సూరోజు కుమారస్వామి, తండ్రి : వెంకయ్య, నివాసం : తనగంపాడు గ్రా॥, ఖమ్మం రూరల్ మం॥, ఖమ్మం జిల్లా. వీరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, ఖమ్మం రూరల్ బ్రాంచ్, ఖమ్మంనందు KML/24 ఋణము తీసుకొని సకాలంలో చెల్లింపక వాయిదా మీరి ఉన్నారు. అట్టి ఋణముల వసూలు నిమిత్తం వారికి ఉన్నటువంటి తనగంపాడు రెవిన్యూలో ఉన్న ఆస్తిని బహిరంగ వేలము ద్వారా విక్రయించి బాకీయిలను రాబట్టుకొనుటకు ది. 03-09-2026 వ తేదీన ఉదయం 11.45 గం॥లకు, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, ప్రధాన కార్యాలయం, గాంధీచౌక్, ఖమ్మం నందు బహిరంగ వేలము నిర్వహించబడును. కనుక ఆసక్తి గల వ్యక్తులు వేలములో పాల్గొని ఈ క్రింద తెలుపబడిన షరతులకు లోబడి కొనుగోలు చేసుకొనవచ్చును.

వేలము వేయు వ్యవసాయం భూమి వివరములు

క్రమ సంఖ్య	సర్వే నెం.	విస్తీర్ణం	హద్దులు	రెవిన్యూ గ్రామం	రెవిన్యూ మండలం
1.	35/ఈ3	ఎ. 2.20 కుంటలు	తూర్పు : ఎస్.కె. బాబు పడమర : రవిచంద్ర ఉత్తరం : పి. వెంకయ్య దక్షిణం : యస్. రాంబాబు	తనగంపాడు రెవిన్యూ గ్రామం	ఖమ్మం రూరల్
2.	115/ఈ 115/ఇ 116/ఇ/అ	ఎ. 0.1275 కు.లు ఎ. 0.1275 కు.లు ఎ. 0.38 కు.లు	తూర్పు : ఏ.ఉపేంద్రాచారి పడమర : బి. అచ్చమ్మ ఉత్తరం : యం. భద్రయ్య దక్షిణం : పి. వెంకటరాములు	తనగంపాడు రెవిన్యూ గ్రామం	ఖమ్మం రూరల్

వేలము షరతులు : 1) వేలములో పాల్గొను పాటదారుడు రూ. 15000/- ధరావతు (ఈఎమ్‌డి-డి.డి) వేలమునకు ముందు సేల్ ఆఫీసర్, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, ఖమ్మం రూరల్ బ్రాంచ్, బోసు బొమ్మ సెంటర్, ఖమ్మం జిల్లా పేరున డి.డి./చెలానా తీసుకొని అట్టి డి.డి./చెలానాని సేల్ ఆఫీసర్ గారికి ఇచ్చి వేలములో పాల్గొనవచ్చును. 2) అత్యధిక పాటదారుడు పాటపాడిన మొత్తంలో 15% సొమ్ము వెంటనే చెల్లించవలెను. అట్లు చెల్లించని యెడల సదరు ఆస్తిని తిరిగి వెంటనే వేలము వేయబడును. 3) వేలంలో సరైన ధర రాకపోయిననూ మరియు ఏ కారణములు చూపకుండా వేలం నిలిపివేయుట లేదా వాయిదా వేయుటకు సేల్ ఆఫీసర్ గారికి పూర్తి అధికారములు కలదు. 4) మిగిలిన 85% సొమ్మును మరియు రిజిస్ట్రేషన్ కొరకు స్టాంపు డ్యూటీ విలువ వేలం తేదీ నుండి 15 రోజులలోపు చెల్లించవలెను. అట్లు చెల్లించని యెడల ముందు చెల్లించిన 15% సొమ్మును ప్రభుత్వ ఖజానాకు జమ చేయబడును. 5) వేలం పాటలో పాల్గొనువారు సదరు గ్రామంలో గల భూములను సర్వే నంబరు ప్రకారం తనిఖీ చేసుకొనవచ్చును. 6) భూముల వివరములు ఇచ్చుటలో గాని, వైశాల్యము వివరములు అంచనా వేయుటలో కలుగు తప్పులకు బ్యాంకు వారు బాధ్యులు కారని స్పష్టంగా తెలుసుకొనవలెను. 7) పైన తెలిపిన భూములకు ఏక మొత్తంగా గాని, సర్వే నెంబర్ల ప్రకారం విడివిడిగా గాను, వేలం వేయుగల అధికారం గలదు.

ఇతర వివరముల కొరకు : 9948987755, 9948312655, 7989119944 నెంబర్లను సంప్రదించగలరు.

సం/- సేల్ ఆఫీసర్,
జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, ఖమ్మం రూరల్ బ్రాంచ్, బోసుబొమ్మ సెంటర్, ఖమ్మం.

జూదరుల కోసం
పోలీసుల జల్లెడ

- 35కు చేరిన పేకాటరాయుళ్ల సంఖ్య
- పేటకు చెందిన ముగ్గురు నిర్వాహకుల అరెస్ట్

అశ్వారావుపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఏపీ సరిహద్దు ప్రాంతాలైన తెలంగాణలోని పలు ప్రదేశాల్లో భారీ ఎత్తున పేకాట శిబిరాల నిర్వహణ, లక్షలాది రూపాయలు చేతులు మారుతున్న వైనంపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాలు ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అలాగే పోలీసు అధికారులను కదలించింది. తీవ్రంగా స్పందించిన పోలీస్ అధికారులు పేకాట నిర్వాహకులు, ఏపీకి చెందిన జూదరుల కోసం జల్లెడ పడుతున్నారు. మరింత లోతుగా విచారణ చేపట్టారు. సంఘటనా స్థలంలో దొరికిన వాహనాలు, ఇతర సమాచారం మేరకు పేకాటరాయుళ్లపై కేసులు నమోదు చేసారు. శనివారం నిర్వహించిన దాడుల సమయంలో 9మందిని అదుపులోకి తీసుకోగా మరో 14 మంది పరారైనట్టు చూపారు. తదుపరి విచారణలో మరో 12 మందిపైన కేసులు నమోదు చేసారు. అంటే ఈ కేసులో మొత్తం 35 మందిపైన ఇప్పటి వరకు కేసులు నమోదు చేశారు. వీరిలో ఏపీకి చెందిన వ్యక్తులున్నట్టు సమాచారం. ఇదిలా ఉండగా అశ్వారావుపేటకు చెందిన పేకాట నిర్వాహకులు ఆకుల శేఖర్, దుగ్గుమళ్ల నరేంద్ర, మురళి అనే వారిని సోమవారం అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ యయాతి రాజు తెలిపారు. శనివారం పట్టుబడిన 9 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి, తహసీల్దార్ కార్యాలయంలో హాజరుపరిచారు. వీరిలో కొంతమంది పలు రాజకీయ పార్టీలతో అనుబంధం ఉండటంతో ఈ కేసును ప్రతీ ఒక్కరూ ఆసక్తిగా గమనిస్తున్నారు. ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన వ్యక్తులపైనే కేసులు నమోదవడం చర్చనీయాంశంగా మారింది.

5వ తేదీ వరకు
రేషన్ బియ్యం పంపిణీ?

- జిల్లాలో 96శాతం బియ్యం పంపిణీ
- అవసరం మేర అందక డీలర్లు, లబ్ధిదారుల ఇబ్బందులు

4

పోలీస్ అధికారుల బదిలీలకు
రంగం సిద్ధం?

నేడో రేపో ఉత్తర్వులకు అవకాశం

ఖమ్మంక్రైం, ఆగస్టు 31, (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం కమిషనరేట్‌లో సీఐలుగా విధులు నిర్వహిస్తున్న పలువురు అధికారులను బదిలీ చేసేందుకు జిల్లా పోలీస్ బాస్ రంగం సిద్ధం చేసినట్టు తెలిసింది. ఒక అధికారి విధుల్లో చేరిన నుంచి రెండేళ్ల కాలం పూర్తయిన తరువాత బదిలీ అవ్వాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో కొంతమంది అధికారులు ఏళ్లుగా ఉన్న చోటే విధులు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా కొందరు అధికారులపై కొద్దిరోజులుగా ఆరోపణలు కూడా రావడంతో బాస్ కొందరిపై సీరియస్ అయినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో విధుల సమయం కూడా ముగిసిన వారికి బదిలీలకు ఫైల్ సిద్ధమైనట్టు సమాచారం. వారికి నేడో రేపో ఉత్తర్వులు కూడా వెలువడనున్నట్లు తెలుస్తోంది.

పోస్టింగ్ కావాలంటూ...

కమిషనరెట్‌లోని పలువురు సీఐల బదిలీలు జరుగుతున్నాయని తెలియడంతో ఏన్నో రోజులుగా పోస్టింగ్‌లకోసం ఎదురుచుస్తున్న అధికారులు తమ పోస్టింగ్ కావాలంటూ పలువురు నాయకుల వద్దకు తిరుగుతున్నట్టు సమాచారం. అదేవిధంగా పలువురు అధికారులకు ఇప్పటికే హామీ కూడా వచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. మిగిలిన అధికారులు ఎక్కడ పోస్టింగ్ ఇచ్చినా వెళతామని కిందిస్థాయి సిబ్బందితో అంటున్నట్టు తెలుస్తోంది. కొన్ని చోట్ల విధులు నిర్వహించేందుకు మాత్రం తప్పకుండా అక్కడే పోస్టింగ్ కావాలంటూ కొందరు అధికారులు ప్రయత్నాలు జరుపుతున్నట్టు పోలీస్‌శాఖలో ప్రచారం జరుగుతోంది. అయితే కొద్ది రోజుల క్రితం డీజీపీ సీవీ ఆనంద్ ఖమ్మం వచ్చిన సమయంలో అధికారులు జాగ్రత్తగా విధులు నిర్వహించాలని, లేదంటే చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. దినిని దృష్టిలో పెట్టుకున్న ఉన్నతాధికారులు మంచి అధికారులను ఖమ్మం తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు సమాచారం.

ఆ అధికారికి కూడా బదిలీ ఉండేనా?

ఖమ్మం కమిషనరట్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న ఓ అధికారిపై కొంతకాలంగా పలు ఆరోపణలు వస్తున్నాయి. గతంలో సదరు అధికారికి బదిలీ అయినా తన పలుకుబడితో బదిలీ ఉత్తర్వును రద్దు చేయించుకుని మళ్లీ పాత స్థానంలోనే విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయం పై 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల కథనం కూడా ప్రచురితమైంది. అయితే సదరు అధికారి ఓరైతు అప్పుల విషయంలో మధ్యవర్తిగా ఉన్న ఓ వ్యక్తి ద్వారా భారీగా ముడుపులు తీసుకున్నట్టు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో సదరు అధికారి కూడా ఉన్నారా? లేరా? అని పోలీస్ శాఖలోని అధికారులు కూడా చర్చించుకుంటున్నారు. అదేవిధంగా జిల్లాలోని పలువురు అధికారులతో కూడా ఆయన సరిగా మాట్లాడరని అధికారులే అంటున్నట్టు సమాచారం.

DCCB Khammam
జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ లిమిటెడ్, ఖమ్మం.
ఖమ్మం రూరల్ బ్రాంచ్, ఖమ్మం.

బహిరంగ వేలము ప్రకటన

ఇ.పి.నెం.531/2025-2026, తేది : 03-01-2026

శ్రీ పంగ వెంకటేశ్వర్లు, తండ్రి : నాగయ్య, నివాసం : యం.వి.పాలెం గ్రా॥, ఖమ్మం రూరల్ మం॥, ఖమ్మం జిల్లా. వీరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, ఖమ్మం రూరల్ బ్రాంచ్, ఖమ్మంనందు PMEGP/136 ఋణము తీసుకొని సకాలంలో చెల్లింపక వాయిదా మీరి ఉన్నారు. అట్టి ఋణముల వసూలు నిమిత్తం వారికి హామీగా ఉన్న శ్రీ గుద్దేటి వెంకన్న, తండ్రి : వీరయ్య, యం.వి.పాలెం గ్రామంలో ఉన్నటువంటి భూమిని, యం.వి.పాలెం రెవిన్యూలో ఉన్న ఆస్తిని బహిరంగ వేలము ద్వారా విక్రయించి బాకీయిలను రాబట్టుకొనుటకు ది. 03-09-2026 వ తేదీన ఉదయం 11.45 గం॥లకు, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, ఖమ్మం రూరల్ బ్రాంచ్, ఖమ్మం నందు బహిరంగ వేలము నిర్వహించబడును. కనుక ఆసక్తి గల వ్యక్తులు వేలములో పాల్గొని ఈ క్రింద తెలుపబడిన షరతులకు లోబడి కొనుగోలు చేసుకొనవచ్చును.

వేలము వేయు వ్యవసాయం భూమి వివరములు

క్రమ సంఖ్య	సర్వే నెం.	విస్తీర్ణం	హద్దులు	రెవిన్యూ గ్రామం	రెవిన్యూ మండలం
1.	296/ఎ 331ఎ2 మొత్తం	ఎ. 0.20 కు.లు ఎ. 0.0850కు.లు ఎ. 0.3150కు.లు	తూర్పు : మునిగంటి వెంకట్రామయ్య పడమర : మునిగంటి రామయ్య ఉత్తరం : తుపాకుల పుల్లయ్య దక్షిణం : వి. నాగయ్య	యం.వి.పాలెం రెవిన్యూ గ్రామం	ఖమ్మం రూరల్
2.	305/బి	ఎ. 0.2350కు.లు	తూర్పు : చిర్ర రాములు పడమర : రోడ్డు ఉత్తరం : తుమ్మల వెంకయ్య దక్షిణం : కొమ్ము తిరుపయ్య	యం.వి.పాలెం రెవిన్యూ గ్రామం	ఖమ్మం రూరల్

వేలము షరతులు : 1) వేలములో పాల్గొను పాటదారుడు రూ. 15000/- ధరావతు (ఈఎమ్‌డి-డి.డి) వేలమునకు ముందు సేల్ ఆఫీసర్, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, ఖమ్మం రూరల్ బ్రాంచ్, బోసు బొమ్మ సెంటర్, ఖమ్మం జిల్లా పేరున డి.డి./చెలానా తీసుకొని అట్టి డి.డి./చెలానాని సేల్ ఆఫీసర్ గారికి ఇచ్చి వేలములో పాల్గొనవచ్చును. 2) అత్యధిక పాటదారుడు పాటపాడిన మొత్తంలో 15% సొమ్ము వెంటనే చెల్లించవలెను. అట్లు చెల్లించని యెడల సదరు ఆస్తిని తిరిగి వెంటనే వేలము వేయబడును. 3) వేలంలో సరైన ధర రాకపోయిననూ మరియు ఏ కారణములు చూపకుండా వేలం నిలిపివేయుట లేదా వాయిదా వేయుటకు సేల్ ఆఫీసర్ గారికి పూర్తి అధికారములు కలదు. 4) మిగిలిన 85% సొమ్మును మరియు రిజిస్ట్రేషన్ కొరకు స్టాంపు డ్యూటీ విలువ వేలం తేదీ నుండి 15 రోజులలోపు చెల్లించవలెను. అట్లు చెల్లించని యెడల ముందు చెల్లించిన 15% సొమ్మును ప్రభుత్వ ఖజానాకు జమ చేయబడును. 5) వేలం పాటలో పాల్గొనువారు సదరు గ్రామంలో గల భూములను సర్వే నంబరు ప్రకారం తనిఖీ చేసుకొనవచ్చును. 6) భూముల వివరములు ఇచ్చుటలో గాని, వైశాల్యము వివరములు అంచనా వేయుటలో కలుగు తప్పులకు బ్యాంకు వారు బాధ్యులు కారని స్పష్టంగా తెలుసుకొనవలెను. 7) పైన తెలిపిన భూములకు ఏక మొత్తంగా గాని, సర్వే నెంబర్ల ప్రకారం విడివిడిగా గాను, వేలం వేయుగల అధికారం గలదు.

ఇతర వివరముల కొరకు : 9948987755, 9948312655, 7989119944 నెంబర్లను సంప్రదించగలరు.

సం/- సేల్ ఆఫీసర్,
జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, ఖమ్మం రూరల్ బ్రాంచ్, బోసుబొమ్మ సెంటర్, ఖమ్మం.

విద్య, వైద్య సమస్యలు పరిష్కరించకపోతే
ఉద్యమాలు ఉధృతం చేస్తాం

కలెక్టరేట్ ఎదుట సీపీఎం మహాధర్నా

పాల్గొన్న జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

మహాధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంఅర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విద్యా, వైద్యరంగాల సమస్యలు వెంటనే పరిష్కరించక పోతే ఆందోళణలు ఉధృతం చేస్తామని సీపీఎం నాయకులు హెచ్చరించారు. ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థలు, హాస్టళ్లు, వైద్యశాలల్లో నెలకొన్న అసౌకర్యాలు తీర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సోమవారం ఖమ్మం కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహించారు. అనంతరం భారీ సంఖ్యలో కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ విద్యాలయాలు, కళాశాలలు, హాస్టళ్లతో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతులు, సదుపాయాల లేమిపై సీపీఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి అనేక సమస్యలు గుర్తించామన్నారు. విద్యాలయాల్లో విద్యార్థులు బల్లలు, మరుగుదొడ్లు, తదితర వసతులు లేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల్లేమి వెంటాడుతోందన్నారు. ఖమ్మంలోని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది కొరత, మందుల కొరత ఉండటంతో రోగులు అవస్థలకు గురవుతున్నారన్నారు. జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ సామాన్యులకు విద్య, వైద్య సదుపాయాలు కరువయ్యాయన్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిని వెంటనే వెయ్యి పడకల స్థాయికి పెంచాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఖమ్మం జిల్లాలో విద్య, వైద్య సదుపాయాలను మెరుగు పరచకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళణ చేస్తామని హెచ్చరించారు. ఆందోళన కార్యక్రమంలో సీపీఎం నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, మాచర్ల భారతి, కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేష్, మాదినేని రమేష్, యర్రాశ్రీనివాసరావు, బొంతు రాంబాబు, భుక్యా వీరభద్రం, బండి పద్మ తదితరులు పాల్గొన్నారు.

గిరిబిడ్డల భవిష్యత్‌కు ‘వారధి’

- ఆశ్రమ విద్యార్థుల పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా పుస్తకం
- ఉమ్మడి జిల్లాలో 60 పాఠశాలల్లో 6,237 మంది చిన్నారులకు లబ్ధి
- పుస్తకాన్ని రూపొందించిన తొలి ఐటీడీఏగా రాష్ట్రంలోనే భద్రాద్రికి ఖ్యాతి

భద్రాచలం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న గిరిబిడ్డలు పోటీ పరీక్షలకు వెళ్లే సమయంలో వారి శక్తి సామర్థ్యాలు పెంచి దీటుగా పోటీ పరీక్షలు రాసేందుకు వారధి ఎంతో ఉపయోగపడనుంది. భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ ప్రత్యేక చొరవతో రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి పోటీ పరీక్షల్లో విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచేందుకు భద్రాచలం ఐటీడీఏ వారధి పుస్తకాన్ని రూపొందించింది. ఈ వారధి పుస్తకాన్ని ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో 8, 9 తరగతులు చదివే విద్యార్థులకు అందించనున్నారు. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 60 పాఠశాలల్లో 6,237 మంది విద్యార్థులకు వారధి పుస్తకాన్ని అందించనున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 50 పాఠశాలల్లో 5,517 మంది, ఖమ్మం జిల్లాలో 10 పాఠశాలల్లో 720మంది విద్యార్థులకు వారధి ద్వారా లబ్ధి చేకూరనుంది.

5న వారధిని ఆవిష్కరించనున్న మంత్రి అడ్లూరి

- ఐటీడీఏ పీవో బి.రాహుల్

ఐటీడీఏ ఆధ్వర్యంలో రాష్ట్రంలో తొలిసారిగా పోటీ పరీక్షల్లో విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పెంచేందుకు రూపొందించిన వారధిని ఈనెల 5న రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ భద్రాచలంలో ఆవిష్కరించనున్నారు. ఇందుకోసం ఈనెల 4న రాత్రి భద్రాచలం చేరుకోనున్నారు. 5న రామయ్య దర్శనం అనంతరం ఐటీడీఏ పరిధిలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. అలాగే అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. వారధిని వారానికి మూడు రోజుల్లో ఒక పీరియడ్‌లో బోధించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇందులో భాగంగా బుధవారం ఉపాధ్యాయులకు కూడా శిక్షణ ఇవ్వనున్నాం.

ఇప్పటికే ఉద్దీపకంతో ప్రాథమిక విద్యకు ఊపిరి

వాస్తవానికి ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో గతంలో విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు ఆశించిన స్థాయిలో లేవని పరిశీలనలో తేలింది. దీంతో భద్రాచలం ఐటీడీఏ పీవోగా రెండేళ్ల క్రితం బాధ్యతలు చేపట్టిన రాహుల్ ప్రాథమిక విద్య బలోపేతానికి చర్యలు చేపట్టారు. ఇందులోభాగంగా ఉద్దీపకం రూపకల్పనకు శ్రీకారం చుట్టగా అది విద్యార్థుల మేధో వికాసానికి దోహదపడింది. దీంతో ఈఏడాది సైతం మూడో ఉద్దీపకాన్ని విద్యార్థులకు అందించారు. దీంతో ఇప్పటికే విద్యార్థులకు ఉద్దీపకంతో ప్రాథమిక విద్యకు ఊపిరి పోసినట్లు అయ్యింది.

40 రోజులు.. ఐదుగురు ఉపాధ్యాయుల రూపకల్పన

తాజాగా భద్రాచలం ఐటీడీఏ రూపొందించిన వారధితో పోటీ పరీక్షలను ఎదుర్కొనే సామర్థ్యం విదార్థుల్లో పెరుగుతుందని ఐటీడీఏ అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటి వరకు ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమాల్లో చదివిన విద్యార్థుల్లో మౌలిక సామర్థ్యాలు పోటీ పరీక్షలను ఎదుర్కొనే స్థాయిలో లేవని గుర్తించి ఆ ఆటంకాలను అధిగమించేందుకు వారధిని తీసుకొస్తున్నారు. ఇందుకోసం ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఐదుగురు ఉపాధ్యాయులను గుర్తించి వారితో వారధి పుస్తకాన్ని రూపొందించేందుకు చర్యలు చేపట్టగా 40రోజుల వ్యవధిలో వారు దీనిని రూపొందించడం విశేషం. ఇందులో జనరల్ ఇంగ్లీష్, గ్రామర్, ఒకాబులరీ, కాంప్రిహెన్షన్, మ్యాథమెటిక్స్, రీజనింగ్, అర్థమెటిక్ అంశాలను పొందుపరిచారు.

ప్రజల అవసరాలు, రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా బాధ్యతలు

తెలంగాణ లెజిస్లేచర్ ఎస్టిమేట్స్ కమిటీ చైర్మన్ కోరం కనకయ్య

శాసనసభ కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ

ఎస్టిమేట్స్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కోరం కనకయ్య

ఇల్లెందు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరాలు, రాష్ట్ర అభివృద్ధి, ప్రభుత్వ నిధుల సద్వినియోగం లక్ష్యంగా ఎస్టిమేట్స్ కమిటీ బాధ్యతలు నిర్వర్తిస్తుందని తెలంగాణ శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే కోరం కనకయ్య పేర్కొన్నారు. శాసనసభ కార్యాలయంలో సోమవారం ఆయన ఎస్టిమేట్స్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన అధ్యక్షతన కమిటీ తొలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిధులుగా శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్ హాజరై కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధుల కేటాయింపులు, వివిధ శాఖల పనితీరు, ప్రభుత్వ అంచనాలు, వ్యయాలపై సమగ్రంగా చర్చించి ప్రజలకు మరింత మెరుగైన పాలన, అభివృద్ధి ఫలాలు అందేలా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చ జరిగిందని చైర్మన్ కోరం కనకయ్య తెలిపారు. ఈ సమావేశంలో అంచనాలు కమిటీ సభ్యులు, ఎమ్మెల్యేలు పైడి రాకేష్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, శాసనసభ, శాసనమండలి ప్రధాన అధికారులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ సతీమణి కన్నుమూత

ముదిగొండ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడేపల్లి గ్రామానికి చెందిన స్వర్గీయ మాజీ ఎమ్మెల్సీ సామినేని హిమవంతరావు సతీమణి, మాజీ సర్పంచ్ సామినేని రమేష్ మాతృమూర్తి సామినేని సరస్వతి (86) అనారోగ్యంతో సోమవారం కన్నుమూశారు. ఆమె మృతితో మేడేపల్లి గ్రామం లో విషాదఛాయలు అలుముకున్నాయి. సరస్వతి మృతదేహానికి పలువురు నివాళులర్పించారు. మంగళవారం ఆమె అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ప్రేక్షకుల హృదయాలను తట్టి లేపిన
సంఘం శరణం గచ్ఛామి

నాటకోత్సవాలను ప్రారంభిస్తున్న తమ్మినేని వీరభద్రం

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): ప్రేక్షకుల హృదయాలను తట్టి లేపిన సంఘం శరణం గచ్చామి నాటిక. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవితం, ఆశయాలు, లక్ష్యాలపై అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సౌజన్యంతో ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే సామాజిక చైతన్య నాటకోత్సవాలు ఘనంగా ప్రారంభమైనాయి. తొలిరోజు సంఘం శరణం గచ్చామి నాటకాన్ని ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు తమ్మినేని వీరభద్రం, సామాజికవేత్త డాక్టర్ గోపీనాథ్‌లు ప్రారంభించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేవేంద్ర రచించిన అంబేద్కర్ గీతాల ను కళాకారులు ఆలపించగా అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు సిద్ధోజి, కార్యదర్శి ఎం.జగ్గరాజు, రచయిత దేవేంద్రలు అంబేద్కర్ నాట కం ప్రాధాన్యతను వివరించారు.నేడు సమాజం లో జరుగుతున్న పరిణామాలను సరైన పద్ధతుల్లో అర్థం చేసుకోవడానికి ఈ అంబేద్కర్ నాటకం ఉపయోగపడుతుందన్నారు. రేపు ఎల్లుండి జరగబోయే ఈ నాటకోత్సవాలను అన్ని వర్గాల ప్రజలు తిలకించి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. అంబేద్కర్ నాటకం ప్రారంభంలో మా వెన్నంటి ఉంటూ మమ్మల్ని ముందుకు నడిపించిన తమ్మినేని వీరభద్రంకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని వీక్షించడానికి వివిధ సామాజిక సంఘాలు ప్రజా సంఘాలు సాంస్కృతిక సంఘాలు సాహితీ సంఘాల నాయకులు ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ వెయ్యిరోజుల పాలనపై బీఆర్ఎస్ పోరాటం

మాజీ ఎమ్మెల్యే సండ్ర

సమావేశంలో మాట్లాడుతున్న సండ్ర వెంకటవీరయ్య

పెనుబల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 2 నుంచి 8వ తేదీ వరకు కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలోని వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పిలుపునిచ్చారు. పెనుబల్లిలో సోమవారం బీఆర్ఎస్ నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్‌లు, 420హామీలను ప్రజలకు గుర్తుచేస్తూ నియోజకవర్గ వ్యాప్తంగా 60వేల కుటుంబాలకు కాంగ్రెస్ బాకీ కార్డులను అందించాలని కార్యకర్తలకు సూచించారు. వంద రోజుల్లో 13 డిక్లరేషన్లు అమలుచేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యిరోజులు గడిచినా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. రైతుభరోసా, రెండులక్షల రుణమాఫీ, యూరియా, నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.2500, వృద్ధులు, బీడీ కార్మికులకు రూ.4వేల పింఛన్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, విద్యాభరోసా, ఆటోడ్రైవర్లకు రూ.12వేలు లాంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. యూరియా కోసం రైతులు వివిధ యాప్‌లు, నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ధరణి స్థానంలో భూభారతి తీసుకువచ్చి రైతుల సమస్యలను మరింత జఠిలం చేశారని విమర్శించారు. భూసమస్యల పరిష్కారం పేరుతో రైతులకు మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయటంలో రాజకీయ కక్ష చూపుతుందని విమర్శించారు. వెయ్యిరోజుల సమయంఇచ్చాం.. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ కుటుంబానికి కాంగ్రెస్ వైఫల్యాలను కార్యకర్తలు, నాయకులు తెలియపర్చాలని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ ఐదుమండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా బాలాజీ నాయక్

చండ్రుగొండ, అగస్టు 31(ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా చండ్రుగొండ మండలం కరిసిలబోడుకు చెందిన మూడు బాలాజీ నాయక్ ఎన్నికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన్ కేంద్రంలో ఆదివారం రాత్రి సంఘం వ్యవస్థాపకులు గణేష్ నాయక్ బాలాజీ నాయక్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. భద్రాద్రి జిల్లాలోని మారుమూల గ్రామానికి చెందిన తనకు రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించిన జాతీయ కార్యవర్గం నమ్మకాన్ని నిలబెడతానని బాలాజీ నాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కార్యవర్గంతో కలిసి రాష్ట్రంలో గిరిజన విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

రైస్‌మిల్ యజమాని అరెస్ట్

అశ్వాపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన అశ్వాపురంకు చెందిన ఓ రైస్‌మిల్ యజమానిని సోమవారం అశ్వాపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. అశ్వాపురంలోని ఓ రైస్‌మిల్‌కు ప్రభుత్వం కేటాయించిన ధాన్యానికి, సీఎంఆర్‌కు తేడాలు రావటంతో పౌరసరఫరాల జిల్లా ఉన్నతాధికారులు ఇటీవల రైస్‌మిల్‌లో సోదాలు జరిపారు. ఈ సందర్భంగా తేడాలు స్పష్టం కావటంతో అధికారులు ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అధికారుల ఫిర్యాదు మేరకు విచారణ అనంతరం రైస్‌మిల్ యజమానిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు అశ్వాపురం సీఐ సిలివేరు ఎల్లయ్య తెలిపారు.

బేకరీ నిర్వాహకుడి అదృశ్యం

ఇల్లెందుటౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బేకరీ షాపు నిర్వాహకుడు అదృశ్యమైన ఘటన సోమవారం ఇల్లెందులోని కరంటాఫీస్ రోడ్డులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఇల్లెందు మండలం, బొజ్జాయిగూడెం గ్రామానికి చెందిన చింతలశేఖర్ కరంటాఫీస్ ఏరియాలో బేకరీషాపు నిర్వహిస్తున్నాడు. సోమవారం సోదరుడితో కలిసి షాపు తెరిచిన అనంతరం తలనొప్పి మాత్ర కోసం మెడికల్ షాపునకు స్కూటీపై వెళ్లిన శేఖర్ ఎంతకూ తిరిగిరాకపోవడంతో సోదరుడు సురేశ్ సెంటర్‌లో వాకబు చేయగా ఆచూకీలభ్యం కాలేదు. కానీ స్కూటీ మెడికల్ షాపు వద్దనే ఉన్నప్పటికీ సురేశ్ లేకపోవడంతో బంధువుల ఇళ్లలో వాకబు చేసినా తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఈ మేరకు సీఐ సురేశ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

వందేళ్ల ముందుచూపుతో అభివృద్ధి

(3వ పేజీ తరువాయి)

హైదరాబాద్ తర్వాత ఖమ్మం నగరాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. వందేళ్ల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, తాగునీటి అవసరాల కోసం సీఎం రూ.250కోట్లు మంజూరు చేశారని, ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించి 24గంటలు తాగునీరు అందిస్తున్నామన్నారు. కాంగ్రెస్ నాయకుడు సాధు రమేష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పోలీసుకమిషనర్ సునీల్‌దత్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్‌బాబా, మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, నగర అధ్యక్షుడు నాగండ్ల దీపక్‌చౌదరి, మాజీ మేయర్ పునుకొల్లు నీరజ, కమర్తపు మురళి, బాలగంగాధర్ తిలక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల చేపట్టిన అభివృద్ధి పనులపై ఏవీని సభలో ప్రదర్శించారు.

నిర్లక్ష్యంగా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

- వంటకు ఉపయోగించే వాటర్ ట్యాంకులో బల్లి
- అదే నీరు ఉపయోగించి విద్యార్థులకు వంటలు
- చుంచుపల్లి మండలం బాబు క్యాంపు పాఠశాలలో ఘటన
- పాఠశాల ఎదుట బైఠాయించి ఏఐవైఎఫ్ నాయకుల నిరసన

పాఠశాల ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న ఏఐవైఎఫ్ నాయకులు, విద్యార్థులు

చుంచుపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా చుంచుపల్లి మండలంలో గల బాబు క్యాంపు ప్రభుత్వపాఠశాలలో మధ్యాహ్నం భోజనం తయారీకి ఉపయోగించే నీటి ట్యాంకులో బల్లి పడింది. అదే నీటితో వంటలు చేసిన ఘటన సోమవారం వెలుగులోకి రావడంతో చర్చాంశనీయమైంది. పాఠశాలలో ప్రతీరోజు మాదిరిగానే మధ్యాహ్న భోజనం వండుతున్న సమయంలో విద్యార్థి సంఘం ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీం, నాయకులు రాజేష్, రవికిరణ్, భూపేష్ వంటశాలను సందర్శించగా ఈ విషయం బయటపడింది. వంటకు వినియోగించే నీటి ట్యాంకులో చనిపోయి, కుళ్లిపోయిన బల్లి ఉన్నట్లు గుర్తించిన ఏఐవైఎఫ్ నాయకులు వంట తయారీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమిడుతున్నారని ఆరోపిస్తూ పాఠశాల ఎదుట బైఠాయించి ఆందోళన నిర్వహించారు. మధ్యాహ్న భోజనపథకం అమలులో ఉపాధ్యాయుల పర్యవేక్షణ లోపించిందని, వంట సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని విమర్శించారు. నిర్లక్ష్యంతో ఉండి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. నిరసన చేస్తున్న సమాచారం తెలుసుకున్న చుంచుపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. ఈవిషయమై చుంచుపల్లి ఎంఈవో నీరజను ఆంధ్రజ్యోతి ప్రతినిధి వివరణ కోరగా పాఠశాల నీటి ట్యాంకులో బల్లి పడిన విషయం వాస్తవమేనని, వంట సిబ్బంది ఇది గమనించలేదని తెలిపారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని, మధ్యాహ్న భోజనం తయారీపై పర్యవేక్షణ పెంచుతామని ఎంఈవో పేర్కొన్నారు. వంట సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జంతర్ మంతర్ జెన్ జీ పోరాటం స్ఫూర్తిదాయకం

ప్రజాస్వామ్య పరిరక్షణకు దారిచూపిన పోరాటం

కార్పొరేట్, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

ఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా సహాయ కార్యదర్శి ఐషీ ఘోష్

సమావేశంలో మాట్లాడుతున్న ఐషీ ఘోష్

ఖమ్మం రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జంతర్ మంతర్ వద్ద విదార్థులు, యువత చేపట్టిన పోరాటం స్ఫూర్తిదాయకమైనదని, చారిత్రత్మకమైనదని ఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా సహాయ కార్యదర్శి ఐషీ ఘోష్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు అన్నారు. ఆ పోరాటస్ఫూర్తితో దేశవ్యాప్తంగా విద్యార్థులు మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దతండాలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన జెన్‌జీ మీట్‌లో వారు మాట్లాడుతూ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగిన ఉద్యమం దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు కొత్త దిశను చూపించిందన్నారు. విద్యార్థులు తమ విద్యా ఉద్యోగ హక్కుల కోసం మాత్రమే కాకుండా ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు కూడా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రజనీకాంత్ మాట్లాడుతూ తెలంగాణలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కొరత, అధ్యాపకుల ఖాళీలు, ఫీజుల భారం, విద్యార్థులు ఎదుర్కొంటు సమస్యలపై నిరంతర పోరాటాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు వెంకటేష్, రాష్ట్రకమిటీ సభ్యురాలు సాత్విక, జిల్లా కమిటీ సభ్యురాలు పూజిత, సుశాంత్, డివిజన్ అధ్యక్షుడు త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

5వ తేదీ వరకు రేషన్ బియ్యం పంపిణీ?

ఖమ్మం జిల్లాలో 96 శాతం బియ్యం పంపిణీ

అవసరం మేర అందక డీలర్లు, లబ్ధిదారుల ఇబ్బందులు

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మూడునెలల రేషన్ బియ్యం పంపిణీ గడువు సోమవారంతో ముగిసింది. అయితే చాలాప్రాంతాల్లో పంపిణీ లక్ష్యం పూర్తికాకపోవడంతో పంపిణీ గడువును ఈనెల 5వతేదీ వరకు పొడిగించినట్లు సమాచారం. సోమవారం వరకు ఖమ్మం జిల్లాలోని 748రేషన్ దుకాణాల్లో 96శాతం కార్డుదారులకు బియ్యాన్ని పంపిణీ చేశారు. ఇంకా పోర్టబిలిటీలో ఇచ్చిన బియ్యాన్ని మాత్రం పంపిణీ చేయాల్సి ఉందని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. పోర్టబిలిటీ బియ్యం రాకపోవడంతో రేషన్ డీలర్లు ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద నిరీక్షిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో లబ్ధిదారులు బియ్యం కోసం రేషన్‌దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. ఖమ్మం జిల్లాలో 748 దుకాణాల్లో 4,73,271 కార్డులుండగా.. వీటిపరిధిలో 13,36,126 యూనిట్లకు గాను 24359.342 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కేటాయించారు. ఇప్పటి వరకు జిల్లాలోని 8 ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి 748 దుకాణాలకు గాను 25,716 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని రేషన్ దుకాణాలకు సరఫరా చేశారు. ఇంకా 14.43వేల మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా కావాల్సి ఉంది. ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీలోపు లబ్ధిదారులకు రేషన్ దుకాణాల్లో బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. కానీ ఈ నెల మూడు నెలల కోటా ఇవ్వాలని నిర్ణయించిన నేపథ్యంలో అంతటి స్థాయిలో రేషన్ షాపులకు బియ్యాన్ని పూర్తిస్థాయిలో సరఫరా చేయకపోవడంతో డీలర్లు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో కొద్దిమొత్తంలోనే అదీ పోర్టబులిటీ విధానంలోనే డీలర్లకు బియ్యం బకాయిలున్నట్టు వాటిని కూడా మంగళవారం వరకు ఇవ్వనున్నట్లు డీఎస్వో చందన్‌కుమార్ తెలిపారు. అయితే రేషన్‌బియ్యం పంపిణీ గడువు మాత్రం ఇంకా ఆదేశాలు జారీ కాలేదని తెలిపారు. కానీ డీలర్లు మాత్రం మౌఖికంగా ఉత్తర్వులు వచ్చినట్టు చెబుతున్నారు. ఏదేమైనా ఈ సారి మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ అటు డీలర్లు, ఇటు అధికారులు, లబ్ధిదారులకు తలనొప్పిగా మారింది.

నిందితుల అరెస్టు చూపుతున్న మణుగూరు డీఎస్పీ రవీంద్రరెడ్డి

శివకుమార్ హత్యకేసులో
27 మందిపై కేసు

- 23 మంది అరెస్టు.. పరారీలో నలుగురు
- వివరాలు వెల్లడించిన మణుగూరు డీఎస్పీ రవీంద్రరెడ్డి

మణుగూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని ఓల్డ్ ఏరియా స్టోర్స్ (నేతాజీ) స్టేడియంలో గత గురువారం జరిగిన సింహాద్రి శివకుమార్ హత్య కేసులో మణుగూరు పోలీసులు మొత్తం 27మందిపై కేసు నమోదు చేశారు. నిందితుల్లో మొత్తం 23మందిని అరెస్టు చేయగా.. మరో నలుగురు పరారీలో ఉన్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మణుగూరు డీఎస్పీ రవీంద్రరెడ్డి సోమవారం వెల్లడించారు. మణుగూరుకు చెందిన సింహాద్రి వీరభద్రాచారి కుమారుడు శివకుమార్ నాలుగేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటూ ఇంటీరియల్ కార్పెంటర్ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో మణుగూరు గాంధీ బొమ్మ సెంటర్‌కు చెందిన బొల్లి హర్ష, సుందరయ్య నగర్‌కు చెందిన కర్రి సతీష్ అనే యువకులు ప్రస్తుతం శివ వద్ద పనిచేస్తున్నారు. అలాగే మణుగూరుకు చెందిన లోకేష్ అనే యువకుడు చదువుకొనే నిమిత్తం హైద్రాబాద్‌లోనే ఉంటున్నాడు. అయితే సతీష్, లోకేష్ మధ్య పాత వివాదాలు ఉన్ననేపథ్యంలో నెలరోజుల క్రితం లోకేష్ మద్యం మత్తులో సతీష్‌కు ఫోన్ చేసి ‘మీ చెల్లి ఎక్కడుందో.. ఏ హాస్టల్‌లో ఉండి చదువుకుంటుందో నాకు తెలుసు. మీ చెల్లిని ఏం చెయాలో అదే చేస్తా’ అని బెదిరించాడు. ఆ విషయమై హైదరాబాద్‌లోనే వారిద్దరి మధ్య గొడవ జరిగింది. ఆ సమయంలో లోకేష్.. సతీష్‌ను కొట్టగా శివ అడ్డుకున్నాడు. కొన్నిరోజుల తర్వాత మణుగూరు వచ్చిన లోకేష్ హైదరాబాద్‌లో జరిగిన విషయాన్ని మణుగూరు కాంధాన్(ఎంకే) గ్యాంగ్‌లో వాట్సాప్, ఇన్‌స్టాను ఖాతాలను నిర్వహించే ఎంకే గ్యాంగ్ లీడర్ జెట్‌పట్ రమాకాంత్ అలియాస్ రమ్మీకి చెప్పాడు. దాంతో 26వతేదీన హైదరాబాద్‌లోఉన్న సతీష్‌కు రమ్మీ, లోకేష్ ఫోన్‌చేసి ‘రాఖీ పండక్కి వస్తున్నారా.. వస్తే మిమ్మల్ని చంపేస్తాం’ అని బెదిరించగా.. సతీష్ పక్కనే ఉన్న శివ ఫోన్ తీసుకుని తాము పనుల్లో ఉన్నామని ఇబ్బంది పెట్టొద్దని అన్నాడు. దాంతో వారు అతడిపై దుర్భాషలాడారు. అంతటితో ఆగకుండా పదే పదే ఫోన్లు చేసి బెదిరించారు. అయితే శివకుమార్ మణుగూరులో తమ ఎంకే గ్యాంగ్ ప్రాబల్యానికి అడ్డుపడుతున్నాడని కోపం పెంచుకున్న రమాకాంత్‌తో పాటు వరప్రసాద్, దినేష్, భరత్. సాదిక్, జంపయ్య, సాత్విక్, జగన్, గణేష్ అనే వ్యక్తులు కూడా తరచూ శివకు ఫోన్‌చేసి శివకుమార్ కుటుంబ సభ్యులు, అతడికి కాబోయే భార్య గురించి కూడా అసభ్యకరంగా మాట్లాడటం, బెదిరించడం చేశారు. అయితే రాఖీ పండుగకని 27న ఉదయం శివ తన ఇంటికి రాగా..విషయం తెలుసుకున్న రమాకాంత్ మళ్లీ శివకుమార్‌కు ఫోన్ చేసి ‘దమ్ముంటే.. మగాడివైతే గ్రౌండ్‌కు రారా’ అంటూ రెచ్చగొట్టడతో శివ తన ఇంటి పక్కన ఉండే ఉదయ్‌ను తీసుకోని బైక్‌పై గ్రౌండ్‌కు వెళ్లి రమాకాంత్‌తో మాట్లాడే ప్రయత్నం చేశాడు. కూర్చుని మాట్లాడుకుని సమస్యను పరిష్కరించుకుందామని కోరాడు. కానీ అప్పటికే పథకం వేసుకుని ఉన్న రమాకాంత్ గ్యాంగ్ శివకుమార్‌పై విచక్షణారహితంగా దాడి చేశారు. ఓ కర్ర, ఓ చేతి కడియాన్ని కూడా దాడికి ఉపయోగించారు. ఆ సమయంలో పక్కనున్న ఉదయ్ అడ్డుకునే ప్రయత్నం చేయగా.. అతడిని కూడా కొట్టడంతో గాయాలయ్యాయి. చివరకు శివకుమార్‌ను ఆస్పత్రికి తరలించగా.. కొద్దిసేపటికే మృతిచెందాడు .ఈ ఘటనపై శివకుమార్ తండ్రి సింహాద్రి వీరభద్రాచారి ఇచ్చిన ఫిర్యాదుతో అదే రోజున మణుగూరు పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేశారు. కానీ తమ దర్యాప్తులో ఈ దాడిలో మొత్తం 27మంది ఉన్నట్లు వెల్లడి అవడంతో వారిపై కేసు నమోదు చేశామని, వారిలో రేగులగండి అటవీ ప్రాంతంలో ఉన్న 23 మందిని అరెస్టు చేశామని, మరో నలుగురు పరారీలో ఉన్నారని డీఎస్పీ తెలిపారు. త్వరలోనే వీరిని కూడా పట్టుకుంటామన్నారు. నిందితుల నుంచి 9 బైక్‌లు, 20 సెల్ ఫోన్లు, దాడికి ఉపయోగించిన కర్ర, కడియం స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు దర్యాప్తుకు కృషి చేసిన సీఐ నాగబాబు, ఎస్ఐలు నగేష్, రవూఫ్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

అందరివాడు ఆట ఆపేశాడు

అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు మెస్సీ గుడ్‌బై

ఫుట్‌బాల్‌తో పెద్దగా పరిచయం లేని వాళ్లు కూడా కాసేపు తన ఆట చూస్తే ఆ ఆటలో మజా ఏంటో అర్థమై ఆస్వాదించేలా చేయగల ఆకర్షణ కలిగినవాడు.. మైదానంలో పాదరసంలా కదలాడుతూ, అద్భుతమైన డ్రిబ్లింగ్ నైపుణ్యంతో ప్రత్యర్థుల గుండెల్లో దడ పుట్టించినవాడు.. కళ్లు చెదిరే ఫీల్డ్ గోల్స్‌తో ప్రపంచ రికార్డులు కొల్లగొట్టిన ఘనుడు.. తన మంత్రముగ్ధమైన ఆటతో యావత్ క్రీడాలోకాన్ని ఉర్రూతలూగించినవాడు.. మాటల్లో సౌమ్యుడు, చేతల్లో ఘనాపాఠిగా ఉంటూ అభిమానులకు అపరిమితమైన ఆనందాన్ని పంచిన అందరివాడు.. ఆటనే ప్రేమించి.. ఆటనే శ్వాసించి.. ఆటనే శాసించిన లియోనెల్ మెస్సీ.. ఇక చాలని సెలవు తీసుకొన్నాడు.

బ్యూనస్ ఎయిర్స్: అర్జెంటీనా ఫుట్‌బాల్ గ్రేట్ లియోనెల్ మెస్సీ (39) అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. రెండు దశాబ్దాలపాటు అర్జెంటీనాకు ప్రాతినిథ్యం వహించిన మెస్సీ. జాతీయ జట్టుకు రిటైర్మెంట్ ప్రకటిస్తున్నట్టు సోమవారం స్పానిష్ భాషలో తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశాడు. రికార్డు స్థాయిలో దేశం తరపున ఆరు వరల్డ్‌కప్‌లు ఆడాడు. 2016లో కోపా కప్ ఫైనల్లో ఓటమి తర్వాత విమర్శలకు తట్టుకోలేక తొలిసారి రిటైర్మెంట్ ప్రకటించిన మెస్సీ.. అభిమానుల విజ్ఞప్తితో పునరాగమనం తర్వాత అంతా స్వర్ణ యుగమే. మెస్సీ సారథ్యంలో 2022లో కతార్‌లో జరిగిన సాకర్ ప్రపంచకప్‌లో అర్జెంటీనాను విజేతగా నిలవగా.. 2026 మెగా టోర్నీ ఫైనల్లో స్పెయిన్ చేతిలో ఓడింది. అయితే, తుది పోరులో ఓడిన రెండు రోజుల తర్వాత తన రిటైర్మెంట్ లేఖను రాసినట్టు మెస్సీ తెలిపాడు. కానీ, తన తండ్రి జార్జ్ మెస్సీ అనారోగ్యం, ఆయన మృతి కారణంగా బహిర్గతపర్చడానికి సమయం తీసుకొన్నట్టు తెలిపాడు. కాగా, క్లబ్ సాకర్‌లో లియోనెల్ మరికొంత కాలం కొనసాగే అవకాశం ఉంది. ప్రస్తుతం అతడు ఇంటర్ మయామి కెప్టెన్‌గా ఉన్నాడు. మరో రెండేళ్లపాటు ఆ క్లబ్‌తో అతడికి అగ్రిమెంట్ ఉంది.

'ఫైనల్ ముగిసిన ఇన్ని రోజుల తర్వాత, ఎంతో ఆలోచించిన తర్వాత, జాతీయ జట్టుకు రిటైర్మెంట్ ప్రకటించాలనే నా నిర్ణయాన్ని మీకందరికి తెలియజేస్తున్నా. ఇది ఎంతో బాధ కలిగించే నిర్ణయమే అయినా.. అందుకు ఇదే సరైన సమయమని భావిస్తున్నా. అర్జెంటీనా జెర్సీ కోసం సర్వస్వం ధారపోశా. జట్టుతో కలసి దేశానికి ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందించా. అర్జెంటీనా ప్రజలను గర్వపడేలా చేయడం ఎప్పుడూ ఆనందమే. ఇక, సమయం తరిగిపోతుంది. కొన్ని అధ్యాయాలు ముగిసిపోనున్నాయి.

సర్వం ధారపోశా..

లియోనెల్ భావోద్వేగ లేఖ

దేశానికి ప్రాతినిథ్యం వహించడం నాకు ఎంతో ఇష్టం. నా దగ్గర ఉన్నదంతా ఇచ్చేశా. ఇక నా వద్ద ఏమీ మిగల్లేదు. ఎంతో మంది ప్రతిభగల యువ ఆటగాళ్లు దూసుకొస్తున్నారు. వారికి ఇదే తగిన సమయం. 20 ఏళ్లుగా అందించిన ప్రేమ, అభిమానానికి కృతజ్ఞతలు. ఇకపై జాతీయ జట్టుకు బయట నుంచి అభిమానించే వ్యక్తిగా ఉంటా. కుటుంబం, కోచ్, సహచరులు, జట్టు అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు. చిరస్మరణీయ జ్ఞాపకాలను నాతో తీసుకెళ్తున్నా. నా సహచరులతో కలసి ఒకప్పుడు కలలు కన్న క్షణాలను.. మీకు అందించామనే సంతృప్తితో సగర్వంగా నిష్క్రమిస్తున్నా. అర్జెంటీనావాడిగా నన్ను పుట్టించినందుకు దేవుడికి కృతజ్ఞతలు. లెట్స్ గో అర్జెంటీనా..'

- లియోనెల్ మెస్సీ



యుగానికొక్కడు

ఎదుగుదల లోపంతో ఏమైపోతాడో? అనుకొన్నవాడు.. తన ఆటతో రెండు దశాబ్దాలపాటు కోట్లాది మంది అభిమానుల హృదయాలను కొల్లగొట్టాడు. కష్టాలకు ఎదురీదాడు.. పట్టుదలతో పోరాడాడు.. ఓర్పుతో నేర్చాడు.. సాకర్ చరిత్రలో మహోన్నత శిఖరంగా నిలిచాడు.

ఓ శకం ముగిసింది!

మెస్సీ మేనియా దాదాపు రెండు దశాబ్దాలపాటు ప్రపంచాన్ని ఊపేసింది. బార్సిలోనా తరపున మెరుపులు మెరిపించిన మెస్సీ.. 2004లో అర్జెంటీనా అండర్-20 జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు. అప్పుడు అతడి ఆట విశ్లేషకులను ఎంతగానో ఆకట్టుకొంది. 2005లో 18 ఏళ్ల వయసులో జాతీయ జట్టులోకి వచ్చిన లియోనెల్.. క్రమంగా జట్టు మూలస్తంభంగా మారాడు. 2006 ప్రపంచ కప్‌లో తొలిసారి అర్జెంటీనాకు ప్రాతినిథ్యం వహించాడు. 2009లో జువాన్ రోమన్ రిక్వెల్మీ రిటైర్మెంట్‌తో నెం:10 జెర్సీ మెస్సీకి వచ్చింది. ఇక, 2010 ఫిఫా వరల్డ్‌కప్ అర్జెంటీనా జట్టును మెస్సీ కేంద్రంగా కోచ్ మారడోనా తయారు చేశాడు.

చేదు అనుభవాలు..

జాతీయ జట్టు అర్జెంటీనా తరపున మాత్రం ఎన్నో చేదు అనుభవాలు. 2007 కోపా కప్‌లో ఓటమి.. 2014 వరల్డ్‌కప్ ఫైనల్లో ఓటమి మెస్సీని తీవ్ర నిరుత్సాహానికి గురి చేసింది. 2015, 2016 కోపా కప్‌లో కూడా పరాజయాలతో.. తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు. అతడిని జట్టు నుంచి తప్పించాలనే డిమాండ్ బలంగా వినిపించింది. తల్లడిల్లిపోయిన లియోనెల్ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలికాడు.

శూన్యం నుంచి..

మెస్సీ దూరం కావడంతో ఒక్కసారిగా అర్జెంటీనా జట్టులో శూన్యం ఆవరించింది. తట్టుకోలేక పోయిన ఫ్యాన్స్.. మళ్లీ తిరిగి రావాలని కోరారు. అభిమానుల కోరికను మెస్సీ మన్నించడం అతడి జీవితంలో.. కెరీర్‌లో ఓ మేలి మలుపు. ఎక్కడైతే పోగొట్టుకొన్నారో.. అక్కడే వెతుక్కోమన్నట్టుగా రీఎంట్రీలో మెస్సీ తననుతాను సరికొత్తగా ఆవిష్కరించుకొన్నాడు. 2021లో మరకాన స్టేడియంలో కోపాకప్‌ను అతడు ముద్దాడడం ఫుట్‌బాల్ చరిత్రలోనే భావోద్వేగ సందర్భం. అర్జెంటీనాకు ట్రోఫీ అందించడంతో అతడికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు.

'ఎడారి'లో దాహం తీరింది..

2022 కతార్‌లో జరిగిన ఫిఫా వరల్డ్‌కప్.. ఒక రకంగా మెస్సీకి చివరి అవకాశం అని భావించారు. మెగా టోర్నీ తొలి మ్యాచ్‌లోనే సౌదీ అరేబియా చేతిలో ఓటమి. ఇంత గొప్ప ఆటగాడి కెరీర్ వరల్డ్‌కప్‌ను అందుకోకుండానే ముగుస్తుందా? అనే నిర్వేదం. కానీ, డీలా పడిన జట్టులో స్ఫూర్తిని రగిల్చిన మెస్సీ.. వరుస విజయాలతో జట్టును ఫైనల్‌కు చేర్చాడు. ఫ్రాన్స్‌తో టైటిల్ ఫైట్‌లో డ్రామా నడిచినా.. షూటౌట్‌లో అర్జెంటీనాను గెలిపించిన మెస్సీ.. 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్'గా తనపేరును చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించుకొన్నాడు. 2024లో మెస్సీ సారథ్యంలో అర్జెంటీనా మరోసారి కోపా అమెరికా కప్ విజేతగా నిలవగా.. 2026 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంప్‌గా బరిలోకి దిగిన అర్జెంటీనాను లియోనెల్ మరోసారి ఫైనల్‌కు చేర్చాడు.

హైదరాబాద్‌తో అనుబంధం

భారత పర్యటనలో భాగంగా గత ఏడాది డిసెంబరు 13న మెస్సీ హైదరాబాద్‌కు విచ్చేశాడు. మెస్సీ రాకను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం అతడికి ఘన స్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు చేసి.. ఔరా అనిపించింది. ఫలక్‌నుమా ప్యాలెస్‌లో బస చేసిన మెస్సీ తొలుత అక్కడ కొద్ది మంది అభిమానులతో ఫొటోలు దిగాడు. అనంతరం ఉప్పల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన స్నేహపూర్వక ఫుట్‌బాల్ మ్యాచ్‌లో సీఎం రేవంత్ రెడ్డితో కలిసి మెస్సీ కొద్దిసేపు ఆడడం ఈ పర్యటనకే హైలైట్‌గా నిలిచిపోయింది. ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు పలువురు సెలెబ్రిటీలు ఉప్పల్ స్టేడియానికి తరలి వచ్చారు. మ్యాచ్ అనంతరం మెస్సీ స్టేడియం మొత్తం తిరుగుతూ తన కోసం వచ్చిన అభిమానులకు అభివాదం చేశాడు. ఆతర్వాత స్టేడియంలోనే యువ క్రీడాకారులతో కొద్దిసేపు ముచ్చటించి, వారికి కొన్ని సలహాలు కూడా ఇచ్చాడు.

మీ ఆట.. ప్రపంచానికి ప్రేరణ సీఎం రేవంత్

మెస్సీ రిటైర్మెంట్‌పై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. 'మీరు ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ ప్రేమికులను ఉర్రూతలూగించారు.. స్ఫూర్తినిచ్చారు. మీతో కలిసి ఫుట్‌బాల్ మైదానంలో కొన్ని నిమిషాలు గడపడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. మీరు లేని ఫుట్‌బాల్ మునుపటిలా ఉండదు. వీడ్కోలు పలికినా.. మీ స్ఫూర్తి మరెందరినో ప్రేరేపిస్తూనే ఉంటుంద'ని రేవంత్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

కుటుంబం..

మెస్సీ తన చిన్ననాటి స్నేహితురాలు ఆంటోనెలా రొకుజోను కొన్నాళ్ల సహజీవనం అనంతరం 2017 జూలైలో పెళ్లాడాడు. వారికి ముగ్గురు సంతానం. పెద్దకొడుకు థియాగో మెస్సీ 2012లో, రెండో కుమారుడు మాటెయో మెస్సీ 2015లో, మూడో కొడుకు సిరో మెస్సీ 2018లో జన్మించారు. ఇక మెస్సీ తండ్రి జార్జ్ ఈ మధ్యే మృతిచెందారు. మెస్సీకి తల్లి, ఇద్దరు అన్నలు, ఓ చెల్లెలు ఉన్నారు.

మారడోనాతో..

ఆటను శాసించాడు

అలనాటి దిగ్గజం పీలే, తరువాతి తరం హీరో డీగో మారడోనా..ప్రస్తుత స్టార్ క్రిస్టియానో రొనాల్డోను కాదని లియోనెల్ మెస్సీయే సాకర్ 'ఆల్‌టైమ్ గ్రేట్' అనేందుకు లెక్కకు మిక్కిలి ఉదాహరణలున్నాయి..రెండు నెలల కిందట జరిగిన ప్రపంచ కప్ ఫుట్‌బాల్ టోర్నీలో మెస్సీ చేసిన మాయాజాలాన్ని మరువగలమా ! మెగా టోర్నమెంట్‌లో కెప్టెన్‌గా ఒంటిచేత్తో జట్టుకు విజయాలు అందించాడు..అల్జీరియాతో ఆరంభ మ్యాచ్‌లో హ్యాట్రిక్‌తో అదరగొట్టాడు..ఆస్ట్రియాపై రెండు గోల్స్‌తో అద్భుతం చేశాడు..మెగా టోర్నీలో అత్యధికంగా 18 గోల్స్‌తో ఆల్‌టైమ్ గ్రేట్‌గా సరికొత్త చరిత్ర సృష్టించాడు.. జోర్డాన్‌తో పోరులో కళ్లు చెదిరే ఫ్రీకిక్‌తో కొట్టిన గోల్‌ను ఏమని వర్ణించగలం ? ప్రీక్వార్టర్స్‌లో ఈజిప్టుతో, క్వార్టర్స్‌లో స్విట్జర్లాండ్‌తో, సెమీఫైనల్లో ఇంగ్లండ్‌తో నరాలు తెగే ఉత్కంఠభరిత మ్యాచ్‌లలో జట్టును నడిపించి, గెలిపించిన తీరు మెస్సీకే చెల్లు..

కెరీర్ ఘనతలు..

- అర్జెంటీనా జాతీయ జట్టు తరఫున 207 మ్యాచ్‌ల్లో 125 గోల్స్ చేశాడు.
- 8 సార్లు బాలన్ డీ ఓర్ అవార్డులు.
- తన కెప్టెన్సీలో అర్జెంటీనాకు ఓ ప్రపంచ కప్ (2022).
- తన సారథ్యంలో రెండు కోపా అమెరికా టైటిళ్లు (2021, 2024).
- ఒలింపిక్ క్రీడల (2008 బీజింగ్) స్వర్ణం.
- ఆరుసార్లు యూరోపియన్ గోల్డెన్ బూట్ అవార్డు.
- అత్యధిక మ్యాచ్‌లకు (133) కెప్టెన్సీ ఘనత.
- పది పర్యాయాలు హ్యాట్రిక్ గోల్స్.

అచ్చం సచిన్‌లాగే!

క్రికెట్ దిగ్గజం సచిన్‌కు, ఫుట్‌బాల్ గ్రేట్ మెస్సీల ప్రపంచకప్ విజయాల్లో కొన్ని పోలికలున్నాయి. సచిన్ పదో నెంబర్ జెర్సీని ధరిస్తే.. మెస్సీది కూడా అదే నెంబర్ జెర్సీ. 2003 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఓటమిపాలైన సచిన్.. ఎనిమిదేళ్ల తర్వాత 2011లో విశ్వకప్‌ను అందుకున్నాడు. అలాగే 2014 ప్రపంచకప్ తుది పోరులో రన్నరప్‌నకు పరిమితమైన మెస్సీ.. సరిగ్గా ఎనిమిదేళ్ల అనంతరం 2022లో విశ్వవిజేతగా నిలిచాడు. ఇలా, వేర్వేరు క్రీడల్లో ఇద్దరు అత్యుత్తమ ఆటగాళ్ల మధ్య పోలికలుండడం విశేషమే కదా!

అంతర్జాతీయ పోటీలలో ఇకపై లియోనెల్ మెస్సీ మెరుపులను చూడలేకపోవచ్చు. కానీ క్లబ్ సాకర్‌లో 39 ఏళ్ల అర్జెంటీనా సూపర్ స్టార్ ఆటను కనులారా వీక్షించవచ్చు. రెండు దశాబ్దాల తన కెరీర్‌లో ఫుట్‌బాల్‌ను మరో స్థాయికి తీసుకెళ్లిన ఘనత మెస్సీది. స్వయంగా గోల్స్ కొట్టడంలో ఎంత మేటో..సహచరులు గోల్స్ సాధించేలా అవకాశాలు సృష్టించడంలో మెస్సీ అంతకు మించిన మొనగాడు. ఫుట్‌బాల్ ప్రపంచాన్ని ఊపేసిన మెస్సీ..అసలు సాకర్‌కే పనికిరాడని స్వస్థలం రొసారియో కోచ్‌లు పొమ్మన్నారు. 'పొట్టిగా ఉన్నావు. ఈ ఆటకేం సరిపోతావు' అని ఎద్దేవా చేశారు. పైగా..11 ఏళ్ల వయసులో హార్మోన్ ఎదుగుదల లోపం బయటపడడం మెస్సీకి ప్రతికూలమైంది. కానీ అమ్మమ్మ సెలియా ఒలివేరాకు మనవడు మెస్సీ ప్రతిభపై ఎనలేని నమ్మకం. ఆ విశ్వాసంతో కోచ్‌లను ఒప్పించి మనవడికి శిక్షణ ఇప్పించింది. ఈ తరుణంలో అమ్మమ్మ మరణించడం అతడిని తీరని విషాదంలోకి నెట్టింది. అయితే తనను గొప్ప సాకర్ ఆటగాడిగా చూడాలన్న అమ్మమ్మ స్వప్నం నెరవేర్చే లక్ష్యంతో మెస్సీ ఆ విషాదాన్ని దిగమింగాడు. లియోనెల్ సాకర్ స్టార్‌గా ఎదగడంలో బార్సిలోనా క్లబ్‌ది కీలక పాత్ర. మిగతా క్లబ్‌లన్నీ నో చెప్పిన వేళ..మెస్సీని తమ క్లబ్‌లో చేర్చుకొని అతడి అనారోగ్యానికి చికిత్స ఇప్పించడంతోపాటు సాకర్ ప్లేయర్‌గా తీర్చిదిద్దింది. 2004లో 17 ఏళ్ల వయస్సులో బార్సిలోనా తరపున పోటీ సాకర్‌లోకి అడుగుపెట్టిన మెస్సీ, 2005లో హంగేరి జట్టుపై అర్జెంటీనాకు అరంగేట్రం చేశాడు. ఆపై ప్రపంచ ఫుట్‌బాల్‌పై చెరగని ముద్ర వేశాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

హార్దిక్, నితీశ్ ఫిట్!

సుందర్ కూడా ● అఫ్ఘాన్‌తో టీ20 సిరీస్‌కు సిద్ధం

హార్దిక్

బెంగళూరు: అఫ్ఘానిస్థాన్‌తో టీ20 సిరీస్‌కు ముందు భారత్‌కు శుభవార్త. గాయాలతో బాధపడుతూ పునరావాస శిబిరంలో ఉంటున్న హార్దిక్ పాండ్యా, నితీశ్ కుమార్, వాషింగ్టన్ సుందర్ కోలుకుంటున్నారు. జట్టు ఎంపిక కోసం జాతీయ సెలెక్టర్లు ఈ వారంలో సమావేశం కానున్నారు. ఈనేపథ్యంలో హార్దిక్, నితీశ్ పేర్లను పరిగణనలోకి తీసుకోనున్నారు. హార్దిక్ తన మకాంను ముంబై నుంచి బెంగళూరుకు మార్చిన విషయం తెలిసిందే. అటు ప్రస్తుతం చెన్నైలో ఉన్న సుందర్ జట్టు సెలెక్షన్‌కన్నా ముందే సీఓఈలో ఫిట్‌నెస్ టెస్టుకు హాజరయ్యే అవకాశం ఉంది.

ఆసియా క్రీడలకు బుమ్రా: అఫ్ఘాన్‌తో సిరీస్‌కు బుమ్రా అందుబాటులో ఉండేది సందేహంగా మారింది. గాయం నుంచి కోలుకుంటున్న అతను ప్రస్తుతం సీఓఈలోనే ఉన్నాడు. అయితే ఆసియాకప్‌నకు బుమ్రా ఎంపికయ్యే అవకాశం ఉందని బోర్డు వర్గాలు పేర్కొన్నాయి.

జొకోకు ఝలక్

అర్జెంటీనా యువ ఆటగాడి చేతిలో ఓటమి ● యూఎస్ ఓపెన్



తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం

మరీనో నవోన్

న్యూయార్క్: యూఎస్ ఓపెన్‌లో పెను సంచలనం నమోదైంది. నాలుగో సీడ్ నొవాక్ జొకోవిచ్ (39)కు తొలి రౌండ్‌లోనే షాక్ తగిలింది. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ మొదటి రౌండ్‌లో జొకో 6-7(5), 7-5, 6-4, 2-6, 1-6తో మరీనో నవోన్ (అర్జెంటీనా) చేతిలో ఐదుసెట్లపాటు పోరాడి ఓడాడు. 4 గంటల 36 నిమిషాలపాటు సాగిన మారథాన్ మ్యాచ్‌లో జొకో కండరాల నొప్పులతో తీవ్రంగా ఇబ్బందులు పడ్డాడు. అంతేకాకుండా మ్యాచ్ ముగిసిన తర్వాత కన్నీటి పర్యంతమయ్యాడు. యూఎస్ ఓపెన్‌లో నొవాక్ తొలిరౌండ్‌లోనే వెనుదిరగడం అతడి కెరీర్‌లో ఇదే మొదటిసారి. మరోవైపు 25 ఏళ్ల నవోన్ కెరీర్‌లో ఈ ఏడాదే తొలి ఏటీపీ టైటిల్ నెగ్గాడు. ఇతర మ్యాచ్‌ల్లో 15వ సీడ్ అలెగ్జాండర్ బబ్లిక్ (కజకిస్థాన్) 6-4 6-2, 3-6, 6-1తో జె ఉల్ఫ్ (అమెరికా)పై, జైమ్ ఫరియా 6-3, 7-6(4), 4-6, 1-6, 6-2తో జాన్సన్ బ్రూక్స్‌బైపై గెలిచారు. మహిళల సింగిల్స్‌లో 9వ సీడ్ ఎలెనా స్విటోలినా 6-1, 6-2తో సోలాన్ సియర్రా (అర్జెంటీనా)ను, కరోలినా ప్లిస్కోవా (చెక్) 2-6, 7-5, 6-3తో హన్నే వాండవింకిల్‌ను, 18వ సీడ్ ఎకటరీనా అలెగ్జాండ్రొవా 6-2, 6-2తో మెకార్తీ కెస్లర్‌ను ఓడించారు. కాగా, వీనస్ విలియమ్స్ 2-6, 6-7(6) సోఫియా కెనిన్ చేతిలో పరాజయం పాలైంది.

వైభవ్ సెంచరీ మిస్

దులీప్ ట్రోఫీ

ఈస్ట్‌జోన్ 266 ఆలౌట్

నార్త్‌పై తిలక్‌వర్మ శతకం

వైభవ్ (92)

బెంగళూరు: ఈస్ట్‌జోన్ వైస్ కెప్టెన్ వైభవ్ సూర్యవంశీ దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో చెలరేగాడు. ఎడాపెడా షాట్లతో తన శైలిలో పరుగులు రాబట్టాడు. అయితే కొద్దిలో శతకం కోల్పోయాడు. సెంట్రల్ జోన్‌తో మ్యాచ్‌లో..సోమవారం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఈస్ట్‌జోన్ 266 పరుగులకు ఆలౌటైంది. వైభవ్ (81 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్స్‌లతో 92), మరో ఓపెనర్ అభిమన్యు (69) మొదటి వికెట్‌కు 161 పరుగులు జోడించారు. ఆపై సెంట్రల్‌జోన్ బౌలర్లు విజృంభించడంతో ఈస్ట్‌జోన్ 266 పరుగులకే చేతులెత్తేసింది. సెంట్రల్‌జోన్ మొదటి ఇన్నింగ్స్‌లో 266 రన్స్ చేసిన విషయం విదితమే. అనంతరం రెండో ఇన్నింగ్స్ చేపట్టిన సెంట్రల్‌జోన్ రెండో రోజు ఆఖరికి 45/3తో ఆడుతోంది.

సూర్యవంశీ రికార్డు పుటల్లో: అతి పిన్న వయస్సు (15 సంవత్సరాల 157 రోజులు)లో దులీప్ ట్రోఫీలో అర్ధ శతకం సాధించిన బ్యాటర్‌గా వైభవ్ రికార్డుల కెక్కాడు. ఈక్రమంలో 57 ఏళ్లనాటి(1969) లక్ష్మణ్ సింగ్ (16 ఏళ్ల 23 రోజులు) పేరిట ఉన్న రికార్డును దాటేశాడు.

తిలక్ వర్మ (106 బ్యాటింగ్)

సౌత్‌జోన్ 285/9: కెప్టెన్ తిలక్ వర్మ (106 బ్యాటింగ్) శతకబాదడంతో నార్త్‌జోన్‌తో సెమీఫైనల్లో సౌత్‌జోన్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం అందుకుంది. కిందటి రోజు స్కోరు 40/2తో సోమవారం, మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన సౌత్‌జోన్ ఆట ముగిసే సరికి 285/9 పరుగులు చేసింది. తిలక్, గోపాల్ (87) ఆరో వికెట్‌కు 175 పరుగులు జోడించారు. నార్త్‌జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 195 పరుగులకే ఆలౌటైన సంగతి తెలిసిందే.

బరిలో లక్ష్య, సాత్విక్ జోడీ

చైనా మాస్టర్స్ నేటి నుంచి

షెన్‌ఝెన్: వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో అనామక ఆటగాడి చేతిలో కంగుతిన్న ఏస్ షట్లర్ లక్ష్య సేన్ మంగళవారం నుంచి జరిగే చైనా మాస్టర్స్‌లో టైటిలే లక్ష్యంగా బరిలోకి దిగనున్నాడు. శ్రీకాంత్ కూడా బరిలో నిలవనున్నాడు. మహిళల సింగిల్స్‌లో ఉన్నతి హుడా, తన్వీ శర్మ, దేవిక సిహాగ్ సత్తా చాటాలనుకొంటున్నారు. డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి, అర్జున్-హరిహరన్, మిక్స్‌డ్‌లో కపిల-తనీషా, రోహన్ కపూర్-రుత్విక జోడీలు ఆడనున్నాయి.

పారా ప్యాడ్లర్ల పతక మోత

న్యూఢిల్లీ: ఫిన్లాండ్ జరిగిన పారా టేబుల్ టెన్నిస్‌లో భారత ఆటగాళ్లు 16 పతకాలతో దుమ్ము రేపారు. 6 స్వర్ణ, 4 రజత, 6 కాంస్యాలతో పోటీలను ఘనంగా ముగించారు. సింగిల్స్ విభాగాలలోనే 10 పతకాలు కొల్లగొట్టారు. డబుల్స్‌లో 2 స్వర్ణ, ఒక రజత, 3 కాంస్యాలు లభించాయి.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): మైనారిటీస్ స్టడీసర్కిల్‌లో ఆధ్వర్యంలో టీజీపీఎస్‌సీ గ్రూప్-1 ప్రిలిమ్స్, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4 పోటీ పరీక్షల ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి ముహమ్మద్ ముజాహిద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ మైనారిటీ వర్గాలకు చెందిన దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల అర్హులైన అభ్యర్థులు ఈనెల 14లోపు తెలంగాణ రాష్ట్రమైనారిటీస్ స్టడీసర్కిల్ కార్యాలయంలో హైదరాబాద్‌లో అందించాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం 9704003002లో సంప్రదించాలని తెలిపారు.

గౌడ సంక్షేమ భవన్ నిర్మాణానికి భూమిపూజ

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల హాజరు

భూమి పూజలో పాల్గొన్న మంత్రి

రఘునాథపాలెం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రఘునాథపాలెం సబ్‌స్టేషన్ ఎదురుగా గౌడ సంఘ భవన నిర్మాణానికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భూమిపూజ చేశారు. ప్రభుత్వం కేటాయించిన 30గుంటల స్థలంలో రూ.5కోట్లతో గౌడసంక్షేమ భవన్ (కమ్యూనిటీహాల్)ను నిర్మించబోతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను అనుగుణంగా ముందుకుపోదామని, పాపన్నగౌడ్ వీరోచిత నాయకుడని కొనియాడారు. భవనానికి మహానాయకుడు పాపన్న పేరు పెట్టాలని సంఘం నాయకులు సూచించారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణగౌడ్,హస్తకళలు కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాయుడు సత్యనారాయణ గౌడ్,గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్‌పార్టీ జిల్లాఅధ్యక్షుడు నూతి సత్యనారాయణగౌడ్, స్థంభాద్రి అర్బన్‌డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ పువాళ్ళ దుర్గాప్రసాద్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నాగండ్ల దీపక్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి వినియోగ ప్రదేశాల్లో తనిఖీలు

తిరుమలాయపాలెం,ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):మాదకద్రవ్యాల వినియోగం, గంజాయి అక్రమ రవాణ అడ్డుకట్టవేసేందుకు తిరుమలాయపాలెం పోలీసులు చర్యలు చేపట్టారు. సీపీ సునీల్‌దత్ ఆదేశాల మేరకు తిరుమలాయపాలెం ఎస్ఐ జగదీష్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు నిర్వహించారు. సుబ్లేడు, కాకరవాయి, ముజాహిద్‌పురం, తదితర గ్రామాల్లో ఈ తనిఖీలు నిర్వహించారు. సుబ్లేడు గ్రామంలో గ్రానైట్ క్వారీ ప్రాంతాలు, కొందరు అనుమానితల ఇళ్ల పరిసరాల్లో ఈ తనిఖీలు చేపట్టారు. నిర్మానుష్య ప్రదేశాల్లో, యువత ఎక్కువగా సంచరించే ప్రదేశాల్లో వారు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దూరమైంది 'సర్'

- నగరంలో 60డివిజన్లకు 27 ఓటరు సవరణ కేంద్రాలు
- ఒక్కో సెంటర్‌లో 13పోలింగ్ కేంద్రాలపైనే
- నిరీక్షించలేక వెనుదిరుగుతున్న ఓటర్లు

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓటర్లుకు ఎస్ఐఆర్ ఇక్కట్లు తొలగటం లేదు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు చేపట్టిన ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం తొలివిడత పర్యవేక్షణలోపం మలివిడతపై పడిందనే చర్చ జరుగుతుంది. ఓటర్లు జాబితాలో సవరణల సంఖ్య గణనీయంగా ఉండటంతో, సమస్యల పరిష్కారానికి కేంద్రాలు ఏర్పాటు చేయలేదనే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.

డివిజన్లు ఎక్కువ.. కేంద్రాలు తక్కువ

నగరంలో మొత్తం 60డివిజన్లు ఉన్నాయి. కొన్ని డివిజన్లలో 7వేలనుంచి 8వేలవరకు ఓటర్లు ఉన్నారు.ప్రతీడివిజన్‌లో సవరణ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా, నగర వ్యాప్తంగా కేవలం 27కేంద్రాలను మాత్రమే ఏర్పాటు చేశారు.ఒక్కోకేంద్రానికి రెండు నుంచి మూడు డివిజన్ల ఓటర్లు వెళ్లాల్సి రావటంతో ఓటర్లు నిరీక్షణ పెరుగుతోంది. కొంతమంది ఓటర్లు సరైన ధ్రువపత్రాలు ఇవ్వకుండానే వెళుతున్నారు.

పెరిగిన దూరం

నగరంలోని 49వడివిజన్‌లో మొత్తం 4వేల ఓట్లు ఉన్నాయి. వీటిలో ఓటు సవరణ కోసం 1,500 ఓటర్లుకు నోటీసులు జారీ చేశారు. డివిజన్‌లో ఎక్కువమంది వయోవృద్ధులు ఉన్నారు. కానీ ఎస్ఐఆర్ ఓటరు సవరణ హియరింగ్ కేంద్రాన్ని మాత్రం అధికారులు ఏర్పాటు చేయలేదు. దీంతో బైపాస్ రోడ్డు నుంచి మయూరి సెంటర్‌కు సమీపంలోని 45వ డివిజన్ ప్రభుత్వ పాఠశాలలో 2కిమీ దూరంలో ఉన్న హియరింగ్ కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. దీంతో అక్కడ 13పోలింగ్ కేంద్రాల ఓటర్లుకు నోటీసులు జారీ చేయటంతో వందల సంఖ్యలో ఓటరు సవరణకు వచ్చారు. దీంతో నిరీక్షించలేక ఓటరు సవరణ చేసుకోలేక పోతున్నారు. దీంతో మాజీ కార్పొరేటర్లు గగ్గోలు పెడుతున్నారు.

శాఖాపరమైన సమావేశాలకు బీఎల్వోలు

ప్రతీఓటరు ఇంటికి వెళ్లి ఓటరు నోటీసులు ఇవ్వాలని ఒకవైపు రాష్ట్ర ఎన్నికల అధికారులు ఆదేశాలిస్తున్నారు. అయితే నగరంలో మాత్రం ఎస్ఐఆర్ కేంద్రాల వద్దకే ఓటర్లు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. కాగా ఎస్ఐఆర్ విధుల్లో ఉన్న బీఎల్వోలు వారి విధుల నిర్వహించే ప్రభుత్వశాఖల సమావేశాలకు హాజరైతున్నారు. దీంతో ఓటర్లు నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది.

హియరింగ్ సభలను పారదర్శకంగా నిర్వహించాలి

కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): ఎస్ఐఆర్ 2026 ఓటర్లు సవరణ జాబితాలో హియరింగ్ సభలు సమర్థంగా నిర్వహించి పారదర్శకంగా ఓటర్లు జాబితాలను నమోదు చేయాలని ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల అధికారి, కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఏఈఆర్వోలు, అదనపు ఏఈఆర్వోల సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. హియరింగ్ సభల నిర్వహణ తీరును తెలుసుకున్నారు. సవరించిన ఓటర్ల జాబితాను బీఎల్వోల ఆన్‌లైన్ విదానంపై వివరించారు. ఏ రోజుకారోజున ఆన్‌లైన్ నమోదు చేయాలని సూచించారు. హియరింగ్ పూర్తి జరిగిన ఓటరు వివరాలను వెంటనే ఏఈఆర్వో లాగిన్ చేయాలని ఆదేశించారు. నియోజకవర్గంలో అర్హత కలిగిన ప్రతి ఓటరు నమోదు కావాలని సూచించారు.

పాముకాటుతో వృద్ధురాలి మృతి

పెనుబల్లి, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): పాముకాటుతో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన పెనుబల్లిలోని తూర్పుబజార్‌లో సోమవారం చోటుచేసుకుంది. అనారోగ్యంతో గత కొంతకాలంగా ఇంట్లో ఉంటున్న కట్టమూడి భారతమ్మ(60) నల్లతాచు కాటు వేయడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లింది. కుటుంబసభ్యులు ఆమెను పెనుబల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. భారతమ్మను కాటువేసిన పామును స్థానికులు చంపివేశారు.

తమ్మిలేరులో చట్టవిరుద్ధంగా వ్యర్థాల డంపింగ్

సత్తుపల్లిరూరల్, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): కాలువల్లో, బహిరంగ ప్రదేశాల్లో సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను నేరుగా వదలడం చట్టవిరుద్ధమని తెలిసినప్పటికీ సత్తుపల్లి మున్సిపాలిటీలో పలువురు సెప్టిక్ ట్యాంక్ నిర్వాహకులు ఇళ్లలో సేకరించిన వ్యర్థాలను బహిరంగంగా యథేచ్ఛగా పట్టణ శివారులోని తమ్మిలేరు వాగులో వదిలేస్తున్నారు. ఈ ఘటన సోమవారం సత్తుపల్లి పట్ట ణ శివారులో చోటుచేసుకుంది. వ్యర్థాలను సురక్షితంగా ప్రభుత్వం గుర్తించిన మురుగునీటి శుద్ధిప్లాంట్ల(ఎస్‌టీపీ)కే చేరవేయాలని, అలాకాకుండా నిబంధనలకు విరుద్ధంగా బహిరంగంగా వదిలితే మున్సిపల్, గ్రామ పంచాయితీ నిబం ధనల ప్రకారం జరిమానాలు విధించాల్సి ఉంది. ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్ కొండ్ర నర్సింహ్మను వివరణ కోరగా ఎస్‌టీపీలు అందుబాటులో లేవని, నిబంధనలు మీరిన నిర్వాహకులకు నోటీసులు ఇస్తామని తెలిపారు.

139 గ్రామాల్లో రీసర్వే!

(3వ పేజీ తరువాయి)

డేటాను క్షుణ్ణంగా క్రాస్ చెక్ చేసి ఎప్పటికప్పుడు మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పట్టాదార్ పాస్‌బుక్ (పీపీబీ) ఉన్న ఆక్యుపెన్సీ పీపీబీ లేని ఆక్యుపెన్సీ వివరాలు వేర్వేరుగా నమోదు చేయాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలు, వ్యత్యాసాలు, సందేహాలను, అభ్యంతరాలు తప్పని సరిగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల రెవెన్యూ అధికారులు పర్యవేక్షిస్తూ సర్వే, డేటా ఎంట్రీ సజావుగా సాగేందుకు కృషి చేస్తున్నారు. మొత్తం సర్వే, డేటా ఎంట్రీ, మ్యాపింగ్ పూర్తయిన తరువాత సీసీఎల్‌కు నివేదిక పంపనున్నారు. అక్కడ పరిశీలన అనంతరం రైతులకు వారి భూములకు సంబంధించిన మ్యాపుతో పాస్‌పుస్తకాలు జారీ అయ్యే అవకాశం ఉంది.

దశాబ్దాల భూ సమస్యలకు చెక్

భూరీసర్వేతో వందేళ్ల నాటి భూమి సమస్యలు పరిష్కారమయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రధానంగా సాగులో ఉండి హక్కులు లేని వారికి హక్కులు కల్పించే అవకాశం కలుగుతోంది. భూమి లేకుండా పాస్‌పుస్తకాలు పొందిన వారిని రికార్డుల నుంచి తొలగించే అవకాశం ఉంది. చాలా కాలం నుంచి ఉన్న ఆర్ఎస్ఆర్ సమస్య రీ సర్వేతో తొలగిపోయే అవకాశం ఉంది. రికార్డుల ప్రకారం ఒక సర్వే నెంబర్ ఉంటే అదే రైతు వేరే సర్వే నెంబర్‌లో అనుభవదారుగా (పొజిషన్‌లో) ఉండటం రాష్ట్ర వ్యాప్తంగా సమస్య ఉంది. విస్తీర్ణంలో తేడాల కారణంగా భూముల యజమానులు ప్రధానంగా ఇబ్బంది పడ్డారు. ఇలాంటి సమస్యలకు రీ సర్వే సందర్భంగా పరిష్కారం లభించనుంది. బేతుపల్లి రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న రీసర్వేపై కలెక్టర్ దివాకర, ఇతర అధికారులతో కలిసి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గతనెల 20న సత్తుపల్లి మండలం నారాయణపురంలో సమీక్షించి సర్వే తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

వివిధ కేసుల్లో పలువురు నిందితులకు జైలు

మోసం కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

ఖమ్మంలీగల్,ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా బంగిపల్లితోట నూజివీడుకు చెందిన మేడిద మల్యాద్రి, ఖమ్మం పట్టణానికి చెందిన కే.వీ.ఎన్.రామకృష్ణకు(అలహాబాద్ బ్యాంక్ మేనేజర్)మూడేళ్లజైలు శిక్ష విధించారు. తప్పుడు రిజిస్ట్రేషన్ నేపథ్యంలో జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి పదివేల రూపాయలు జరిమానా విధించారు.ఈమేరకు ఖమ్మం రెండో అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ సోమవారం తీర్పుచెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి కాలంగి మాధవి 2012లో శ్రీరామ్‌నగర్‌లో రూ.22లక్షలకు 171 గజాలలో ఇంటిని మాల్యాద్రి వద్ద కొనుగోలు చేశారు. అప్పటికే ఆయన దీనిపై రెండు బ్యాంకుల్లో రుణం పొందాడు. ఈ విషయాన్ని మాధవికి చెప్పలేదు. కొంతకాలం తరువాత బ్యాంకువారు ఇల్లు తనఖాలో ఉందని, ఖాళీచేయాలని ఆదేశించారు. దీనిపై బ్యాంకు మేనేజర్లు, మాల్యాద్రిని మాధవి ప్రశ్నించారు. వారు దురుసుగా సమాధానం చెప్పటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోర్టులో ప్రైవేటు కేసు నమోదు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఎస్. గాయత్రి వాదించగా, కోర్టుకానిస్టేబుల్‌గా అలవాల మదార్ సహకరించారు.

చెల్లని చెక్కు కేసులో 6 నెలలు..

మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం దాస్యతండాకు చెందిన బానోత్ రాజేష్‌కు చెల్లని చెక్కు కేసులో 6నెలలు జైలుశిక్షతో పాటు ఫిర్యాదుకి రూ.3లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని ఖమ్మం మొదటి అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి బెక్కమ్ రజని సోమవారం తీర్పుచెప్పారు. నేలకొండపల్లి మండలం ముజ్జుగూడెం గ్రామానికి చెందిన ఫిర్యాది సరికొండ వెంకటేశ్వర్లు వద్ద నిందితుడు 2020లో రూ.3లక్షల రూపాయలు అప్పుగా తీసుకున్నాడు. 2021లో రూ.3లక్షలకు చెక్కును జారీ చేశాడు. బ్యాంకు ఖాతాలో జమ చేయగా సరిపడా నగదు లేనందున చెక్కు తిరస్కరణకు గురైంది. కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేయగా, నేరం రుజువు కావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది..

నగరంలోని ఇందిరానగర్‌కు చెందిన చెల్లని చెక్కు కేసులో నిందితులైన కొప్పుల నరసింహారావు,కొప్పుల సుభద్రలకు ఖమ్మం రెండో అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి బిందుప్రియ గతంలో విధించిన శిక్షను జిల్లా కోర్టులో అప్పిల్‌లో శిక్ష ఖారురు చేస్తూ ఇన్‌చార్జ్ రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి వి.శీనయ్య సోమవారం తీర్పు చెప్పారు.ఇందిరానగర్ 10వ డివిజన్‌కు చెందిన కొప్పుల నరసింహారావు, కొప్పుల సుభద్ర దంపతులు దురిశెట్టి వెంకన్న వద్ద రూ.22 లక్షలలు అప్పుగా తీసుకున్నారు. అప్పు చెల్లించే భాగంలో చెక్కు జారీచేశారు. జారీచేసిన చెక్కు బ్యాంకులో చెల్లకపోవడంతో ఫిర్యాది కోర్టును ఆశ్రయించాడు. దీనిపై విచారణ జరిపిన దిగువకోర్టు నిందితులకు ఏడాది జైలుశిక్షతో పాటు 22లక్షలు నష్టపరిహారం చెల్లించాలని తీర్పునిచ్చింది.ఈ తీర్పును సవాల్ చేస్తూ నిందితులు జిల్లాకోర్టులో అప్పిల్ చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి నిందితుల అప్పిల్‌ను కొట్టివేస్తూ దిగువ కోర్టు తీర్పును ఖరారు చేస్తూ తీర్పుచెప్పారు.

ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించిన కేసులో మూడు నెలలు ..

ఖమ్మంరూరల్ మండలం తీర్థాల గ్రామానికి చెందిన బానోత్ కిరణ్‌కుమార్‌కు ప్రభుత్వ ఉద్యోగికి విధులకు ఆటంకంకలిగించిన కేసులో మూడునెలలు జైలుశిక్షతో పాటు వేయి రూపాయలు జరిమానా విధించారు. ఈమేరకు ఖమ్మంరెండోఅదనపు ప్రథమశ్రేణికోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ సోమవారం తీర్పు చెప్పారు. 2021లో తీర్థాల పంచాయతీలో కార్యదర్శిగా పనిచేస్తున్న చల్లా భవ్య పట్ల నిందిదుడైన బానోత్ కిరణ్‌కుమార్ దురుసుగా ప్రవర్తిస్తూ విధులకు ఆటంకం కలిగించాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకాడంతో పైవిధంగా శిక్ష విధించారు.

నేటినుంచి ఎంబీఏ స్పాట్ అడ్మిషన్లు

ఖమ్మంఖానాపురంహవేలీ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నగరంలో కేయూ పీజీ కళాశాలలో ఎంబీఏ కోర్స్‌లో చేరేందుకు మంగళవారం నుంచి మూడు రోజులు పాటు స్పాట్ అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ టి.గోపి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసెట్ 2026 ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు వివిధ కేటగిరీల వారీగా మొత్తం 21సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వివరాలకు 94406 52571, 99122 63863 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగులు

- అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి
- నేత్రదానంపై అవగాహన కార్యక్రమం

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నేత్రదానం చేయడం ద్వారా మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని అదనపు కలెక్టర్ పి.శ్రీజ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన నేత్రదాన అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి పాల్గొన్నారు. నేత్రదాన ప్రాధాన్యత, అర్హతలు, నేత్రదానం సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు,ఖమ్మంనేత్రనిధి అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 8వరకు నిర్వహిస్తున్న నేత్రదాన అవగాహన కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మరణించిన వ్యక్తి నుంచి 6నుంచి 8గంటల్లోపు నేత్రాలను సేకరించాల్సి ఉంటుందన్నారు.నేత్రదానం చేయదలచిన వారు లేదానేత్రదానానికి సంబంధించిన వివరాలకోసం ఖమ్మంఐ బ్యాంక్ సెల్ నంబర్లు 9397191919, 9247571995లో సంప్రదించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డి.రామారావు, డీసీహెచ్ఎస్ రాజశేఖర్, డీబీసీఎస్ బి.వెంకట నర్సయ్య, ఆప్తాలమిక్ సిబ్బంది ప్రవీణ్, నరేష్, కౌన్సిలర్ హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు సీపీ అభినందన

పతకాలు సాధించిన వారితో సీపీ

ఖమ్మంక్రైం, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కమిషనరేట్‌లో 15మంది సిబ్బందికి ప్రతిభాపురస్కారాలు లభించాయి. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సమయంలో రాష్ట్రపోలీసు సేవా పతకాలు వీరిని వరించాయి. వీరిని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తన కార్యాలయంలో సోమవారం వీరిని అభినందించారు. ఏడీసీపీ రామానుజం, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ బిక్షపతి, హెడ్‌కానిస్టేబుల్ సూర్యప్రకాష్‌రెడ్డి, సేవాపతకం లభించిన వారిలో ఎస్ఐ నాగేందరరావు ఏఎస్ఐలు ఎన్.రామిరెడ్డి,బి.సుందరరావు, ఏఆర్ఎస్ఐలు హలీం, జి.భాస్కరరావు, హెడ్‌కానిస్టేబుల్స్ ఎం.వెంకటేశ్వర్లు హరిచరణ్‌సింగ్, మదార్‌సాహెబ్,ప్రభాకరరావు, సీహెచ్ రామారావు, కానిస్టేబుళ్లు కృష్ణ, సుశీల్‌కుమార్ ఉన్నారు. వీరికి సీపీ తన చేతులుమీదుగా పతకాలు అందించి అభినందించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు.

చెస్ పోటీల్లో విన్‌ఫీల్డ్ విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

ఖమ్మంస్పోర్ట్స్,ఆగస్టు31(ఆంధ్రజ్యోతి):ఇటీవల నగరంలో జరిగిన జిల్లాస్థాయి చెస్ పోటీల్లో విన్‌ఫీల్డ్ విద్యార్థులుప్రతిభ చూపారు. ఈ వివరాలను పాఠశాల యజమాన్యం తెలిపింది. అండర్- 11లో ప్రథమ బహుమతితో పాటు అండర్-13లోప్రథమ,ద్వితీయ అండర్-19లో ప్రథమ, తృతీయ బహుమతులు సాధించారని తెలిపారు.బహుమతులు సాధించిన విద్యార్థులను పాఠశాల అధినేతలు పోలవరపు శ్రీకాంత్, గద్దె పుల్లారావు, మన్నె కిషోర్ అభినందించారు.

విముక్తి జాతుల అభివృద్ధికి కృషి చేయాలి

- సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి గ్రేసమ్మ

ఖమ్మంఖానాపురంహవేలి,ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): వివక్షకు గురైన విముక్తి జాతుల అభివృద్ధికి ప్రభుత్వం, సమాజం సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఐ.గ్రేసమ్మ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో విముక్తి జాతుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చారిత్రకంగా వివక్షకు గురైన విముక్తి జాతుల అభ్యున్నతికి ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈకార్యక్రమంలో వల్లపు సోమరాజు, డాక్టర్ కె.వి. కృష్ణారావు, డేరంగుల బ్రహ్మం, పొదిలి నరసింహారావు, షేక్ మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

రిటైర్డ్ ఉద్యోగులకు సీపీ సన్మానం

ఖమ్మంక్రైం,ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందిన పోలీసు సిబ్బదిని సీపీ సునీల్‌దత్ సోమవారం సన్మానించారు.ఉద్యోగ విరమణ పొందిన వారిలో ఎస్ఐలు సుధాకర్‌రెడ్డి, రాయప్ప, రామారావు, ఏఎస్ఐలు శ్రీనివాసరావు, అబ్దుల్‌రహహాన్, హెడ్‌కానిస్టేబుళ్ల అహ్మద్, సత్యం, ఏఆర్ఎస్ఐ సుందర్‌రావు, హోంగార్డు వెంకటేశ్వర్లు ఉన్నారు.

7న ఢిల్లీలో గిరిజన మహాధర్నా

ఖమ్మంఅర్బన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఈనెల 7న ఆదివాసీ అధికార మంచ్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గిరిజన మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి భుక్యా వీరభద్రం తెలిపారు. కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న గిరిజన వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు భుక్యా కృష్ణ నాయక్, భుక్యా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓట్లు తొలగించటానికే 'సర్' నోటీసులు

పెనుబల్లి,ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణల పేరుతో ఎలక్షన్ కమిషన్ ప్రజలతో ఆటలాడుకుంటుందని సీపీఎం జిల్లా నాయకుడు చలమాల విఠల్‌రావు, పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి కాటినేని శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు పంతంగి వెంకటేశ్వరరావు ఆరోపించారు. సోమవారం పెనుబల్లి పంచాయతీ కార్యాలయంలోని బీఎల్‌వో వద్ద వారు నిరసన తెలిపారు. జాబితాలోని చిన్నచిన్న తేడాలకు నోటీసులుఇచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, నోటీసులను ఉపసంహరించుకొని ప్రతీఒక్కరికి ఓటుహక్కు కల్పించాలని డిమాండ్ చేశారు.

బావిలో మృతదేహం లభ్యం

ఖమ్మంక్రైం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని బాలప్పేటకు చెందిన పెంటి కృష్ణయ్య(50) గతనెల 29న ఇంటినుంచి బయటకువెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఖానాపురంహవేలి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కృష్ణయ్య బాలప్పేట సమీపంలోని ఓ వ్యవసాయబావిలో మృతదేహం కనిపించటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అదించారు. వారు అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కృష్ణయ్య అనారోగ్యంతో మందులు కూడా వాడుతున్నట్టు కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

బాలల సదన్ సందర్శన

రికార్డులు తనిఖీ చేస్తున్న దేవీమానస

ఖమ్మంలీగల్,ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి పి.దేవి మానస నెలవారీ తనిఖీల్లో భాగంగా సోమవారం జిల్లా జైలుతో పాటు బాలల సదన్‌ను సందర్శించారు. అక్కడి వసతులను పరిశీలించారు. న్యాయసహాయం అవసరమైన వారిని గుర్తించి జిల్లా న్యాయసేవాధికారసంస్థ దృష్టికి తీసుకురావాలని, వారికి సకాలంలో న్యాయసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కలెక్టరేట్ ఏవోగా డీఆర్వో రామమూర్తి

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో) గా డీఆర్వో సీహెచ్ రామమూర్తికి ఇన్‌చార్జి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ కలెక్టర్ దివాకర ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు పనిచేసిన కారుమంచి శ్రీనివాసరావు సోమవారం పదవీ విరమణ పొందిన నేపథ్యంలో ఆయన స్థానంలో కొత్తగా ఎవరినీ నియమించలేదు. దీంతో ప్రస్తుతం జిల్లారెవెన్యూ అధికారి(డీఆర్వో)గా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ రామమూర్తికి అదనంగా ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. త్వరలో పూర్తిస్థాయి ఏవోను నియమించనున్నట్లు తెలిసింది.

రైతుశిక్షణ కేంద్రం డీడీఏగా సరిత

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): రైతుశిక్షణ కేంద్రం(ఎఫ్‌టీసీ) డీడీఏగా సరితకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. ఆత్మ పీడీగా పని చేస్తున్న ఆమెకు డీడీఏగా ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలను అప్పగించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన కనకరాజు సోమవారం పదవీ విరమణ పొందారు. ఆయన కూడా ఖమ్మం డీడీఏగా ఓడీ బాధ్యతలను మాత్రమే నిర్వర్తించారు. పదవీ విరమణ పొందిన ఆయన స్థానంలో సరితకు అదనంగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ఖమ్మంక్రైం,ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం రాత్రి కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... నగరానికి చెందిన 16ఏళ్ల బాలిక సంభానినగర్ వద్దసోమవారం అదృశ్యం అయింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆసరా పింఛన్లకు భారీగా దరఖాస్తులు

తిరుమలాయపాలెం,ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):ఆసరాపింఛన్లకోసంపెద్ద మొత్తంలో దరఖాస్తులు అందాయని ఎంపీడీవో సిలార్‌సాహెబ్ తెలిపారు మొత్తం 1121దరఖాస్తులు చివరి తేదీనాటికి అందాయని చెప్పారు. అందులో వితంతు 616, ఒంటరి మహిళ90, దివ్యాంగులు 295, గీత కార్మికులు 109 దరఖాస్తు చేశారని తెలిపారు. ఆన్‌లైన్‌లో పొందుపరిచామని తెలిపారు.

నేడు కాంగ్రెస్ నిరసన ర్యాలీ

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ పక్షనేత రాహుల్ గాంధీపై ఉత్తరాఖండ్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తీరు హేయనీయమని డీసీసీ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణగౌడ్, నగరపార్టీ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి అన్నారు. ఈ తీరును నిరసిస్తూ నేడు నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

పదేళ్ల పింక్ పాలన కంటే.. వెయ్యిరోజుల ప్రజాపాలన భేష్

» ప్రజాభిమానాన్ని పొందిన సీఎం రేవంత్‌రెడ్డి: పొంగులేటి

కేసముద్రం బహిరంగ సభలో వృద్ధురాలిని ముద్దాడుతున్న పొంగులేటి

కేసముద్రం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): "పదేళ్ల పింక్ పార్టీ పాలన కంటే వెయ్యిరోజుల ప్రజాపాలన అందిస్తున్న కాంగ్రెస్ పాలన భేష్. ఈ విషయాన్ని రాష్ట్రంలోని ఏ ఇంటికి వెళ్లినా, ఏ ఆడబిడ్డను, ఏ రైతును అడిగినా చెబుతారు" అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. "వెయ్యిరోజుల ప్రభుత్వం ఏం చేసిందంటూ రేపో మాపో ఆ పింక్ కలరోళ్లు ఏదో కార్యక్రమం చేపడుతున్నారట! వాళ్లకు కళ్లుండి కనబడడం లేదా? చెవులుండి వినబడడంలేదా?" అని బీఆర్ఎస్ నేతలనుద్దేశించి మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. వెయ్యిరోజుల పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాభిమానం పొందారని తెలిపారు.

ప్రజల ఆశీస్సులకు అనుగుణంగా పాలన: తుమ్మల

ఖమ్మం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రజల ఆశీస్సులకు అనుగుణంగా రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రజాప్రభుత్వ పాలన సాగుతోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ వెయ్యి రోజుల్లో ఒక్కో సమస్యను పరిష్కరించుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలోకి తీసుకెళ్తున్నామని చెప్పారు. వ్యవసాయ శాఖ మంత్రిగా తాను సీఎం రేవంత్‌రెడ్డికి మంచి పేరు తెచ్చేలా పనిచేస్తున్నానని, రైతులు, రైతు కూలీల సంక్షేమానికి కృషిచేస్తున్నానని తెలిపారు. ఖమ్మం నగరంలో సోమవారంపర్యటించిన ఆయన.. ప్రకాష్‌నగర్‌లో రూ.12 కోట్లతో చేపట్టే రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సీఎం రేవంత్‌రెడ్డిని ఆశీర్వదించడంతో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని చెప్పారు. అన్నివర్గాలకు న్యాయం చేయాలనే తపనతో సీఎం పనిచేస్తున్నారని కితాబిచ్చారు. సీఎం ఆలోచనలకు అనుగుణంగా రైతుల సంక్షేమానికి తాను కృషిచేస్తున్నానన్నారు.

'ఇన్వెస్ట్ తెలంగాణ' సదస్సు నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు : డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరిగే ఈ సదస్సు ఏర్పాట్లపై సోమవారం ఆయన ప్రజాభవన్‌లో సమీక్ష నిర్వహించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు. సదస్సుకు సంబంధించి ప్రతి అంశాన్ని సమీక్షించి, నిర్ణయాలు వేగంగా తీసుకునేలా ప్రజాభవన్‌లో ప్రత్యేకంగా వార్‌రూమ్‌ను ఏర్పాటు చేయాలని భట్టి సూచించారు. సదస్సు నిర్వహణకు కమిటీలను ఏర్పాటు చేసి, సీనియర్ ఐఏఎస్ అధికారులకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. సదస్సుకు ప్రత్యేకమైన లోగోను రూపొందించాలన్నారు. అక్టోబర్ మొదటి లేదా రెండో వారంలో ఢిల్లీలో కర్టెన్‌రైజర్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

మూడు ఆస్పత్రులకు నేను సూచించిన పేర్లే

» సీఎం ప్రకటనపై మంత్రి కోమటిరెడ్డి హర్షం

అల్వాల్, ఎల్బీనగర్‌లలో నిర్మించే టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు... తాను సూచించిన పేర్లనే పెడతామని అంబర్‌పేటలో జరిగిన సభలో సీఎం ప్రకటించడంపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. అల్వాల్ టిమ్స్‌కు టి.అంజయ్య, ఎల్బీనగర్ టిమ్స్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ, వరంగల్ సూపర్ స్పెషాలిటీకి ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టాలని.. తాను సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభోత్సవం రోజు సీఎం రేవంత్‌ను కోరానని మంత్రి తెలిపారు. తన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించినందుకు ఆయన కృతజ్ఞతలు చెప్పారు.

జాతీయ సదస్సులో తెలంగాణ జలభద్రత నమూనా

» దేశానికి దిశానిర్దేశం చేసేలా రాష్ట్ర విధానం: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సుస్థిర జలవనరుల నిర్వహణపై కేంద్ర జలశక్తి శాఖ సెప్టెంబరు 1, 2 తేదీల్లో న్యూఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ సదస్సులో తెలంగాణ తన 'సమగ్ర జలభద్రత నమూనా'ను దేశం ముందుంచనుందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. సచివాలయంలో శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ సదస్సులో ఇవ్వాల్సిన ప్రజెంటేషన్, జలసంరక్షణ కార్యక్రమాలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. జలవనరుల సంరక్షణ నుంచి సురక్షిత తాగునీటి సరఫరా వరకు పలు అంశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం సాధిస్తూ, నిర్దిష్ట కాలపరిమితితో కూడిన జాతీయ కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని మంత్రి తెలిపారు.

బీఆర్ఎస్‌ది నిరసన రాజకీయం: మంత్రి పొన్నం

హైదరాబాద్, అక్కన్నపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాజకీయ ప్రయోజనాల కోసమే ప్రజా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నిరసనలకు పిలుపునిచ్చిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం చాపగాని తండాలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజా పాలనలో సాధించిన విజయాలను చూసి బీఆర్ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని పూర్తిగా అప్పులపాలు చేసిన బీఆర్ఎస్‌కు నిరసన తెలిపే నైతిక హక్కు లేదన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఉచిత బస్సు, రేషన్ కార్డులు, 72వేల ఉద్యోగాలు ఇచ్చామని, మహిళలను బస్సులకు యజమానులుగా చేశామని పేర్కొన్నారు.

జపాన్ భాష నేర్చుకుంటే ఉద్యోగావకాశాలు: వివేక్

జపాన్‌లో పని చేస్తున్న తెలంగాణ నర్సులతో మంత్రి వివేక్ వెంకటస్వామి భేటీ అయ్యారు. టామ్‌కామ్(తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ) బృందంతో కలిసి టోక్యో వెళ్లిన మంత్రి... జపాన్‌లో నర్సులు పని చేసే పరిస్థితులు, ఉద్యోగ సంబంధిత అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. రెండేళ్ల క్రితం టామ్‌కామ్ ద్వారా జపాన్‌కు వెళ్లిన తొలి బ్యాచ్ నర్సులు... తమ పని వాతావరణం, ఉద్యోగాలపై ఈ సందర్భంగా సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం 30 మంది తెలంగాణ నర్సులు జపాన్‌లో పని చేస్తున్నారని చెప్పారు. జపాన్ భాష నేర్చుకున్న నర్సులకు అక్కడ భారీగా ఉద్యోగావకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు.

471 ఎంఎల్‌డీ మురుగునీటి శుద్ధికి 22 ఎస్టీపీలు

» నిర్మాణ, నిర్వహణ బాధ్యతలు 'రాఘవ సీవరేజ్' సంస్థకు..

కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో మురుగునీటి శుద్ధి సామర్థ్యాన్ని భారీగా పెంచేందుకు 22 సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల(ఎస్టీపీ) నిర్మాణం, నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రూ.1906.44 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో మొత్తం 471.50 ఎంఎల్‌డీ సామర్థ్యంతో 22 ఎస్టీపీలను నిర్మించనున్నారు. జీహెచ్ఎంసీ పరిధి నుంచి ఓఆర్ఆర్ వరకు ఉన్న అన్ని మున్సిపాలిటీలను కవర్ చేస్తూ తలపెట్టిన ప్రాజెక్టు నిర్మాణ పనులను బీవీఎస్ఆర్-ఎస్‌జీఎస్-ఆర్‌సీపీఎల్ (జేవీ)కి అప్పగిస్తూ సోమవారం జీవో జారీ చేసింది. ప్రాజెక్టు కోసం రాఘవ సీవరేజ్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఎస్పీవీని ఏర్పాటు చేసి ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది.

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి-నిర్మల దంపతుల కుమారుడు దత్తుసాయిరెడ్డితో రమేశ్ పటేల్ - మాయ పటేల్ దంపతుల కుమార్తె పాలక్ పటేల్ నిశ్చితార్థం సోమవారం రాత్రి రంగారెడ్డి జిల్లా పట్టినాగులపల్లిలోని ఇవంతర కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ.. కాబోయే దంపతులను ఆశీర్వదించారు.

కేసీఆర్ రాజీనామా చెయ్!

(మొదటిపేజీ తరువాయి)

అంబర్‌పేట సభలో జీహెచ్ఎంసీ నూతన లోగోను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్

వంతెనను ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబర్‌పేట వద్ద జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. వెయ్యి రోజుల ప్రభుత్వ పాలనపై నిరసన కార్యక్రమాలు చేపడతామని బీఆర్ఎస్ ప్రకటించిందని ప్రస్తావించారు. రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేయడం విఫలమైనట్టా? అని ప్రశ్నించారు. "వెయ్యి రోజుల్లో రూ.22.25 కోట్లు మెక్కినవ్... ఏనాడైనా పేదలు, ఆడబిడ్డలు, నిరుద్యోగులు, విద్యార్థులు, రైతులు, దళితులు, గిరిజనులు, ఆదివాసీల కోసం ఏమన్నా ఇచ్చావా దుర్మార్గుడా? నీ బంధువులు చనిపోతే దినాలకు పోతవు. నీ మనవడికి దెబ్బ తగిలితే దవాఖానకు చూడడానికి పోతవు. ప్రజల కోసం బయటకు రావా? ఇందుకోసమేనా కోట్ల రూపాయల జీతభత్యాలు ఇచ్చి తెలంగాణ నిన్ను సాకుతున్నది? పందికొక్కులా ప్రజల సొమ్ము మెక్కి ఫామ్ హౌస్‌లో పండుకుంటే అయిపోయిందా? వెయ్యి రోజులు మొఖం చాటేసిన ప్రతిపక్ష నేత దేశంలో ఎవడైనా ఉన్నడా?" అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఈ వెయ్యి రోజుల్లో తాను ఒక గంట సెలవు తీసుకోలేదని, కేసీఆర్ ఒక గంట సమయం కూడా వెచ్చించలేదని అన్నారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి 365 రోజులు విధులకు రాకుంటే ఉద్యోగం నుంచి డిస్మిస్ చేస్తారని, మరి వెయ్యి రోజులు రాని కేసీఆర్‌ను ఏం చేయాలని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబం ఐదుగురు తొమ్మిదిన్నర ఏళ్ల లక్ష కోట్లు దోచుకున్నారని, ఇప్పుడు వెయ్యి రోజుల్లో అప్పనంగా ప్రభుత్వం సొమ్ము మెక్కుతున్నారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ భవన్‌లో కార్యకర్తల రక్తం తీసుకొని, ప్రయివేటు ఆసుపత్రులకు అమ్ముకున్నరు. ఇంతకంటే దుర్మార్గుడు ఉంటరా? అని ప్రశ్నించారు. "హరీశ్‌రావు పెట్రోల్ తీసుకొని, అగ్గిపెట్టె మర్చిపోయిన నాటకం చూసి రెచ్చిపోయి ఎల్‌బీ నగర్‌లో శ్రీకాంతాచారి కాల్చుకున్నడు. 1200 మంది పిల్లలను పొట్టన పెట్టుకున్నది నువ్వు కాదా?" అన్నారు. వెయ్యి రోజుల్లో ఒక్క గంట కూడా ప్రజలకు కేటాయించని ప్రతిపక్ష నాయకుడు తక్షణమే రాజీనామా చేయాలనే డిమాండ్‌తో మంగళవారం నుంచి ఆరో తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కాంగ్రెస్, అనుబంధ సంఘాలకు ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఏడో తేదీన అసెంబ్లీ మొదలవుతుందని, కేసీఆర్ ఇప్పటికైనా సభకు వచ్చి ప్రజల సమస్యల మీద మాట్లాడాలని సూచించారు. ఇప్పటివరకు అనేక కష్టాలు పడి వ్యవస్థను దారిలోకి తెచ్చానని, ఇప్పటి నుంచి ప్రయాణం సాఫీగా సాగుతుందని, ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. కాళ్లు, చేతులు కూడదీసుకున్నామని, పాలన పట్టాలెక్కిందని, ఇక సాఫీగా నడిపిస్తానని చెప్పారు. ఏ రోజు కూడా తన కుటుంబం కోసం అధికారాన్ని దుర్వినియోగం చేసే ప్రసక్తే లేదన్నారు. తనను గుంపు మేస్త్రీ అని వెక్కిరిస్తున్నారని, తన గుంపు ప్రజలేనని, అందరూ కలిసి తనకు ఈ జిమ్మేదార్ ఇచ్చిండ్రని చెప్పారు. అమెరికాలో బాత్‌రూమ్‌లు కడిగి, అక్కడ బతకలేక వచ్చినాయన లాగా తాను కంపెనీల సీఈవోగా ప్రాజెక్టు చేసుకోవడం లేదని చెప్పారు. "కేసీఆర్ నేను, ముసలామె.. మాకు బుక్కెడు బువ్వ చాలని తెలంగాణ ప్రజలను నమ్మించి, తరువాత కొడుకు, బిడ్డ, అల్లుడు, సడ్డకుడి కొడుకు, దయాకర్‌రావు, మాధవరం కృష్ణారావు, దివాకర్‌రావులను పిలిచిండు. మంద లెక్క జమై మంది సొమ్ము తిన్నరు. నేను ఏమన్నా అట్ల చేసిననా? నాకు అవకాశం వస్తే బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్, హన్మంతన్న, అనిల్ కుమార్, నవీన్ యాదవ్‌లకు అవకాశం ఇచ్చా. వీళ్లంతా నాకు చుట్టాలా? కాంగ్రెస్ కోసం కష్టపడ్డరు. భట్టి విక్రమార్క, గడ్డం ప్రసాద్, దామోదర రాజనరసింహ, అడ్లూరి లక్ష్మణ్, వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, సీతక్క నా బంధువులా? కుటుంబ సభ్యులా? కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే కేటీఆర్, హరీశ్‌రావు, దయాకర్‌రావు, కృష్ణారావు, సంతోష్‌రావు, కవితారావులకు పదవులు ఇచ్చిండు. బయటోళ్లకు అవకాశం ఇచ్చిండా?" అని ప్రశ్నించారు. మహిళలకు ఉచిత ప్రయాణం పెడితే ఆటో డ్రైవర్లను ఉసిగొల్పిన దుర్మార్గపు చరిత్ర బీఆర్ఎస్‌దని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వంలో కనీసం ఒక రేషన్ కార్డు ఇచ్చారా? అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబంలో ప్రతీ ఒక్కరికీ భారీ ఫామ్‌హౌస్‌లు ఉన్నాయని ప్రస్తావించారు. పేదోడికి ఇళ్లు కట్టాలని, బువ్వ పెట్టాలని ఒక్కరోజైనా ఆలోచన చేసినవా? అని ప్రశ్నించారు. సనత్‌నగర్ టిమ్స్‌కు మర్రి చెన్నారెడ్డి పేరు పెడితే ఆయన కాలి గోటికి సరిపోని వాళ్లు రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. అల్వాల్ టిమ్స్‌కు మాజీ ముఖ్యమంత్రి అంజయ్య పేరు, ఎల్‌బీనగర్ టిమ్స్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు, వరంగల్ టిమ్స్‌కు జయశంకర్ పేరు పెడుతున్నట్లు ప్రకటించారు. సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ తీసేస్తామంటున్న వాళ్లకు అదే ప్రాంతంలో సర్దార్ సర్వాయి పాపన్న, జ్యోతిరావు పూలె విగ్రహాలు పెట్టాలని ఆలోచన ఎందుకు రాలేదని ప్రశ్నించారు. మలి దశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మను బీఆర్ఎస్ అనాథలా రోడ్డు మీద వేస్తే మహిళా కమీషన్ సభ్యురాలిగా నియమించామని, చాకలి ఐలమ్మ పేరును కోఠి మహిళా వర్సిటీకి పెట్టామని, ఆమె ముని మనవరాలిని మహిళా కమీషన్ సభ్యురాలిని చేశామని ప్రస్తావించారు. తాము ఏడాదికి రెండు లక్షల ఇళ్లు కడుతున్నామని, కేసీఆర్ పదేళ్లలో 20 లక్షల ఇళ్లు ఎందుకు కట్టలేక పోయారని అడిగారు. అంబర్‌పేటలో 10 ఎకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తామని సీఎం ప్రకటించారు. బతుకమ్మ కుంటను కబ్జా పెట్టిన ఎడ్ల సుధాకర్‌రెడ్డి కేసీఆర్ కోసం హెలికాప్టర్‌తో పూల వర్షం కురిపించాడని, కేసీఆర్ అలాంటి వ్యక్తులను ప్రోత్సహిస్తారని చెప్పారు. రూ.16 వేల కోట్ల మిగులు, రూ.70 వేల కోట్ల అప్పుతో కొత్త రాష్ట్రం ఏర్పడితే దాన్ని రూ.8.11 లక్షల కోట్లకు పెంచిన ఘనత కేసీఆర్‌ది అన్నారు.

ట్రై కార్పొరేషన్లకు కొత్త లోగోలు

నగరంలోని 3 మునిసిపల్ కార్పొరేషన్లకు కొత్త లోగోలు వచ్చాయి. అంబర్‌పేట సభలో సీఎం రేవంత్ వాటిని ఆవిష్కరించారు. ఆరున్నర నెలల క్రితం ఏర్పడిన జీహెచ్ఎంసీ, మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ), సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్(సీఎంసీ)లకు పురపాలక శాఖ లోగోలు రూపొందించింది. ప్రత్యేక ఆకారంలో 'ఎం' అక్షరాన్ని రూపొందించారు.పచ్చని ఆకులు, నీటి బొట్టు ఆకారాలు.. పచ్చదనం, పర్యావరణం, మెరుగైన పారిశుధ్య నిర్వహణను ప్రతిబింబిస్తాయని అధికారులు తెలిపారు.

నేడు ఢిల్లీకి రేవంత్‌రెడ్డి

ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ మావలంకర్ హాల్లో బుధవారం సాయంత్రం జరిగే వైఎస్ఆర్ అవార్డు ప్రదాన కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక విశిష్ట అతిథిగా హాజరు కానున్నారు. మాజీ ఎంపీ కేవీపీ రాంచందర్‌రావు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, విశిష్ట అతిథిగా జైరాం రమేష్, గౌరవ అతిథులుగా తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్, మంత్రి శ్రీధర్ బాబు హాజరు కానున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంగళవారం రేవంత్ ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

152 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి!

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి లేఖ రాశారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం ఢిల్లీలో మహారాష్ట్ర, తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శులతో కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) కీలక సమావేశం జరుగుతోంది. 150 మీటర్ల ఎత్తుతోనే బ్యారేజీ నిర్మాణం కోసం తొలుత కసరత్తు జరిగింది. 152 మీటర్ల ఎత్తు కోసం పట్టుబట్టాలని అధికారులకు ఉన్నత స్థాయిలో ఆదేశాలు వచ్చాయి. దాంతో 152 మీటర్ల ఎత్తుతో కలిగే ముంపు, నీటి లభ్యత, ప్రయోజనాలపై సమగ్ర నివేదికను సిద్ధం చేశారు. ఒక బ్యారేజీ వార్ధాపై, మరొకటి వెన్‌గంగాపై కట్టాలని ప్రతిపాదించారు. వార్ధా బ్యారేజీని 60 గేట్లతో, వెన్‌గంగాను 77 గేట్లతో నిర్మాణం చేపట్టాలన్నది యోచన. 867 మీటర్ల పొడవున వార్ధా, 1113.5 మీటర్ల పొడవున వెన్‌గంగా బ్యారేజీల నిర్మాణం చేపట్టాలన్నది ఆలోచన. ఈ రెండు కూడా 150 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తారు. నది ప్రవాహానికి అడ్డంగా లంబాకారంలో బ్యారేజీల నిర్మాణం చేపట్టాలన్నది ప్రతిపాదన. ఈ డిజైన్‌ను సీడబ్ల్యూసీతో సంప్రదింపులు జరిపి, సర్వేలో ప్రతిపాదించారు. ఈ మేరకు ప్రభుత్వానికి తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదిక(పీఎఫ్ఆర్)ను ఆర్వీ అసోసియేట్స్ అందించింది. ఎటువంటి గ్రామాల ముంపు లేకుండా 150 మీటర్ల ఎత్తుతో బ్యారేజీలు కట్టవచ్చని గుర్తు చేసింది. తెలంగాణ, మహారాష్ట్రల్లోనూ గ్రామాల ముంపు ఉండబోదని ఆ నివేదికలో పేర్కొన్నారు. 150 మీటర్ల ఎత్తుతో కడితే 4,215 ఎకరాల నదీగర్భం, చాప్రాల ఎకో సెన్సివిటీ జోన్‌కు చెందిన 943 ఎకరాలు ముంపునకు గురి అవుతాయి. అయితే, 1,018 ఎకరాలు సేకరిస్తే చాలని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీని 148 మీటర్ల ఎత్తుతో కట్టుకోవడానికి 2016 మార్చి 8వ తేదీన మహారాష్ట్రతో ఒప్పందం కూడా జరిగింది. దీన్ని అప్పట్లో 165 టీఎంసీలతో ప్రతిపాదించారు. 2015 ఫిబ్రవరి 13న హైడ్రాలజీ అనుమతి కూడా లభించింది. ఇరిగేషన్ ప్లానింగ్, అంతరాష్ట్ర క్లియరెన్స్, సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు(భూగర్భ జలాలపై), నిర్మాణం కోసం వినియోగించే యంత్ర పరికరాలు, మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్(పంటలపై) అనుమతులు వచ్చాయి. ఇక పర్యావరణ అనుమతి కోసం తెలంగాణలో 2011 ఏప్రిల్‌లో బహిరంగ విచారణ కూడా జరిగింది. మహారాష్ట్రలో మాత్రం ఈ పని పూర్తికాలేదు. పలు అనుమతులు ఇదివరకే ఉండటంతో ఢిల్లీలో జరిగే భేటీలో మహారాష్ట్రను అధికారుల స్థాయిలో ఒప్పించే పనిలో రాష్ట్ర ప్రభుత్వం పడింది. అధికారుల స్థాయిలో సమావేశం అనంతరం ముఖ్యమంత్రుల స్థాయిలో తదుపరి భేటీ ఉంటుందని తెలుస్తోంది. తొలుత మహారాష్ట్ర ముందు 152 మీటర్ల ఎత్తు ప్రతిపాదనను ఉంచి, కనీసం 150 మీటర్ల ఎత్తుతో అయినా ఒప్పించాలని ప్రభుత్వం పట్టుదలతో ఉంది. మంగళవారం జరిగే సమావేశానికి సహకరించడానికి సీఎంవో కూడా రంగంలోకి దిగింది. సీఎం కార్యాలయ కార్యదర్శి మాణిక్యరాజ్ కన్నన్, ప్రభుత్వ సలహాదారుఆదిత్యనాథ్ దాస్, నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ.శ్రీధతోపాటు కీలక అధికారులంతా భేటీలో పాల్గొంటున్నారు.

ఫ్యూచర్ సిటీలో నార్త్ ఈస్టర్న్ వర్సిటీ క్యాంపస్

(మొదటిపేజీ తరువాయి)

ఆఫ్‌షోర్ క్యాంపస్‌ల ద్వారా హైదరాబాద్‌కు తీసుకురావడానికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం ఆగస్టు 19 నుంచి 29 వరకు యూకేలో, అలాగే అధికారుల బృందం అమెరికాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ పర్యటనల్లో సాధించిన చరిత్రాత్మక పురోగతి, ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలతో కుదిరిన కీలక ఒప్పందాలు, అవగాహన ఒప్పందాలు, లెటర్స్ ఆఫ్ ఇంటెంట్ తదితర వివరాలతో కూడిన నివేదికను ప్రభుత్వం నియమించిన ఉన్నత స్థాయి కమిటీ సోమవారం సీఎం రేవంత్‌కు అందజేసింది. ఐటీ, పరిశ్రమలు, ఫార్మా, లైఫ్ సైన్సెస్, పరిశోధన, డిఫెన్స్ రంగాల్లో ఇప్పటికే ప్రపంచపటంలో ప్రత్యేక ముద్ర వేసిన హైదరాబాద్ నగరాన్ని.. ఇప్పుడు అంతర్జాతీయ విద్యా, నైపుణ్య రంగానికి ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కమిటీ తన నివేదికలో స్పష్టం చేసింది. అమెరికాలోని నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ (బోస్టన్), యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ లండన్‌లు భారత్‌లో తమ తొలి ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు అంగీకరించాయని పేర్కొంది. ముఖ్యంగా నార్త్‌ఈస్టర్న్ వర్సిటీ తమ క్యాంపస్‌ను.. భారత్ ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేసే అవకాశాలను ముమ్మరంగా పరిశీలిస్తున్నట్టు తెలిపింది. అలాగే.. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ , స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ సంస్థలతో చర్చలు సానుకూలంగా సాగాయని వెల్లడించింది. ఇక.. సీనియర్ ప్రభుత్వ, కార్పొరేట్ అధికారుల కోసం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో స్వల్పకాలిక ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లను ప్రారంభించేందుకు హార్వర్డ్ యూనివర్సిటీ అంగీకరించినట్టు పేర్కొంది. ఈ అంతర్జాతీయ కోర్సులు వచ్చే నవంబర్ నుంచే ప్రారంభం కానున్నట్టు తెలిపింది. పర్యటనలో భాగంగా తెలంగాణ ప్రతినిధి బృందం లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్, స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, మస్సాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, లండన్ బిజినెస్ స్కూల్, వర్జీనియా టెక్, ఇంపీరియల్ కాలేజ్ లండన్ వంటి దిగ్గజ విద్యాసంస్థల అధిపతులతో విస్తృత స్థాయి చర్చలు జరిపింది. ఆక్స్‌ఫర్డ్ వర్సిటీతో సంయుక్త పరిశోధన కేంద్రాలు, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ల ఏర్పాటుపై సుదీర్ఘంగా చర్చించింది. ఈమేరకు ఆయా సంస్థలకు చెందిన నిపుణుల బృందాలు త్వరలోనే హైదరాబాద్‌లో పర్యటించి.. ఇక్కడి వసతులను పరిశీలించనున్నాయి.

అత్యుత్తమ విద్యకు నాయకత్వం వహిస్తా..

కమిటీ నివేదికను స్వీకరించిన అనంతరం సీఎం రేవంత్ మాట్లాడారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యానికి.. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలతో ఒప్పందాలు, అవగాహన ఒప్పందాలు, లెటర్స్ ఆఫ్ ఇంటెంట్ విజయవంతంగా కుదరడం ద్వారా పెద్ద ప్రోత్సాహం లభించిందన్నారు. "రాష్ట్రంలోని 4 కోట్ల మంది ప్రజలతో ఈ విషయాన్ని పంచుకోవడం ఎంతో సంతోషంగా, గర్వంగా ఉంది. తెలంగాణతో పాటు మొత్తం భారతదేశంలోని యువత, చిన్నారులకు అత్యుత్తమ విద్యా అవకాశాలను అందించేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌కు నాయకత్వం వహిస్తాను" అని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు రానున్న ప్రపంచస్థాయి విద్యాసంస్థలు తెలంగాణతో పాటు దేశంలోని యువత, చిన్నారులకు కొత్త అవకాశాలను సృష్టిస్తాయని వ్యాఖ్యానించారు. యువత ఈ విద్యాసంస్థలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని, ప్రపంచ స్థాయిలో పోటీపడగల నిపుణులుగా ఎదగడానికి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని, తెలంగాణ రైజింగ్ లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని సీఎం అభిలషించారు.

'మల్లన్నసాగర్-ఘన్‌పూర్'కు సర్కారు గ్రీన్‌సిగ్నల్

గోదావరి తాగునీటి పథకం ఫేజ్ 2,3లో 7360కోట్లతో ప్యాకేజీ-1 పనులు

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మూసీ నది పునరుజ్జీవానికి కీలకమైన 'గోదావరి తాగునీటి సరఫరా' పథకం పనులకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మల్లన్నసాగర్ నుంచి ఘన్‌పూర్‌కు గోదావరి జలాలను తరలించి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలను నింపే గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్-2, 3లో ప్యాకేజీ-1 పనుల ప్రారంభానికి అనుమతి ఇస్తూ సోమవారం పురపాలక శాఖ జీవో జారీ చేసింది. ఈ ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ.7360 కోట్లు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌లో చేపట్టే ఈ పనుల్లో ప్రభుత్వం 40 శాతం, ఏజెన్సీ 60 శాతం పెట్టుబడి పెట్టేలా నిర్ణయించింది. ప్యాకేజీ-1 పనులను ఎల్-1 బిడ్డర్‌గా ఎంపికైన మేఘా సంస్థకు అప్పగించారు. మల్లన్నసాగర్ నుంచి ఘన్‌పూర్ వరకు 3000 మిల్లీమీటర్ల వ్యాసం కలిగిన పైప్‌లైన్‌ను రెండు వరసల్లో నిర్మించనున్నారు. ఒక్కో లైన్ ద్వారా 10 టీఎంసీల చొప్పున నీటిని తరలించనున్నారు. మల్లన్నసాగర్‌లో పంప్‌హౌస్, విద్యుత్తు పరికరాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ నిర్మాణంతోపాటు ఘన్‌పూర్‌లో 1170 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నీటి శుద్ధి కేంద్రం, 40 ఎంఎల్ సామర్థ్యంతో క్లియర్ వాటర్ జలాశయం కమ్ పంప్ హౌస్ ఏర్పాటు చేయనున్నారు.

రుణం ఆలస్యమైతే.. సొంత నిధులతో పనులు

ప్రాజెక్టు కోసం కాంట్రాక్టు దక్కించుకున్న మేఘా సంస్థ ఎస్పీవీని ఏర్పాటు చేసింది. మల్లన్నసాగర్ వాటర్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రాజెక్టు అమలుకు బ్యాంకు రుణం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ రుణ మంజూరు ప్రక్రియ జాప్యం అవుతోంది. ఈ క్రమంలో పనులు ఆలస్యమవకుండా చూసేందుకు మేఘా సంస్థ సొంత నిధులతో పనులు చేపట్టాలని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనకు ప్రభుత్వం అనుమతించింది.

అధికారిక ఫ్లెక్సీలో కొండా సురేఖ ఫొటో ఔట్

శంకుస్థాపన శిలాఫలకాల్లోనూ లేని మంత్రి పేరు

కేసముద్రం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తప్పిస్తారన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో అభివృద్ధి పనులకు సంబంధించి నిర్వహించిన కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో అధికారులు మంత్రి కొండా సురేఖ ఫొటోను పెట్టలేదు. శిలాఫలకంపై ఆమె పేరును కూడా రాయలేదు. ఈ అంశం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సోమవారం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క.. కేసముద్రంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించడంతోపాటు మునిసిపాలిటీ భవన నిర్మాణ శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మునిసిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్నారు. అయితే ఈ సభావేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, ప్రభుత్వ విప్, ఎంపీలు, ఎమ్మెల్యేలతోపాటు బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు ఫొటోలను కూడా ముద్రించారు. కానీ, ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి అయిన కొండా సురేఖ ఫొటోను మాత్రం పెట్టలేదు. పైగా, ఈ కార్యక్రమానికి మంత్రి సురేఖ హాజరు కాకపోవడం గమనార్హం.

‘కాక్రోచ్’ల ప్రదర్శనపై నిషేధానికి సుప్రీం నో

న్యూఢిల్లీ, ఆగస్టు 31: కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) సెప్టెంబరు 5న ఢిల్లీలో నిర్వహించదలపెట్టిన నిరసన ప్రదర్శనపై నిషేధం విధించేందుకు సోమవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రతి ఒక్కరూ బాధ్యతతో, చట్ట ప్రకారం, శాంతియుతంగా వ్యవహరించాలని సూచించింది. నీట్ పేపర్ల లీకేజీపై జంతర్‌మంతర్ వద్ద జరిగిన ఆందోళనను విరమించిన సందర్భంగా ఇచ్చిన హామీలను కేంద్రం అమలు చేయడం లేదని ఆరోపిస్తూ ఆ రోజున ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీసు ప్రధాన కార్యాలయం వరకు ప్రదర్శన జరపాలని సీజేపీ నిర్ణయించింది. ఆ ప్రదర్శనపై నిషేధం విధించాలని రిటైర్డు ఢిల్లీ పోలీసు అధికారి రాజేంద్ర సింగ్ పిటిషన్ దాఖలు చేశారు. సెప్టెంబరు 12, 13 తేదీల్లో బ్రిక్స్ సదస్సు జరగనున్న దృష్ట్యా అది ముగిసే వరకు ఆందోళనను వాయిదా వేసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

అనలాగ్ పనీర్‌పై జొమాటో నిషేధం

న్యూఢిల్లీ, ఆగస్టు 31: పాలతో చేసే పనీర్, చీజ్‌తో కాకుండా.. అనలాగ్ పనీర్, చీజ్ వంటి ప్రత్యామ్నాయ కృత్రిమ డెయిరీ ఉత్పత్తులతో చేస్తున్న వంటకాలపై జొమాటో కఠిన నిర్ణయం తీసుకుంది. అనలాగ్ డెయిరీ ఉత్పత్తులతో తయారు చేసే వంటకాలను తన ప్లాట్‌ఫాంపై విక్రయించడాన్ని నిషేధిస్తున్నట్లు జొమాటో సోమవారం ప్రకటించింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని తెలిపింది. తమ ప్లాట్‌ఫామ్‌లో నమోదైన రెస్టారెంట్లు, హోటళ్లు స్వచ్ఛమైన పాల ఉత్పత్తులతోనే ఆహారపదార్థాలు తయారు చేయాలని, అలా సాధ్యం కాకపోతే ఆ వంటకాలను మెనూ నుంచి తొలగించాలని సూచించింది. ఈ నిబంధనను పాటించని భాగస్వామ్య హోటళ్లను తమ జాబితా నుంచి తొలగిస్తామని హెచ్చరించింది.

నౌకాదళంలో చేరిన ఐఎన్ఎస్ నిపుణ్

ముంబై, ఆగస్టు 31: సముద్ర గర్భంలోకి చొచ్చుకెళ్లి అత్యంత క్లిష్టమైన ఆపరేషన్లు నిర్వహించే సత్తా కలిగిన స్వదేశీ డైవింగ్ సహాయక నౌక (డీఎస్‌వీ) ‘ఐఎన్ఎస్ నిపుణ్’ సోమవారం భారత నౌకాదళంలో చేరింది. ముంబైలోని నావల్ డాక్‌యార్డ్‌లో నావికాదళ చీఫ్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ సమక్షంలో ఈ నౌకను అధికారికంగా ప్రారంభించారు. గతేడాది ప్రారంభించిన ‘ఐఎన్ఎస్ నిస్తార్’ తర్వాత నేవీలో చేరిన రెండో డైవింగ్ సహాయక నౌక ఇది. ఐఎన్ఎస్ నిపుణ్‌ను విశాఖపట్నంలోని హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ సంస్థ స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించింది. 10,500 టన్నుల బరువు మోసే సామర్థ్యం దీనికి ఉంది. సముద్ర గర్భంలో 300 మీటర్ల లోతు వరకూ వెళ్లి డైవింగ్ ఆపరేషన్లు నిర్వహించగలదు. వీటితో పాటు ప్రమాదంలో చిక్కుకున్న జలాంతర్గాములను రక్షించడంలోనూ ఇది కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు తెలిపారు.

మతాలన్నింటిలో ఇస్లాం పవిత్రమైనది

గురుకుల హాస్టళ్లలో విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో పరిశుభ్రత, ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (టీజీహెచ్ఆర్సీ) ఆదేశించింది. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని బీసీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనపై సుమోటోగా కేసు నమోదు చేసిన కమిషన్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ సమర్పించిన నివేదికను పరిశీలించింది. బాధిత విద్యార్థినులకు వెంటనే వైద్య చికిత్స అందించామని, ప్రస్తుతం వారు పూర్తిగా కోలుకుని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారని నివేదికలో పేర్కొన్నారు. ఆహారం విషపూరితం కాలేదని పరీక్షల్లో తేలినట్టు కమిషన్ తెలిపింది. అయినప్పటికీ ఆహారాన్ని అత్యంత జాగ్రత్తగా తయారు చేసి వడ్డించాలని సూచించింది.

బాబర్ పుట్టిన దేశం నుంచి మోదీకి అవార్డు

» బీజేపీ, ఆర్ఎస్ఎస్ బాబర్‌ను ద్వేషించడం ఆపాలి: ఒవైసీ

న్యూఢిల్లీ, ఆగస్టు 31: భారత ప్రధాని నరేంద్రమోదీ.. ఉజ్బెకిస్థాన్ ప్రభుత్వం నుంచి ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం 'ఓలియ్ దరజాలి దస్తలిక్'ను అందుకోవడంపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ కీలక వ్యాఖ్యలు చేశారు. అవార్డును అందుకున్నందుకు మోదీకి శుభాకాంక్షలు చెబుతూనే.. బీజేపీపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మొఘల్ చక్రవర్తి బాబర్‌కు ఉజ్బెకిస్థాన్‌తో చారిత్రక అనుబంధం ఉందని, ఆయన జన్మించిన ఫెర్గానా లోయ ప్రస్తుతం ఉజ్బెకిస్థాన్‌లోనే ఉందని గుర్తు చేశారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలు నిత్యం ద్వేషించే బాబర్ పుట్టిన దేశం నుంచే ఇప్పుడు మోదీ పురస్కారాన్ని అందుకున్నారని పేర్కొన్నారు. సంఘ్ పరివార్ నేతలు ఈ విషయాన్ని గుర్తించి.. ఇకనైనా బాబర్‌ను ద్వేషించకుండా ఉంటారని ఆశిస్తున్నానన్నారు. కాగా, తనకు పురస్కారాన్ని అందించడం పట్ల ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షౌకత్ మిర్జియోయెవ్‌కు ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను తన సోదరుడిగా మోదీ అభివర్ణించారు.

టీచర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి: శ్రీపాల్‌రెడ్డి

» నేడు పీఆర్టీయూ మహాధర్నా

హైదరాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రేవంత్ రెడ్డి 2034 వరకు తానే సీఎంగా ఉంటానని పదేపదే చెబుతున్నారని, ఇది నెరవేరాలంటే మ్యానిఫెస్టోలో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు. సీపీఎస్ రద్దు, మెరుగైన పీఆర్సీ ప్రకటించడంతో పాటు ఉపాధ్యాయులకు సంబంధించిన రూ.16వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన పీఆర్టీయూ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రెండు డీఏలు పెండింగ్‌లో ఉండగా ఇప్పుడు ఆరు ఉన్నాయని చెప్పారు. 2023ఆఖర్లో ఉద్యోగులబకాయిలు రూ.4వేలకోట్లు ఉండగా ఇప్పుడు రూ.16 వేల కోట్లకు చేరిందన్నారు. ఉద్యోగుల నుంచి 4 వాయిదాలు కట్టించుకుని హెల్త్ స్కీం అమలు చేయకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పులగం దామోదర్ రెడ్డి మాట్లాడుతూ పీఆర్సీ, ఈహెచ్ఎస్, 2003 డీఎస్సీ ఉద్యోగులకు పాత పింఛను, సీపీఎస్ అధ్యయనానికి కమిటీపై ఇచ్చిన హామీలను సీఎం మరిచారన్నారు. వాటిని గుర్తుచేసేందుకు మంగళవారం ఇందిరా పార్క్ వద్ద వేలాదిమంది ఉపాధ్యాయులతో మహా ధర్నా నిర్వహిస్తున్నామని చెప్పారు.

చర్చించలేని అంశాలపై అధ్యయనానికే కమిటీలు

» మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : చట్టసభల్లో అన్ని అంశాలపై సుదీర్ఘంగా చర్చించే అవకాశం ఉండదని, అందువల్ల ప్రజాసమస్యలను లోతుగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి నిర్మాణాత్మకమైన సూచనలు చేయడంలో శాసన మండలి కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి స్పష్టంచేశారు. తెలంగాణ శాసన మండలి సమావేశ మందిరంలో సోమవారం ఈ కమిటీల ప్రారంభ సమావేశం జరిగింది. ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ ఛైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ సమక్షంలో ఈ సమావేశం నిర్వహించారు. అంచనాల కమిటీ ఛైర్మన్ కోరం కనకయ్య, సభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, పి. రాకేశ్‌రెడ్డి, యాదవరెడ్డి హాజరయ్యారు. అలాగే వన్యప్రాణులు, పర్యావరణ కమిటీ, సౌకర్యాల కమిటీల ఛైర్మన్ హోదాలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొనగా... సభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి, అనిల్ జాదవ్, మేడిపల్లి సత్యం, ఎల్.రమణ, ప్రకాశ్ గౌడ్, నెల్లికంటి సత్యం, బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాధనం దుబారా కాకుండా, ప్రభుత్వ నిధులు లక్ష్యాలకు అనుగుణంగా వినియోగమవుతున్నాయా లేదా అనే అంశాన్ని అంచనాల కమిటీ నిశితంగా పరిశీలించాలని సూచించారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. వన్యప్రాణులు-పర్యావరణ కమిటీ కేవలం సమీక్షలకే పరిమితం కాకుండా అడవులు, జలవనరులు, గాలి, పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

ఎంబీబీఎస్ ఫీజుల పెంపు అన్యాయం

» ఆ సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలి: వికాస్‌రావు

హైదరాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కాళోజీ వర్సిటీ ఎంబీబీఎస్ ఫీజుల పెంపు సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చెన్నమనేని వికాస్‌రావు డిమాండ్ చేశారు. బీ-క్యాటగిరీపై 150 శాతం, సీ-క్యాటగిరీపై 180 శాతానికి పైగా ఫీజులు పెంచడం అన్యాయమన్నారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆన్‌లైన్ నిర్వహణ, పరీక్షల ఖర్చు పేరుతో అదనంగా రూ.23కోట్లు ఎందుకు అవసరమయ్యాయో, పాలకమండలి సమావేశంలో ఏం నిర్ణయించారో ప్రభుత్వం, యూనివర్సిటీ యాజమాన్యం వివరణ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కాంగ్రెస్ హయాంలో విద్యార్థులు అభద్రతా భావంతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు.

'ఎలిజిబిలిటీ' సర్టిఫికెట్ కోసం ప్రత్యేక పోర్టల్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో వైద్య విద్య అభ్యసించి, భారత్‌లో ప్రాక్టీస్ కోసం నిర్వహించే 'ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామినేషన్' (ఎఫ్ఎంజీ) రాసే విద్యార్థులకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) కీలక ప్రకటన చేసింది. ఈ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్ఎంసీ జారీ చేసే ఎలిజిబిలిటీ సర్టిఫికేట్ కలిగి ఉండాలని స్పష్టం చేసింది. ఈ ధ్రువపత్రం ఇప్పటివరకు పొందని అభ్యర్థుల కోసం ఎన్ఎంసీ ప్రత్యేకంగా ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. సెప్టెంబరు 1 నుంచి 30 వరకు దరఖాస్తు చేసుకోవడానికి తుది గడువుగా నిర్ణయించింది. అర్హులైన అభ్యర్థులు https://application.nmc.org.in/register ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్ఎంసీ తెలిపింది.

లైంగిక సామర్థ్య పరీక్షను వ్యతిరేకించిన ట్రైనీ ఐపీఎస్ ఉదయ్‌కృష్ణా రెడ్డి

» విచారణ నేటికి వాయిదా వేసిన హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సాటి మహిళా శిక్షణ ఐపీఎస్‌ను లైంగికంగా వేధించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డి.. దిగువ కోర్టు ఇచ్చిన లైంగిక సామర్థ్య పరీక్ష (పొటెన్సీ టెస్ట్) ఆదేశాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పొటెన్సీ టెస్ట్‌కు అనుమతిస్తూ రాజేంద్రనగర్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఆయన హైకోర్టులో సవాల్ చేశారు. దీనిపై జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఆయన తరఫు న్యాయవాది వాదిస్తూ.. కేసులో పేర్కొన్న సెక్షన్లకు, పొటెన్సీ టెస్ట్‌కు ఏమైనా సంబంధం ఉందా? అని ప్రశ్నించారు. స్టేట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు వాదిస్తూ.. పొటెన్సీ టెస్ట్ దర్యాప్తులో భాగమేనని, దానిని వ్యతిరేకించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. అప్పటివరకు పిటిషనర్‌కు పొటెన్సీ టెస్ట్ చేయరాదని దర్యాప్తు అధికారికి ఆదేశాలు జారీచేసింది.

సురేఖ మాజీ ఓఎస్డీకి హైకోర్టులో దక్కని ఊరట

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారిని బెదిరించి డబ్బులు డిమాండ్ చేయడంతోపాటు ఇనుప రాడ్లతో దాడి చేసిన కేసులో మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ నార్ల సుమంత్‌కు హైకోర్టులో తక్షణ ఊరట లభించలేదు. ఈ కేసును కొట్టేయాలని, పోలీసులు తనపై కఠిన చర్యలు తీసుకోకుండా అడ్డుకోవాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదిస్తూ.. ఈ కేసులో మిగతా నిందితులను పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేసిన నేపథ్యంలో ఆయనను కూడా అరెస్ట్ చేసే అవకాశం ఉందని తెలిపారు. ఆయనపై కఠిన చర్యలు (అరెస్ట్) తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తారని పేర్కొన్నారు. పోలీసుల తరపు న్యాయవాది వాదిస్తూ.. ఫిర్యాదుదారు, రియల్ ఎస్టేట్ వ్యాపారి గొంగిడి హరికృష్ణపై ఇనుప రాడ్లతో దాడి చేయడం వల్ల తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వకుండా తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

పదేళ్ల దోపిడీ డబ్బును ఇప్పటికీ లెక్కపెడుతున్నారు

(మొదటిపేజీ తరువాయి)

సభలో కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్‌కు అధికారం ఇస్తే రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరంతో నిజామాబాద్‌లో ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదని విమర్శించారు. ఆ పార్టీ హయాంలో నాలుగు ఇళ్లే బంగారుమయం అయ్యాయన్నారు. తన తండ్రితో తనను ప్రశాంత్‌రెడ్డి ఎడబాపారని కవిత ఆరోపించారు. ఆయనకు తన ఉసురు తగులుతుందన్నారు. హరీశ్‌రావు, సంతోష్‌రావును క్షమిస్తానేమోగానీ ప్రశాంత్‌రెడ్డిని జీవితంలో క్షమించనని అన్నారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయిన రెండో రోజే ప్రశాంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నించారని తెలిపారు. 'బీజేపీ ఎంపీ అరవింద్ సైతం కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్‌ను కలిసారట' అని కవిత చెప్పారు. ఆడబిడ్డ కష్టాల్లో ఉంటే అక్కున చేర్చుకోవాల్సిన పుట్టింటోళ్లే కుట్రచేసి తరిమేశారని కవిత ఆరోపించారు. మెట్టినింట అత్తమామలు కన్నకూతురిలా కడుపులో పెట్టి చూసుకున్నారంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఏ తప్పూ చేయకపోయినా తనను తిహాడ్ జైల్లో పెట్టారని, నాలుగేళ్లు ఈడీ, సీబీఐతో ఇబ్బందులు పెట్టారని తెలిపారు. అయినా తాను ధైర్యం కోల్పోలేదని, దారి తప్పలేదని అన్నారు. తాను ఏ తప్పూ చేయలేదని సుప్రీంకోర్టే స్వయంగా చెప్పిందని, దేశంలో ఎప్పుడూ లేనిధంగా సీబీఐ ఆఫీసర్ పైనే విచారణ చేయాలని తీర్పు చెప్పిందని గుర్తు చేశారు. తనను పార్టీ నుంచి ఎందుకు తీసేశారో అర్థం కావడంలేదని, సొంతూరుకు వచ్చాక ఆపుదామనుకున్నా కన్నీళ్లు ఆగడంలేదంటూ కవిత కంటతడి పెట్టారు. పదవుల కోసమే అయితే ఏ పార్టీలోకి అయినా వెళ్లవచ్చని, ప్రజల జీవితాల్లో మార్పు కోసమే పంతం పట్టి పార్టీ పెట్టానన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులవుతున్నా..ఒక్క హామీ కూడా అమలు చేయలేదని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ నిద్రపోతోందని, వారి నైజాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. రేవంత్‌రెడ్డి ఎన్నికలు వచ్చినపుడు దేవుళ్లపై ఒట్లు వేస్తారని, ఆ తర్వాత తిట్లు మొదలుపెడతారని విమర్శించారు.

సెప్టెంబరులోనూ తక్కువ వర్షపాతమే!

» దేశంలోని ఎక్కువ ప్రాంతాల్లో

సగటు కంటే తక్కువ వానలు : ఐఎండీ

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలపై ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపుతోంది. రుతుపవనాల సీజన్‌లో చివరి నెల అయిన సెప్టెంబరులో కూడా దేశంలో దీర్ఘకాలిక సగటులో 91 శాతమే వర్షపాతం నమోదుకానుంది. దేశవ్యాప్తంగా సెప్టెంబరులో వర్షాలు, ఉష్ణోగ్రతలపై భారత వాతావరణ శాఖ(ఐఎండీ) సోమవారం అంచనా బులెటిన్‌ను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో సెప్టెంబరులో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదుకానుంది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తర ఒడిశా, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, దక్షిణ బిహార్, కశ్మీర్, లద్దాఖ్, ఉత్తరాఖండ్, కొన్ని ఈశాన్య రాష్ట్రాలు, దక్షిణాదిలోని కొద్ది ప్రాంతాల్లో మాత్రం సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం నమోదుకానుంది. దేశంలో 1971 నుంచి 2020 వరకు సెప్టెంబరు నెలకు దీర్ఘకాలిక సగటు 167.9 మిల్లీమీటర్లు కాగా అందులో 91 శాతం మాత్రమే ఈ నెలలో కురవనుంది. ఈ ఏడాది నైరుతి సీజన్‌లో జూన్ ఒకటో తేదీ నుంచి సోమవారం వరకు దేశంలో 700.7 మి.మీ.లకుగాను 603.7 మి.మీ. (సాధారణంకంటే 14శాతం తక్కువ) వర్షపాతం నమోదైంది. మధ్యభారతంలో 4 శాతం, దక్షిణ భారతంలో 24%, తూర్పు, ఈశాన్య భారతంలో 26%, వాయవ్యభారతంలో 11% లోటు నమోదైంది. దేశంలో కోర్ మాన్‌సూన్ జోన్‌గా పిలిచే మధ్యభారతంలో ఎక్కువ రాష్ట్రాల్లో మంచి వర్షాలు కురవడం కొంత ఊరటనిచ్చినా బిహార్, ఏపీ, ఉత్తర కర్ణాటక, దక్షిణ తెలంగాణ, మరాట్వాడ, తమిళనాడు, కేరళలో కొన్ని ప్రాంతాల్లో వర్షాభావం ఖరీఫ్ సాగుపై తీవ్ర ప్రభావం చూపుతుందని వ్యవసాయ నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. నైరుతి సీజన్ మొదటి మూడు నెలల్లో వర్షాభావంతో రిజర్వాయర్లలో నిల్వలు పడిపోయాయి. భూమిలో తేమశాతం బాగా తగ్గింది. వేసవి తరహా ఎండలు కాస్తుండడంతో పంటల సాగుకు తీవ్ర అవరోధం ఏర్పడింది. సెప్టెంబరులోనూ పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదుకానున్నాయని ఐఎండీ అంచనా వేయడం మరింత కలవరానికి గురిచేస్తోంది. ఆగస్టులో సాధారణం కంటే 16 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని ఐఎండీ తెలిపింది. ఈ నేపథ్యంలో పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో మరింత తీవ్రంగా మారనున్నదనే సంకేతాలు ఆందోళన కలిగిస్తున్నాయని వాతావరణ నిపుణులు వ్యాఖ్యానించారు. ముఖ్యంగా నీటి వనరులు, జల విద్యుత్ ఉత్పత్తి, తాగునీరు లభ్యత, పర్యావరణంపై ప్రతికూల ప్రభావం చూపనుందని పేర్కొన్నారు. దేశంలో ఖరీఫ్ సాగుపై తీవ్ర ప్రభావం పడడంతో కొన్ని పంటల దిగుబడి తగ్గుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. అయితే హిందూ మహాసముద్రంలో తటస్థంగా ఉన్న ఐవోడీ సెప్టెంబరులో పాజిటివ్‌గా మారి ఆ ప్రభావంతో దక్షిణాదిలో వర్షాలు పెరుగుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడనా లు వాయుగుండాలుగా మారి తీరప్రాంత రాష్ట్రాల్లో కొంతమేర నీటి నిల్వలు పెరుగుతాయన్నారు.

ఖరీఫ్ పంటలు గట్టెక్కేనా?

(మొదటిపేజీ తరువాయి)

రైతులతోపాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు అంటున్నారు. గత 3 నెలల సాధారణ వర్షపాతం 740.6 మి.మీ కాగా... కురిసింది 473.8 మి.మీ మాత్రమే. ఆగస్టులో సాధారణ వర్షపాతం 215.8 మి.మీ కాగా... 134.5 మి.మీలు నమోదైంది. అంటే 38% లోటు. సెప్టెంబరులో కూడా వర్షాలు పడకపోతే భూగర్భ జలాలు మరింత పడిపోయి పరిస్థితులు మరింత ఇబ్బందికరంగా మారుతాయని రైతులు అంటున్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఇకపై వరిపంట వేయవద్దని రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వేసినా పంట దిగుబడి ఆశించినంతగా రాదని చెబుతున్నారు. ఇప్పటికే సాగుచేసిన వరి పంటలో కూడా దిగుబడి తగ్గుతుందని అంటున్నారు. రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌లో వరి సాధారణ సాగు విస్తీర్ణం 66 లక్షల ఎకరాలు కాగా... ఈ సీజన్‌లో ఇప్పటివరకు 51 లక్షల ఎకరాల్లో వేశారు. అంటే 33 శాతం తగ్గిపోయింది. పత్తి పంట విస్తీర్ణం మాత్రం సాధారణం కంటే 2 శాతం అధికంగా ఉంది. పత్తి సాధారణ విస్తీర్ణం 47,41,541 ఎకరాలు కాగా... ఈసారి 48,21,503 ఎకరాల్లో సాగుచేశారు. అయితే, ఈ పంట కూడా పూర్తిగా చేతికొచ్చే పరిస్థితి లేదని రైతులు అంటున్నారు. ఒకటిరెండు సార్లు పత్తి తీసేవరకే ఇప్పుడున్న సాగునీరు సరిపోతుందని చెబుతున్నారు. దీంతో ఈసారి పత్తి దిగుబడి తగ్గిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 6.17 లక్షల ఎకరాలకు గాను, 5.90 లక్షల ఎకరాల్లో సాగైంది. వర్షాలు సమృద్ధిగా లేకపోవటంతో మొక్కజొన్న కంకులు చిన్న పిందెల్లా కనిపిస్తున్నాయి. వర్షాభావంతో దేశవ్యాప్తంగా కూడా వరి సాగు విస్తీర్ణం ఈ సీజన్‌లో 3.35 శాతం తగ్గిందని కేంద్ర వ్యవసాయ శాఖ వెల్లడించింది. గత సంవత్సరం ఇదే సీజన్‌లో 428.46 లక్షల హెక్టార్లలో వరి సాగు చేయగా, ఈసారి 414.10 లక్షల హెక్టార్లకే పరిమితమైందని తెలిపింది. కర్ణాటక, తెలంగాణ, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్‌లో వరి సాగు విస్తీర్ణం భారీగా పడిపోయిందని పేర్కొంది.

కల్యాణలక్ష్మి నిలిపివేతపై సర్కారు అప్పీల్

» మధ్యంతర ఉత్తర్వుల మీద అప్పీల్ కుదరదన్న హైకోర్టు రిజిస్ట్రార్

» అభ్యంతరాలను కొట్టివేసిన డివిజన్ బెంచ్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుపై హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం విధించిన స్టేను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసింది. అయితే, సింగిల్ జడ్జి ఇచ్చింది మధ్యంతర ఉత్తర్వులే గానీ తుది తీర్పు కాదు కాబట్టి.. మధ్యంతర ఉత్తర్వులపై అప్పీల్ విచారణార్హం కాదని పేర్కొంటూ, మరికొన్ని ఇతర కారణాలు చూపుతూ ప్రభుత్వ అప్పీల్‌కు హైకోర్టు రిజిస్ట్రీ రెగ్యులర్ నెంబర్ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో, రిజిస్ట్రీ అభ్యంతరాలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'పేద, నిమ్న వర్గాలకు చెందిన యువతుల వివాహానికి ఆర్థిక సాయం చేయడం ద్వారా ఆయా కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఉద్దేశించినవే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు. ఈ పథకాలు బాల్య వివాహాలను అరికట్టటానికి ఉపయోగపడుతున్నాయి. వీటిని అడ్డుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌లో ఎటువంటి ప్రజాప్రయోజనం లేదు' అని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌కు విచారణార్హత ఉందా? అన్న అంశాన్ని పరిశీలించింది. సంక్షేమ పథకాలను అమలు చేయడం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్న విచక్షణాధికారం అని పేర్కొంటూ గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ధర్మాసనం ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో రిజిస్ట్రీ అభ్యంతరాలను తోసిపుచ్చింది. ప్రభుత్వం దాఖలు చేసిన రిట్ అప్పీల్‌కు రెగ్యులర్ నెంబర్‌ను కేటాయించాలని రిజిస్ట్రీకి ఆదేశాలు జారీచేసింది. అప్పీల్‌పై నేడు విచారణ జరగనుంది.

ప్రజల ఆశీర్వాదంతో ప్రజాపాలనకు 1000 రోజులు

» విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేశాం

» రైతు సంక్షేమానికి ప్రాధాన్యం:మహేశ్‌గౌడ్

» కాంగ్రెస్ విజయాలను చూసి బీఆర్ఎస్‌కు భయం పట్టుకుంది: పొన్నం, అడ్లూరి

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజల ఆశీర్వాదంతో ప్రజాపాలన 1000 రోజులు పూర్తి చేసుకుందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఈ వెయ్యి రోజుల పండుగలో విద్యా, వైద్య రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని.. రైతులు, మహిళలు, వ్యవసాయ కూలీలు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తోందని చెప్పారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిచ్చి రూ.2లక్షల వరకు పంట రుణాల మాఫీ ద్వారా దాదాపు 25.35లక్షల మంది రైతులకు రుణ విముక్తి కలిగిస్తూ రూ.20వేల కోట్లకు పైగా నిధులు విడుదల చేసిందన్నారు. రైతు భరోసాను ఎకరానికి రూ.12వేలకు పెంచి, ఇప్పటివరకు రూ.36వేల కోట్లు అందించామని తెలిపారు. వ్యవసాయ రంగానికి రూ.1.75లక్షల కోట్లు ఖర్చు చేసి రికార్డు సృష్టించామని, సన్న వడ్ల బోనస్‌కు రూ.4 వేల కోట్లు, ఉచిత విద్యుత్తుకు రూ.30 వేల కోట్లు, రైతు బీమాకు రూ.3,500 కోట్లు కేటాయించి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశామని స్పష్టం చేశారు. గృహజ్యోతి కింద 200యూనిట్ల ఉచిత విద్యుత్తు, రూ.500కే ఎల్పీజీ సిలిండర్, 16.32 లక్షల కొత్త రేషన్ కార్డులను జారీ చేశామన్నారు. యువతకు ఉపాధి, విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ 70 వేలకు పైగా ప్రభుత్వ నియామకాలు చేపట్టామని పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధికి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటుతో పాటు ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. బీసీ కులగణన చేపట్టి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించామని.. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. ప్రజాపాలన ప్రభుత్వం విజయవంతంగా 1,000 రోజులు పూర్తి చేసుకోవడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు, ప్రజాప్రతినిధులకు, కాంగ్రెస్ శ్రేణులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

బీఆర్ఎస్‌కు ప్రజలే తగిన జవాబు చెప్పాలి

రాష్ట్రంలో ప్రజాపాలన ప్రభుత్వం విజయవంతంగా 1000 రోజుల పాలన పూర్తి చేసుకుంటున్న తరుణంలో బీఆర్ఎస్ చేపడుతున్న నిరసనలకు ప్రజలే తగిన సమాధానం చెప్పాలని మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ విజయాలను చూసి భయంతోనే బీఆర్ఎస్ నేతలు రాజకీయ ప్రయోజనాల కోసం నిరసనల నాటకమాడుతున్నారని విమర్శించారు. పదేళ్ల పాలనలో తెలంగాణను అప్పులమయం చేసి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపిన బీఆర్ఎస్‌కు ప్రభుత్వంపై నిరసన తెలిపే నైతిక హక్కు లేదన్నారు. బీఆర్ఎస్ నాయకులు గ్రామాల్లోకి వచ్చినప్పుడు పదేళ్లలో ఏం చేశారని ప్రజలు నిలదీయాలని కోరారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు, వాటి వడ్డీల భారంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ వ్యవసాయం, విద్యా, వైద్య రంగాలకు ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు.

విదేశీ రోగుల కోసం 400 పడకలు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నత వైద్య ప్రమాణాలు, మెరుగైన మౌలిక సదుపాయాలు, పారదర్శకమైన సేవలు, ప్రచారం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ఇందులో భాగంగా ముందుగా ప్రమాణాలపై సర్కారు దృష్టి సారించింది. ఆస్పత్రులకు జాయింట్ కమిషన్ ఇంటర్నేషనల్ (జేసీఐ) గుర్తింపు ఉందా లేదా అని విదేశీ రోగులు చూస్తారు. కొన్ని నెలల్లోనే ఈ గుర్తింపు సాధించాలని ప్రభుత్వం భావిస్తోంది. నేషనల్ అక్రెడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ గుర్తింపుపైనా దృష్టి సారించింది. సౌకర్యాల విషయానికొస్తే సనత్ నగర్ టిమ్స్‌లో ఇంటీరియర్ డిజైన్స్, ఇంటర్నల్ స్ట్రక్చర్స్, హైఫై ఫర్నిచర్ ఏర్పాటు బాధ్యతను టీజీఎంఎస్ఐడీసీకి అప్పగించారు. ప్రత్యేక వార్డులు, ప్రైవేటురూంలు ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్‌కు వచ్చే విదేశీ రోగులు ముఖ్యంగా అపోలో, యశోద, ఏఐజీ, కాంటినెంటల్ వంటి ఆస్పత్రులకు వెళుతున్నారు. దీంతో ఆ ఆస్పత్రులు వారి కోసం ఎలాంటి విధానాలు అవలంబిస్తున్నాయి?

ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నాయనే అంశాలపై వైద్య శాఖ అధికారులు అధ్యయనం చేయనున్నారు.

ప్రత్యేక విభాగం.. నోడల్ అధికారులు!

ప్రస్తుతం హైదరాబాద్ జాతీయ, అంతర్జాతీయ రోగుల వైద్య చికిత్సలకు గమ్యస్థానంగా మారింది. ఏటా ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 8-10 లక్షల మంది, విదేశాల నుంచి మరో 2 లక్షల మంది వరకు రాష్ట్ర రాజధానికి వస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ టూరిజం సొసైటీ (టీజీఎంటీఎస్) ఏర్పాటు చేసింది. ఇప్పటికే ఉన్న మెడికల్ వాల్యూ టూరిజం(ఎంవీటీ)ని మరింత బలోపేతం చేయనుంది. ఎంవీటీలో పది రకాల శాఖలు అంతర్భాగంగా ఉంటాయని, అవి సమన్వయంతో పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుందని వైద్య వర్గాలు వెల్లడించాయి. టీజీఎంటీఎస్, ఎంవీటీ కలసి విదేశీ రోగుల కోసం విధానాలు రూపొందించనున్నాయని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఒక విదేశీ రోగి విమానాశ్రయంలో దిగగానే పికప్ చేసుకోవడం నుంచి తిరిగి వెళ్లేవరకు అవసరమైన సేవలుఅందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. దీనికి నోడల్ అధికారులను ఏర్పాటు చేయనున్నారు.రిజిస్ట్రేషన్, క్యాష్‌లెస్, కరెన్సీ ఎక్స్ఛేంజ్ చెల్లింపులు సులభంగా జరగడానికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయడంతోపాటు విదేశీ భాషలు మాట్లాడగలిగేఅనువాదకులనుఅందుబాటులో ఉంచే అవకాశాలను సర్కారు పరిశీలిస్తోంది. వైద్యులు, నర్సులు, సిబ్బందికి విదేశీ రోగుల సంస్కృతి, ఇంగ్లిషుపై పట్టు కోసం శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోనున్నారు.

చేయూత గడువు పెంపు

» ఈనెల 15 వరకు అవకాశం

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): చేయూత పింఛన్ల దరఖాస్తు గడువును తెలంగాణ సర్కారు పొడిగించింది. తొలుత నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 31తో గడువు ముగియాల్సి ఉండగా.. మరో 15 రోజులు పొడిగించి ఈ నెల 15 వరకు అవకాశం కల్పించింది. దరఖాస్తుల స్వీకరణకు తక్కువ సమయం ఉండటం, అవసరమైన ధ్రువపత్రాలు సమకూర్చుకోవడంలో ఆలస్యం, ఆన్‌లైన్ డేటా ఎంట్రీలో సాంకేతిక ఇబ్బందులు వంటి కారణాలతో చాలా మంది దరఖాస్తు చేసుకోలేకపోయారని సమాచారం. ఇక సోమవారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా 4,81,462 మంది చేయూత పింఛన్లకు దరఖాస్తు చేసుకోగా.. అందులో వితంతువుల క్యాటగిరీలో అత్యధికంగా 2,83,492 దరఖాస్తులు అందినట్లు సెర్ప్ విభాగాలు తెలిపాయి. దివ్యాంగులు 1,16,652 మంది, ఒంటరి మహిళలు 30,452, చేనేతకార్మికులు 12,750, గీత కార్మికులు 30,416 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వివరించాయి. ఈ దరఖాస్తులపై మంగళవారం నుంచి క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణ ప్రాంతాల్లో మునిసిపల్, కార్పొరేషన్ సిబ్బంది దరఖాస్తుదారుల అర్హతలను పరిశీలించనున్నారు. నిబంధనల ప్రకారం తుది జాబితాను రూపొందించి కొత్త పింఛన్లను మంజూరు చేయనున్నారు. అర్హత ఉండి ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోలేకపోయిన వారందరికీ అవకాశం కల్పించేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని మంత్రి సీతక్క ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికీ దరఖాస్తు చేసుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

రైల్వే అభివృద్ధిలో తెలంగాణకు పెద్దపీట

» కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

గద్వాల/అలంపూరు చౌరస్తా/మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైల్వేల అభివృద్ధిలో తెలంగాణకు పెద్దపీట వేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఏడాదికి సగటున రూ. 5,454 కోట్లు ఖర్చు చేస్తోందని చెప్పారు. పదేళ్లతో కొత్త రైల్వే లైన్ల నిర్మాణం, స్టేషన్ల అభివృద్ధితో పాటు 100 కొత్త రైళ్లను ప్రవేశపెట్టిందని తెలిపారు. ఐదు వందే భారత్ రైళ్లను కేటాయించిందని చెప్పారు. అమృత్ భారత్ కింద ఏకకాలంలో 42 స్టేషన్ల అభివృద్ధి చేపట్టామన్నారు. సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో జోగుళాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. జోగుళాంబ, గద్వాల, మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. 2014కు ముందు ఉమ్మడి రాష్ట్రంలో ఏడాదికి సగటున రూ.886 కోట్లు ఖర్చు చేస్తే 2025-26లో ఒక్క తెలంగాణలోనే రూ.5,454 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. 2009-14 మధ్య ఏడాదికి 87 కిలోమీటర్ల రైల్వే లైన్ల నిర్మాణం జరిగితే 2014 తర్వాత అది 880 కిలోమీటర్లకు పెరిగిందన్నారు.

తెలంగాణలో సెమీకండక్టర్ తయారీపై పెట్టుబడులు పెట్టండి

జర్మన్ పారిశ్రామికవేత్తలను కోరిన శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సెమీ కండక్టర్ల తయారీ సహా పలు రంగాల్లో జర్మనీ కంపెనీలు పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించాలని.. జర్మన్ ఇండియన్ బిజినెస్ అలయన్స్(జీఐబీఏ)ను మంత్రి శ్రీధర్‌బాబు కోరారు. రాష్ట్రం నుంచి జర్మనీ, యూరప్ మార్కెట్లకు సులభ ఎగుమతులకు వీలుగా 'తెలంగాణ-జర్మనీ' లాజిస్టిక్ కారిడార్ ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జర్మనీలోని కెల్‌స్టర్‌బాక్ నగర మేయర్ మాన్‌ఫ్రెడ్ ఓకెల్ నేతృత్వంలో జీఐబీఏ ప్రతినిధి బృందం సోమవారం సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసింది. పలు రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను మంత్రి వివరించారు.

క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యం

రెడ్‌కో వీసీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ

తెలంగాణ రాష్ట్రం శుద్ధ, పర్యావరణ అనుకూల (క్లీన్ అండ్ గ్రీన్) ఇంధన వనరులను ప్రోత్సాహిస్తోందని.. తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీరెడ్‌కో) వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (వీసీ ఎండీ) ముషారఫ్ అలీ ఫారూఖీ అన్నారు. నవంబరులో జరగబోయే ప్రతిష్ఠాత్మక 'భారత్ ఆర్ఈ సమ్మిట్ అండ్ ఎక్స్‌పో'కు సంబంధించి సోమవారం హైదరాబాద్‌లో రోడ్‌షో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫారూఖీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025లో భాగంగా సౌర, పవన విద్యుత్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ తదితర ఇంధన వనరుల ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రాన్ని స్వచ్ఛమైన, స్థిరమైన ఇంధన భవిష్యత్ వైపు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. దేశంలో పునరుత్పాదక ఇంధనరంగ అభివృద్ధికి చర్యలను వేగవంతం చేసినట్టు కేంద్ర నూతన, పునరుద్ధరణీయ ఇంధన వనరుల మంత్రిత్వశాఖ శాస్త్రవేత్త సంజయ్ గోరేలాల్ కామ్‌దార్ ఈ సందర్భంగా తెలిపారు.

Printed and published by Koganti Venkata Seshagiri Rao , on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and published at " Aamoda Press" at Plot No. 112, IDA, Khanapuramhaveli, Khammam, Tel. No. 08742-247915, Editor: N.Rahul Kumar.
RNI No: APTEL/2004/11932 Managing Director : Vemuri Radha Krishna,Founder : K.L.N. Prasad.

ధరల పట్టికను ప్రదర్శించాలి

కల్లూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో గల పలు రక్తపరీక్ష కేంద్రాలను సోమవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రదీప్‌బాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ల్యాబ్‌లోని పరికరాలను, రికార్డులను పరిశీలించారు. ప్రతి ఒక్కరు విధిగా ధరల పట్టికను ప్రదర్శించాలని సూచించారు. నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి నవ్యకాంత్, తదితరులు పాల్గొన్నారు.

రక్త పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రదీప్‌బాబు

పేద విద్యార్థులకు దివ్యాంగుల చేయూత

అందుకున్న నోట్‌బుక్స్, పెన్నులతో విద్యార్థులు

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పేద పిల్లలకు సేవా చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు దివ్యాంగులు అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని కాకర్లపల్లి పీఎస్ హెచ్‌ఎం రావుల నరసింహారావు అన్నారు. సోమవారం సత్తుపల్లిలోకి సిద్దారం రోడ్డుకు చెందిన స్వర్ణిక దివ్యాంగుల సేవా ఆశ్రమం ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వలపర్ల రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'అందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం'

చింతకాని, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సామాన్యుని ఇందిరమ్మ ఇంటి కల కాంగ్రెస్ ప్రభుత్వంలో తీరుతున్నదని సర్పంచ్ కొప్పుల రజని పేర్కొన్నారు. మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. మత్కేపల్లి ఏఎంసీ ఛైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు కన్నెబోయిన గోపి, మడుపల్లి భాస్కర్, కొప్పుల గోవిందరావు, కూరపాటి కిషోర్, మాజీ సర్పంచ్ గొడుగు రమేష్, ఏఎంసీ డైరెక్టర్లు మేకపోతుల రేవతి, బందెల నాగార్జున, తాళ్ల రామారావు, సుధాకర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషితో నిండిన వైరా రిజర్వాయర్

సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

వైరా, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ముందుచూపు, కృషి ఫలితంగానే గోదావరి జలాల రాకతో వైరా రిజర్వాయర్ నిండుకుండలా మారిందని వైరా ఏఎంసీ ఛైర్మన్ బొర్రా గంగారావు, ఆత్మఛైర్మన్ మట్టూరి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం చంద్రశేఖర్‌రెడ్డి, వీరంశెట్టి సీతరాములు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దొడ్డా పుల్లయ్య, డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ కాపా మురళీకృష్ణ, నాయకులు మచ్చా బుజ్జి, పమ్మి అశోక్, బీడీకే.రత్నం, ఏదునూరి సీతరాములు, పొట్లపల్లి శ్రీనివాసరావు, దాసరి దానియేలు, పాలేటి నర్సింహారావు, మిట్టపల్లి సతీష్, చప్పిడి వెంకటేశ్వర్లు, గొల్లపూడి సర్పంచ్ మేడూరి రామారావు పాల్గొన్నారు.

పాలనలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం

ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వైరా, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యిరోజుల పాలనలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్జేసీ కృష్ణ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోతు చంద్రావతి విమర్శించారు. నిరసన కార్యక్రమాల సన్నద్ధత కోసం ముఖ్యకార్యకర్తల సమావేశం సోమవారం వైరాలో నిర్వహించారు. నాయకులు కట్టా కృష్ణార్జున్‌రావు, బాణాల వెంకటేశ్వరరావు, వనమా విశ్వేశ్వరరావు, లకావత్ గిరిబాబు, బానోతు మనీషాలక్ష్మీ, ముత్యాల సత్యనారాయణ, పోట్ల శ్రీనివాసరావు, మద్దెల రవి, అప్పం సురేష్, ఏదునూరి శ్రీను పాల్గొన్నారు.

సేవాలాల్ నూతన కమిటీల నియామకం

వైరా, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వైరా మండల సేవాలాల్ సేన నూతన కమిటీని నియమించారు. కమిటీ నియామక పత్రాలను జిల్లా అధ్యక్షుడు భూక్యా నర్సింహారావు అందజేశారు. మండల అధ్యక్షుడిగా బానోతు మురళీ, ఉపాధ్యక్షుడిగా సతావత్ శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బానోతు అయ్యప్ప, ప్రధాన కార్యదర్శులుగా బానోతు మురళీకృష్ణ, గుగులోతు సైదులు, కార్యదర్శులుగా కేలోతు నాగసైదులు, బానోతు మాన్‌సింగ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ముఖి మహేష్, గుగులోతు రవి, అధికార ప్రతినిధిగా భూక్యా ఉపేంద్ర నియమితులయ్యారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వినోద్‌కుమార్ రాథోడ్, కార్యదర్శి ఇస్లావత్ చందూనాయక్ పాల్గొన్నారు.

మిట్టపల్లి సతీష్‌కు సన్మానం

వైరా, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంజిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా నియమితులైన మిట్టపల్లి సతీష్‌ను సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం చంద్రశేఖర్‌రెడ్డి, వీరంశెట్టి సీతరాములు, నాయకులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, దాసరి దానియేలు, దొడ్డా పుల్లయ్య, పమ్మి అశోక్, మచ్చా బుజ్జి, ఏఎంసీ ఛైర్మన్ బొర్రా గంగారావు, మాజీ ఛైర్మన్ బీడీకే.రత్నం, ఆత్మ ఛైర్మన్ మట్టూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్ మేడూరి రామారావు పాల్గొన్నారు.

139 గ్రామాల్లో రీసర్వే!

(3వ పేజీ తరువాయి)

డేటాను క్షుణ్ణంగా క్రాస్ చెక్ చేసి ఎప్పటికప్పుడు మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పట్టాదార్ పాస్‌బుక్ (పీపీబీ) ఉన్న ఆక్యుపెన్సీ, పీపీబీ లేని ఆక్యుపెన్సీ వివరాలు వేర్వేరుగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలు, వ్యత్యాసాలు, సందేహాలను, అభ్యంతరాలు తప్పని సరిగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారులు సర్వే, డేటా ఎంట్రీ సజావుగా సాగేందుకు కృషి చేస్తున్నారు. మొత్తం సర్వే, డేటా ఎంట్రీ, మ్యాపింగ్ పూర్తయిన తరువాత సీసీఎల్‌కు నివేదిక పంపనున్నారు. అక్కడ పరిశీలన అనంతరం రైతులకు వారి భూములకు సంబంధించిన మ్యాపుతో పాస్‌పుస్తకాలు జారీ అయ్యే అవకాశం ఉంది.

భూ రీ సర్వేతో వందేళ్ల నాటి భూమి సమస్యలు పరిష్కారమయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రధానంగా సాగులో ఉండి హక్కులు లేని వారికి హక్కులు కల్పించే అవకాశం కలుగుతోంది. భూమి లేకుండా పాస్‌పుస్తకాలు పొందిన వారిని రికార్డుల నుంచి తొలగించే అవకాశం ఉంది. చాలా కాలం నుంచి ఉన్న ఆర్ఎస్ఆర్ సమస్య రీ సర్వేతో తొలగిపోయే అవకాశం ఉంది. రికార్డుల ప్రకారం ఒక సర్వే నెంబర్ ఉంటే అదే రైతు వేరే సర్వే నెంబర్‌లో అనుభవదారుగా (పొజిషన్‌లో) ఉండటం రాష్ట్ర వ్యాప్తంగా సమస్య ఉంది. విస్తీర్ణంలో తేడాల కారణంగా భూముల యజమానులు ప్రధానంగా ఇబ్బంది పడ్డారు. ఇలాంటి సమస్యలకు రీ సర్వే సందర్భంగా పరిష్కారం లభించనుంది. బేతుపల్లి రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న రీ సర్వేపై కలెక్టర్ దివాకర, ఇతర అధికారులతో కలిసి మంత్రి పొంగులేటి గత నెల 20వ తేదీన సత్తుపల్లి మండలం నారాయణపురంలో సమీక్షించి సర్వే జరుగుతున్న తీరుపై రైతులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు.

మట్టి అక్రమ రవాణాకు..
అడ్డుకట్ట పడేనా?

- మట్టికోసం మనుషుల ప్రాణాలు బలవ్వాలా!
- ప్రమాదఘటనపై వెల్లువెత్తుతున్న విమర్శలు

ఎర్రుపాలెం, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): అక్రమ మట్టి రవాణా ఇద్దరి వ్యక్తుల నిండు ప్రాణాలను బలిగొంది. అనుమతులు లేకుండా మట్టిన తరలిస్తున్న ట్రాక్టర్ అతి వేగంతో దూసుకెళ్లి బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందిన విషాదఘటన బుధవారం స్థానికంగా కలకలం రేపింది. ఈఘటనతో మట్టి తవ్వకాలకు అక్రమ రవాణాకు అనుమతులు ఎవరిచ్చారు? ఎక్కడెక్కడ అక్రమంగా తవ్వకాలు, రవాణా జరుగుతుందన్న అంశాలపై సమగ్ర విచారణ జరపాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలను సీజ్ చేసి బాధ్యులపై చట్టపరంగా చర్యలు ఎందుకు తీసుకోవడంలేదని ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

పట్టపగలే అక్రమంగా గ్రావెల్ రవాణా

మండలంలో బుచ్చిరెడ్డిపాలెం, నరసింహాపురం, వెంకటాపురం గ్రామాల్లో అప్పుడప్పుడు పట్టపగలే టిప్పర్లతో, ట్రాక్టర్లతో యథేచ్ఛగా మట్టి అక్రమంగా రవాణా జరుగుతున్నా ఇష్టారీతిన మితిమీరన వేగంతో రోడ్లపై భయభ్రాంతులు కలుగచేస్తున్నా మైనింగ్ రవాణ రెవెన్యూధికారు లు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కొన్నిచోట్ల అభివృద్ధి పేరుతో అధికార పార్టీ నాయకలు నిబంధనలు తుంగలోతొక్కి అక్రమంగా తవ్వకాలు, రవాణా చేయడం ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టడంతో పాటు రహదారులపై ప్రజల భద్రత ప్రమాదంలోకినెట్టే పరిస్థితులు నెలకొన్నాయి. అక్రమరవాణాకు పడేది అధికారపార్టీ నాయకులే కావడంతో సంబంధిత అధికారులు ముందస్తు తనిఖీలు, వాహనాలకు వేగ నియంత్రణ, అనుమతుల పరిశీలన వంటివి చేపట్టడం లేదని పేర్కొంటున్నారు. ప్రమాదాలు జరిగాక చర్యలు తీసుకుంటే ప్రయోజనం ఏంటని పలు ప్రజలు వాపోతున్నారు.

నర్సింహాపురం గ్రామంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న దృశ్యం

ఆధారాన్ని కోల్పోయిన కుటుంబాలు

నిన్నటి వరకు కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించిన ఆ ఇద్దరు ఇప్పుడు తిరిగిరాని లోకాలకు వెళ్లారు.ఉదయం ఇంటినుంచి బయలుదేరిన వారు సాయంత్రానికి తిరిగి వస్తారని ఎదురుచూసిన, కుటుంబసభ్యులకు వారి మృతదేహాలు కనిపించడంతో వారి ఇళ్లలో ఒక్కసారిగా విషాదం అలుముకుంది. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ప్రమాదంలో మృతిచెందడంతో ఆకుటుంబం ఇద్దరు పెద్దదిక్కులను కోల్పోయింది. రోజుకూలీ చేస్తే వచ్చే కొద్దిపాటి ఆదాయంతోనేఇళ్లను నెట్టుకోచ్చేవారు. అలాంటి కుటుంబాలకు ఇప్పుడు భవిష్యత్‌ప్రశ్నార్థకంగా మారింది. ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులను మట్టి ట్రాక్టర్ ఢీకొని మృతి చెందిన బుచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కొరకొప్పుల రమేష్ పెసరమల్లి నాగరాజు కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితులు నెలకొన్నాయి. మృతులు ఇద్దరు తోడల్లుళ్లు కావడంతో ఒకే ఊరుకావడంతో గ్రామంలో ఒక్కసారిగా విషాదం అలుముకుంది. కొరకొప్పుల రమేష్ ఏపీలోని గంపలగూడెం మండలం కొత్తపల్లి గ్రామం నుంచి 4ఏళ్ల క్రితం పొట్టచేత్తో పట్టుకుని బుచ్చిరెడ్డిపాలేనికి చేరుకున్నాడు. బనిగండ్లపాడులోని ఓ రైస్‌మిల్లులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు ఇక అదే గ్రామానికి చెందిన పెసరమిల్లి నాగరాజు ఏడాది క్రితమే భార్యపిల్లలతో హైదరాబాదులో ఓ ప్రైవేటు కంపెనీలో వాచ్‌మెన్‌గా భార్య చుట్టుపక్కల ఇళ్లలో పనిచేస్తున్నారు. కాగా బంధువుల వివాహానికి హాజరై తిరిగి వెళ్తుండగా ఈప్రమాదం జరిగింది. ఈకుటుంబాలకు ప్రభుత్వం తక్షణం ఆర్థిక సహాయం అందించడంతోపాటు బాధిత కుటుంబాల్లోని ఆధారపడిన వారికి జీవనోపాధి కలిపించాలని ప్రజలు కోరుతున్నారు.

వేతనాల కోసం మున్సిపాలిటీ కార్మికుల ధర్నా

ధర్నా చేస్తున్న మున్సిపాలిటీ కార్మికులు

కల్లూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బకాయి వేతనాలు అందించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కల్లూరులో సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట మున్సిపాలిటీ కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేము రాంబాబు మాట్లాడుతూ మున్సిపాలిటీ ఏర్పడి 15 నెలలు గడిచిన 6 నెలలు మాత్రమే వేతనాలు అందించారన్నారు. మరో 9 నెలల వేతనాలు బకాలు అందిచక పోవటంతో కార్మికులు దుర్భరమైన జీవితాన్ని గడుపుతన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్‌కు కార్మికులు వినతి పత్రం అందించారు. సకాలంలో వేతనాలు చెల్లించకపోతే సెప్టెంబరు 16 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు స్పష్టం చేశారు. మున్సిపాలిటీ కార్మికుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఊడల కృష్ణమూర్తి, కార్యదర్శి ఎస్‌డీ వజీర్మియా, ప్రకాష్, మణిరాజ్, చింతపల్లి శ్రీను, అంజలి, యశోద, కృష్ణవేణి తదితరులున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

సత్తుపల్లిలో మాట్లాడుతున్న న్యాయాధికారి మారగాని శ్రీనివాస్

సత్తుపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి కోర్టులో ఈనెల 12న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సత్తుపల్లి కోర్ట్ న్యాయాధికారి మారగాని శ్రీనివాస్ కోరారు. సత్తుపల్లి కోర్టులో సోమవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్‌కే.మీరా ఖాసీంసాహెబ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఎస్ఎన్.సుమబాల, అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి వీ.లావణ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కూకలకుంట రవి తదితరులున్నారు.

మధిర : మధిర కోర్టులో ఈనెల12న జరిగే మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మధిర కోర్టు న్యాయాధికారి వేముల దీప్తి కోరారు. సోమవారం మధిర కోర్టు హాల్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వైరా ఏసీపీ సారంగపాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చావలి రామరాజు, మధిర రూరల్ సీఐ మధు, టౌన్ సీఐ రమేష్, ఎస్ఐలు నవిత, కిషోర్, రమేష్, ఎక్సైజ్ సీఐ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మధిరలో మాట్లాడుతున్న న్యాయాధికారి దీప్తి

రేజర్లలో ఘనంగా ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

పూజలు నిర్వహిస్తున్న డాక్టర్ దయానంద్, మాజీ ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం రేజర్లలోని హరిజనవాడలో ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం అత్యంత వైభవంగా సాగింది. ఈ సందర్భంగా మేళతాళాలు డప్పువాయిద్యాల నడుమ భక్తులతో ఆలయానికి చేరుకోగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రతిష్ఠ సందర్భంగా కాలనీవాసులు, కుటుంబ సభ్యులంతా తరలిరావడంతో పండుగ వాతావరణం నెలకొంది. ప్రతిష్ఠ మహోత్సవానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హాజరై అమ్మవారికి పూజలు చేశారు.

క్రీడలు పోటీతత్వాన్ని పెంపొందిస్తాయి

బోనకల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): క్రీడలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని ఎంఈవో దామాల పుల్లయ్య తెలిపారు. మండలంలోని ముష్టికుంట్ల ప్రాథమిక పాఠశాలలో సోమవారం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు మండల స్థాయి ఆటల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన పిల్లలకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిల్లలమర్రి నాగేశ్వరరావు, ఐఈఆర్‌పీ పుల్లారాణి, ప్రశాంతి, హెచ్‌ఎం సునీత కుమారి, అమృత వర్షిణి తదితరులు పాల్గొన్నారు.

ఓట్లు తొలగించడానికే 'సర్' నోటీసులు

పెనుబల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణల పేరుతో ఎలక్షన్ కమిషన్ ప్రజలతో ఆటలాడుకుంటుందని సీపీఎం జిల్లా నాయకుడు చలమాల విఠల్‌రావు, పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి కాటినేని శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు పంతంగి వెంకటేశ్వరరావు ఆరోపించారు. సోమవారం పెనుబల్లి పంచాయతీ కార్యాలయంలోని బీఎల్‌వో వద్ద వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలోని చిన్నచిన్న తేడాలకు నోటీసులు ఇచ్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. నోటీసులను ఉపసంహరించుకొని ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ఓనం వేడుకలు

ఓనం వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

కల్లూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని లెమర్ పాఠశాలలో సోమవారం ఘనంగా ఓనం వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయక దుస్తుల్లో పాల్గొని, ఓనం విశిష్టతను చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అబ్బాస్ హసన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తమ్మిలేరులో చట్టవిరుద్ధంగా వ్యర్థాల డంపింగ్

తమ్మిలేరు వాగులో వ్యర్థాలు వదులుతున్న వాహనం

సత్తుపల్లిరూరల్, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): కాలువల్లో, బహిరంగ ప్రదేశాల్లో సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను నేరుగా వదలడం చట్టవిరుద్ధమని తెలిసినప్పటికీ సత్తుపల్లి మున్సిపాలిటీలో పలువురు సెప్టిక్ ట్యాంక్ నిర్వాహకులు ఇళ్లలో సేకరించిన వ్యర్థాలను బహిరంగంగా యథేచ్ఛగా పట్టణ శివారులోని తమ్మిలేరు వాగులో వదిలేస్తున్నారు. ఈ ఘటన సోమవారం సత్తుపల్లి పట్టణ శివారులో చోటుచేసుకుంది. వ్యర్థాలను సురక్షితంగా ప్రభుత్వం గుర్తించిన మురుగునీటి శుద్ధిప్లాంట్ల(ఎస్‌టీపీ)కే చేరవేయాలని, అలాకాకుండా నిబంధనలకు విరుద్ధంగా బహిరంగంగా వదిలితే మున్సిపల్, గ్రామ పంచాయతీ నిబంధనల ప్రకారం జరిమానాలు విధించాల్సి ఉంది. ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్ కొండ్ర నర్సింహ్మను వివరణ కోరగా ఎస్‌టీపీలు అందుబాటులో లేవని, నిబంధనలు మీరిన నిర్వాహకులకు నోటీసులు ఇస్తామని తెలిపారు.

పాముకాటుతో వృద్ధురాలి మృతి

పెనుబల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పాముకాటుతో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన పెనుబల్లిలోని తూర్పుబజార్‌లో సోమవారం చోటుచేసుకుంది. అనారోగ్యంతో గత కొంతకాలంగా ఇంట్లో ఉంటున్న కట్టమూడి భారతమ్మ(60) నల్లతాచు కాటు వేయడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లింది. కుటుంబసభ్యులు ఆమెను పెనుబల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. భారతమ్మను కాటువేసిన పామును స్థానికులు చంపివేశారు.

'ప్రజావాణి' దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

కల్లూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అందిన ప్రజా సమస్యలపై నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేలా సంబంధిత అధికారులు దృష్టి సారించాలని కల్లూరు సబ్‌కలెక్టర్ అజయ్ యాదవ్ కోరారు. సోమవారం కల్లూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటైన ప్రజావాణిలో పలు సమస్యలపై పలువురు వినతి పత్రాలు అందించారు.

కల్లూరులో ఫిర్యాదులను స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్

వాకింగ్‌ట్రాక్ స్థలాన్ని ఏర్పాటు చేయాలని వినతి

వైరా : వైరా మున్సిపాలిటీలో ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్, రిక్రియేషన్ల కోసం స్థలాన్ని సమకూర్చాలని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ సోమవారం జరిగిన ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఉండ్రు శ్యాంబాబు, తోటకూర శ్రీకాంత్, వాంకుడోతు బీక్యా పాల్గొన్నారు.

ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ

కొణిజర్ల : ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో సర్ ప్రక్రియలో భాగంగా విడుదల చేసిన ముసాయిదా జాబితాలో లోపాలు ఉన్నాయని వాటిని సరిచేయాలని కోరుతూ లాలాపురానికి చెందిన పలువురు దరఖాస్తు చేశారు. ప్రజా వాణికి రాని శాఖలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంపీడీవో ఉపేంద్రయ్య తెలిపారు.

పెసలు కొనుగోలు చేపట్టాలి

చింతకాని : మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం పెసలు కొనుగోలు చేయాలని సోమవారం ప్రజావాణిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. మాజీ వైఎస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు, వంకాయలపాటి సత్యం, పోట్ల సీతయ్య, మేకపోతుల శ్రీనివాసరావు, అచ్యుతరావు, సైదేశ్వరరావు, కృష్ణయ్య, జనార్దన్‌రావు పాల్గొన్నారు.

డీజే సౌండ్లు నియంత్రించాలని గృహిణి ఫిర్యాదు

చింతకాని: డీజే సౌండ్లు నియంత్రించాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో చింతకాని మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన గృహిణి బోజెడ్ల మంగా సత్యావతి అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో సమయం, సందర్భంగా లేకుండా అర్ధరాత్రి ఇష్టం వచ్చిన సమయాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా పెద్ద శబ్ధాలతో డీజే సౌండ్స్‌తో నిద్ర లేకుండా చేస్తున్నారని తక్షణమే అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు స్వర్ణ సుబ్బారావు ఉన్నారు.

బురదమయంగా రహదారులు

- ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు
- పట్టించుకోని అధికారులు

కొణిజర్ల, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): కొణిజర్ల మండలం తనికెళ్ల నుంచి గణేశ్వరం వరకు ఏడు కిలోమీటర్ల పొడవున ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం ద్వారా బీటీ రోడ్డును నిర్మించారు. రహదారి నిర్మాణం జరిగి సుమారు ఐదేళ్లవుతుంది. రోడ్డుకు ఇరువైపుల మట్టి కోతకు గురికావడం, అక్కడక్కడ గుంతలు పడటం, రోడ్డుకు ఇరువైపుల అక్కడక్కడ జంగిల్ పెరగటంతో నిబంధనల ప్రకా రం అధికారులు సంబంధిత గుత్తేదారుతో మట్టిని పోయించారు. రోడ్డు నిర్మించేటప్పుడు కొన్ని సంవత్సరాల వరకు కాంట్రాక్టర్‌దే బాధ్యతగా ఉండటంతో అధికారులు కూడా మట్టిని పోయించారు. కాని దాని పర్యవేక్షణను గాలికివదిలేశారు. దాంతో తనికెళ్ల దగ్గర రోడ్డుకి ఇరువైపుల మట్టి మొత్తం బురదమయమై గ్రామస్థులు ఇంటి ముందు ఉండలేకపోతున్నారు. వాహనదారులు పొరపాటున తారురోడ్డు దిగితే ఆ బురదలోకి వెళ్లి జారిపడుతున్నారు. బురదరోడ్డు నుంచి విముక్తి కలిగించాలని వాహనదారులు, గ్రామస్థులు కోరుతున్నారు.

రోడ్డు పక్కన బురదమయంగా ఉండటంతో ద్వి చక్ర వాహనాలు జారిపడుతున్నా యి. సోమవారం తనికెళ్ల ఉన్నత పాఠశాలకు వస్తున్న ఉపాధ్యాయురాలు నాగమణి ద్విచక్ర వాహనం పై వస్తూ పొరపాటున తారురోడ్డు పక్కన బురదరోడ్డుకు పోయి మరల తారురోడ్డును ఎక్కించే ప్రయత్నంలోనే వాహనం కిందపడి రోడ్డుపై పడింది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడింది. వెంటనే స్థానికులు ఆమెను 108 ద్వారా ఖమ్మం తరలించారు.



తనికెళ్లలో బీటీ రోడ్డు పక్కన మట్టిపోయడంతో బురదమయంగా మారిన దృశ్యం

నిర్వహణలో భాగంగా మట్టిపోశారు

● పంచాయతీరాజ్ డీఈ వెంకటేశ్వర్లు

రోడ్డు పక్కన దెబ్బతినటంతో మెయింటెన్స్‌లో భాగంగా రోడ్డు పక్కన భాగం దెబ్బతిన్న చోట మట్టిపోవడంతో మట్టిని పోపించడం జరిగింది. వర్షాలురావడంతో కొంత బురదకావడం జరిగింది. ప్రజలు ఇబ్బందిపడకుండా మట్టిని సరిచేయటం జరుగుతుంది.

నీటి కుంటలను సద్వినియోగం చేసుకోవాలి

కారేపల్లి, ఆగస్టు31(ఆంధజ్యోతి): ప్రభుత్వం ద్వారా రైతులకు మంజూరవుతున్న నీటి కుంటలను సద్వినియోగం చేసుకోవాలని రేగులగూడెం సర్పంచ్ వీసం మోతి వీరస్వామి అన్నారు. సోమవారం పంచాయతీ పరిధిలోని రామకృష్ణపురంలో నీటి కుంటల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆవుల సత్యనారాయణ, కార్యదర్శి రవి, ఫీల్డ్ అసిస్టెంట్ భద్రం, పిట్టల వెంకటేశ్వర్లు, రెడ్డెబోయిన చిన్న వెంకటేశ్వర్లు, అడప్ప వెంకటేశ్వర్లు, పిట్టల మధు, పోలెబోయిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మకరతోరణం అందజేత

మకరతోరణం అందజేస్తున్న దాతలు

పెనుబల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వీఎం బంజర్‌లోని దుర్గామల్లేశ్వరిస్వామి ఆలయంలో కొత్తకారాయిగూడెం గ్రామానికి చెందిన యలమంచి పుల్లయ్య, రామారావు-రాణి, విజయ్‌చౌదరి,- సునీత దంపతులు స్వామివారికి మకరతోరణంతోపాటు రూ.లక్ష విలువైన సోలార్ అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఎస్ఐకి సన్మానం

పెనుబల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వీఎం బంజర్ పోలీస్‌స్టేషన్‌లో రెండున్నర సంవత్సరాలపాటు ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించిన కె.వెంకటేష్‌ను లంకాసాగర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు తాళ్లూరి శేఖర్‌రావు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తాళ్లూరి శేఖర్‌రావు, కొల్లి రాజా, చావా శేషగిరిరావు, కొల్లి శ్రీను, ప్రసాద్, తేళ్ల సురేష్, ఉల్లి రవి, మేరుగు వెంకటేశ్వరరావు, పూజల ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

నేటినుంచి పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు

సత్తుపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పోస్టాఫీస్‌లో నేటినుంచి ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ గుగులోత్ రాజేష్ సోమవారం తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన రుసుముతో ఆయా సేవలైన ఆధార్‌లో అవసరమైన సవరణలు, అప్లికేసన్ సేవలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 1.30వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయని, సత్తుపల్లి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాలను సద్వినియోగించుకోవాలని కోరారు.